అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 06-3-2024

సంపుటి : 10 | సంచిక : 15 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

కుటుంబపాలన ప్రజాస్వామ్యానికి విఘాతం

- 140 కోట్ల మంది ప్రజలు నా కుటుంబ సభ్యులే
- మోడీ గ్యారంటీ అంటే..నెరవేర్చడమే..
- గెలిపిస్తే..మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతా : పటేల్‌గూడ బహిరంగ సభలో ప్రధాని మోడీ

బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ ఎందుకు చర్య తీసుకోవట్లేదు?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణను కొత్త ఏటీఎంగా మార్చుకున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ విమర్శించారు. తాను గ్యారంటీ ఇచ్చారంటే అది కచ్చితంగా నెరవేరుతుందని చెప్పారు. మరోమారు ఆశీర్వదించి తనను ప్రధానిగా చేస్తే ప్రపంచంలోనే భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పటేల్‌గూడలో పలు అభివృద్ధి పనులు, ఘట్‌కేసర్ - శేరిలింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు, పలు రహదారుల ప్రారంభోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఆ తర్వాత బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు. తెలంగాణకు బీజేపీ రుణపడి ఉంది' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. జమ్మూకాశ్మీర్ నుంచి తమిళనాడు వరకు ప్రాంతీయ పార్టీల కుటుంబాలు బాగుపడ్డాయనీ, ప్రతిభ ఉన్న నాయకులను ఆ పార్టీలు ఎదుగనివ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల కుటుంబవాదం ప్రజాస్వామ్యానికి విఘాతం అని హెచ్చరించారు. కుటుంబ వాదులకు దోపీడీ చేసే లైసెన్స్ ఉందా? అని ప్రశ్నించారు. కుటుంబవాదాన్ని వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. కొంత మంది తనకు కుటుంబమే లేదని చెప్పడాన్ని తప్పుబట్టారు. తనపై విమర్శలు చేస్తున్నవారికి వారి కుటుంబాలు ముఖ్యమైతే తనకు దేశంలోని ప్రతి కుటుంబమూ ముఖ్యమేనని చెప్పారు. కొందరు నాయకులు బహుమతులు తీసుకుని ఖజానా నింపుకుంటున్నారనీ, నల్లధనాన్ని దాచుకోవడానికి విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారని విమర్శించారు. అలాంటి వారి దొంగసొత్తును కక్కిస్తామని అని అన్నారు. అలా అన్నందుకే తనకు కుటుంబం లేదని విమర్శలు ...11లో



మూసీ ప్రక్షాళనకు సహకరించండి

అదనంగా 29 మంది ఐఏఎస్‌లను కేటాయించండి


- ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించండి
- జాతీయ రహదారులను సత్వరం పూర్తి చేయండి
- సెమి కండక్టర్ల పరిశ్రమకు తోడ్పాటునందించండి : ప్రధాని మోడీకీ సీఎం రేవంత్‌రెడ్డి వినతి

వివరాలు 3లో

రాష్ట్రానికి ఒరిగిందేం లేదు

ఎన్నికల ప్రచార సభలకే ప్రధాని పర్యటన పరిమితం

- అభివృద్ధి అంశాల ప్రస్తావనే లేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో ప్రధాని మోడీ పర్యటనతో రాష్ట్రానికి, ఆ జిల్లాలకు ఒరిగిందేం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. అభివృద్ధి అంశాల ప్రస్తావన కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారని తెలిపింది. ఇది ఎన్నికల సభ కాదంటూనే '400 సీట్లు' 'బీజేపీకే అందరి మద్దతు' అంటూ ప్రసంగించారని గుర్తు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పైగా అయోధ్య రామమందిరానికి బంగారు తలుపులు, ధ్వజస్థంభం తెలంగాణ నుంచే వచ్చాయనీ, రాముడి ఆశీర్వాదం ఈ రాష్ట్ర ప్రజలపై ఉంటుందనీ, ప్రధాని తన హోదాను మరిచి ఆలయ ధర్మకర్తలా మాట్లాడారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతో చేశామంటూ మాట్లాడిన మోడీ, ఆదిలాబాద్ జిల్లా ప్రజలు సుదీర్ఘ కాలంగా పోరాడుతున్న సీసీఐ పరిశ్రమను పున:ప్రారంభం, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు, జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు, ఆదివాసీలు అత్యధికంగా ఉండే ఈ జిల్లాకు ప్రత్యేకంగా గిరిజన విశ్వవిద్యాలయం కేటాయింపు, టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం తదితర అంశాలపై నోరు మెదపలేదని విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి, మెదక్-సంగారెడ్డి రైల్వేలైను, జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, ట్రామాకేర్ ఏర్పాటు వంటి అంశాల గురించి ప్రధాని ప్రసంగంలో ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ కేంద్రం పరిధిలోనివే అయినప్పటికీ, వాటిపై పల్లెత్తు మాట కూడా ప్రధాని మాట్లాడలేదని తెలిపారు. రాష్ట్ర విభజన హామీల అమలు నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని పేర్కొన్నారు. నదీజలాల వివాదాలు, రైల్వే కోచ్ ఏర్పాటు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రహదారుల నిర్మాణం వంటి అనేక అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని వివరించారు. దేశాభివృద్ధి తమతోనే సాధ్యమని చెప్పిన మోడీ ఊకదంపుడు ఉపన్యాసం రాబోయే పార్లమెంటు ఎన్నికల ప్రచారం కోసం తప్ప ఇక్కడ ఉపాధి కల్పనకు, అభివృద్ధికి తోడ్పడేది కాదని విమర్శించారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

- సాయిబాబాను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ(ఎం) వివరాలు 11లో

కాజీపేటలో అగ్నిప్రమాదం..

యార్డులో భారీగా ఎగిసిపడిన మంటలు

- రైల్వే యార్డులోని పాత రైలు బోగీలు దగ్ధం
- ఫ్లాట్‌ఫారం నుంచి పరుగులు తీసిన ప్రయాణీకులు




నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాజీపేట రైల్వే జంక్షన్‌లోని రైల్వే గూడ్స్ యార్డులో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రైల్వే ఫ్లాట్‌ఫారంకు అతి సమీపంలో రైల్వే గూడ్స్ యార్డులోని రైలు పట్టాలపై నిరూపయోగంగా (ఖండం బోగీలు) ఉన్న పాత రైలు బోగీల్లో లేచిన మంటలు కలకలం రేకెత్తించాయి. ఈ ఘటనలో పాత రైలు బోగీలు అగ్నికి ఆహుతై ఒక బోగీ పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ...11లో

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా నిర్దోషి

- ఆయనతో పాటు మరో ఐదుగురికి విముక్తి
- బాంబే హైకోర్టు తీర్పు
- పదేండ్ల పోరాటం తరువాత న్యాయం: ప్రొఫెసర్ సాయిబాబా భార్య వసంత కుమారి



వివరాలు 11లో

ఆకలి కేకలు

- రోజంతా పస్తే..
- దేశంలో 67 లక్షల మంది చిన్నారులకు నో ఫుడ్ : జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



వివరాలు 11లో



బీఆర్ఎస్- బీఎస్పీ పొత్తు

పార్లమెంట్ ఎన్నికల్లో కలిసే పోటీ

- ఒకట్రెండు రోజుల్లో సీట్ల పంపకాలపై ప్రకటన
- మాయావతితో చర్చించి విధివిధానాలు ఖరారు : కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ముప్పు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కొత్త పొత్తులు పొడుస్తున్నాయి. ఊహించని విధంగా బీఆర్ఎస్ బీఎస్పీ మధ్య పొత్తు ఖరారైంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో భేటీ అయ్యారు. పొత్తు విషయమై జరిపిన చర్చలు సఫలమయ్యాయి. అనంతరం ఇరువురు నేతలు సయుక్తంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శకానికి తమ పొత్తు నాంది పలుకుతుందని ప్రకటించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతితో చర్చించిన తర్వాత సీట్ల పంపకాలపై ఓ నిర్ణయానికి రానున్నట్టు వెల్లడించారు.

బీఎస్పీతో గౌరవప్రదమైన పొత్తు : కేసీఆర్

లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీతో గౌరవ ప్రదమైన పొత్తు ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. సిద్ధాంత పరంగా రెండు పార్టీలు ఒకే విధాన్నాన్ని అవలంభిస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు రావని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళిత బంధు సహా ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పొత్తు విషయమై ప్రవీణ్ కుమార్ బీఎస్పీ అధిష్టానం అనుమతి తీసుకున్నారని తెలిపారు. త్వరలోనే సీట్లు, విధివిధానాలను ప్రకటిస్తామని కేసీఆర్ తెలిపారు. బీఎస్పీ అధినేత్రి మాయావతితో ఒకట్రెండు రోజుల్లో చర్చలు జరిపి ఓ అవగాహనకు రానున్నట్టు చెప్పారు. ఎవరెన్ని సీట్లల్లో పోటీ చేసినా పరస్పరం సహకరించుకుని ముందకు వెళుతామని తెలిపారు. .

ప్రమాదంలో సెక్యులరిజం: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

దేశంలో సెక్యులరిజం ప్రమాదంలో పడిందనీ, అందువల్లే రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. దేశాన్ని చిన్నాభిన్నం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ప్రవీణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కూడా అది కుట్ర చేస్తున్న తరుణంలో లౌకికత్వాన్ని కాపాడటంతో పాటు కేసీఆర్‌తో కలిసి ఈ రాష్ట్రాన్ని కాపాడుకుంటామని పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత్రి మాయావతి సూచనల మేరకు ముందుకు వెళ్తామని ప్రకటించారు. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరిన తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. తమ మధ్య కుదిరిన పొత్తు తెలంగాణలోని బహుజన వర్గాల జీవితాలు బాగుపడేందుకు తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కూడా గడవక ముందే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తాను వ్యక్తుల మీద పోరాటం చేయలేదని, ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు మాత్రమే నిలదీశానని గతంలో బీఆర్ఎస్‌పై చేసిన విమర్శల గురించి వ్యాఖ్యానించారు. కాగా తమ పొత్తును తెలంగాణ సమాజం ఆశీర్వదిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి




వివరాలు 11లో

మా పాలన చూసి ఓటేయండి..

అదే అసలైన గీటురాయి...

- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ పిలుపు
- లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని ధీమా
- రేపు లేదా ఎల్లుండి అభ్యర్థులను ప్రకటిస్తాం
- బీఆర్ఎస్, బీజేపీలది చీకటి ఒప్పందం
- అందుకే 'కాళేశ్వరం'పై కేంద్రం సాగదీస్తోంది: పాత్రికేయుల ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి
- అసలైన సాగుదార్లకే రైతు భరోసా ఇస్తామంటూ స్పష్టీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిసెంబరు తొమ్మిదిన మొదలైన తమ పరిపాలనను, అప్పటి నుంచి ఇప్పటి వరకూ తీసుకున్న నిర్ణయాలను చూసి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల పట్ల తమ చిత్తశుద్ధికి అదే అసలైన గీటురాయని ఆయన వ్యాఖ్యానించారు. ఒకరకంగా ఎంపీ ఎన్నికలు తమ పాలనకు రిఫరెండమని తెలిపారు. రాష్ట్రంలో కచ్చితంగా 14 లోక్‌సభ స్థానాలను తమ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గురు లేదా శుక్రవారం అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్... పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు, సాగునీటి పారుదల శాఖతోపాటు వివిధ శాఖల్లో గతంలో జరిగిన అవినీతి, అవకతవకలు, వాటిపై విచారణలు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తీరు, ఆ పార్టీ అధినేత కేసీఆర్ వ్యవహారశైలి, ఎల్ఆర్ఎస్ తదితరాంశాలపై ఆయన తన అభిప్రాయాలను ఈ సందర్భంగా వెలిబుచ్చారు. కేసీఆర్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయన సెటైర్లు వేస్తూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆయన్ను తాను 'పెద్దన్న' అని సంబోధించటంపై వస్తున్న విమర్శలను సీఎం ఈ సందర్భంగా తిప్పికొట్టారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన్ను అధికారికంగానే కలిశాను తప్పితే అందులో రాజకీయ కోణమేమీ లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ లాగా తాను ప్రధాని చెవిలో గుసగుసలు పెట్టలేదన్నారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా సాయం చేయాలంటూ బహిరంగంగానే ప్రధానికి విజ్ఞప్తి చేశానని గుర్తు చేశారు.

గత బీఆర్ఎస్ సర్కారు... తన పదేండ్ల హయాంలో రాష్ట్రంలో వందేండ్ల విధ్వంసాన్ని సృష్టించిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆ పార్టీని ప్రజలు ...2లో

యువత పస్తులుంటూ జైశ్రీరామ్ అనాలా..?

- మోడీ కోరుకుంటున్నది ఇదే : రాహుల్ గాంధీ



షాజపూర్ /గౌహతి: ప్రధాని మోడీ, ఆయన సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం యువతను తప్పుదారి పట్టిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని షాజపూర్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా మంగళవారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ మోడీ లక్ష్యంగా రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. కుల గణన చేపడితేనే ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. తమ విధానం అదేనని, సామాజిక న్యాయం దిశగా విప్లవాత్మక చర్యగా కుల గణన చేపట్టి తీరుతామని అన్నారు. స్వాతంత్రోద్యమం, హరిత విప్లవం, డిజిటల్ విప్లవం ఏదైనా విప్లవాత్మక కార్యక్రమాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాహుల్ పేర్కొన్నారు. అయితే ప్రధాని మోడీ మాత్రం మన యువత వారి ఫోన్లకు అతుక్కుపోయి జై శ్రీరాం నినాదాలు చేస్తూ ఆకలితో ...11లో

ఆశ్రమ బడుల్లో అనారోగ్యం

పౌష్టికాహార లోపం.. విద్యార్థులకు శాపం

- రక్తహీనతతో ఆస్పత్రుల పాలవుతున్న చిన్నారులు
- అనేక పాఠశాలల్లో అమలుకు నోచుకోని మెనూ
- ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణపై ఆరోపణలు

ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని తొడసం మహేశ్వరి ఇటీవల రక్తహీనతతో బాధపడుతూ రిమ్స్‌లో చేరింది. రెండు గ్రాముల రక్తం మాత్రమే ఉండటంతో చికిత్స పొందుతూ చనిపోయింది. గతేడాది ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని కూడా మృతిచెందింది. తాజాగా మరో విద్యార్థిని రక్తహీనతతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది.

నేరడిగొండ ఆశ్రమ పాఠశాలలో గతేడాది ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పలువురు విద్యార్థులు రిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రతి ఏటా జరుగుతుండటం ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితులను తెలియజేస్తోంది. విద్యాబుద్ధులు నేర్చుకొని ప్రయోజకులు కావాల్సిన చిన్నారులు సరైన పౌష్టికాహారం లేక ఆస్పత్రుల పాలవుతున్నారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగానే ఆశ్రమ పాఠశాలలు అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయనే విమర్శలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి (ఎం.సురేష్)

గిరిజన విద్యార్థులకు వసతితో కూడిన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 326 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 133 ఆశ్రమ పాఠశాలలు ఉండగా బాలుర పాఠశాలలు 77 ఉండగా.. బాలికల కోసం మరో 56 పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సుమారు 35వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగే ఈ పాఠశాలల్లో ఉచిత విద్యతోపాటు నాణ్యమైన భోజనం కోసం ఒక్కో విద్యార్థికి నెలకు సుమారు రూ.1150వరకు అందజేస్తోంది. వీరికి రోజూ ఉదయం మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉంటుంది. పాలు, గుడ్లు, రాగిజావ, పులిహోరతోపాటు మధ్యాహ్నం సమయంలో కూరగాయలతో కూడిన భోజనం అందించాల్సి ఉంటుంది. వారానికి రెండు సార్లు కోడిగుడ్లు, అరటిపండ్లతోపాటు చికెన్‌తో కూడిన మెనూ



అమలు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా అనేక మంది విద్యార్థులు రక్తహీనత భారినపడుతున్నారు. పప్పు కూడా నీళ్ల చారులా ఉండటంతోపాటు నాసిరకం భోజనం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా సరైన మెనూ పాటించకపోవడం కారణంగానే విద్యార్థులు పౌష్టికాహారంతో బాధపడుతున్నారని తెలిసింది. ఇటీవల రోజుకొకరు ఇదే సమస్యతో ఆస్పత్రిపాలవుతున్నారు. 'నవతెలంగాణ' పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఆరోగ్య పరీక్షలు కరువు..!

గతంలో ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏఎన్ఎంలు ఉండేవారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు అందించేవారు. అనారోగ్యం తలెత్తిన సమయంలో సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లి రక్త పరీక్షలు చేయించేవారు. కానీ గత ప్రభుత్వం వీరిని అర్ధాంతరంగా తొలగించడంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేవారు లేకుండా పోయారు. గతంలో పాఠశాలల్లో విద్యార్థుల వారీగా జవహర్ బాల స్వస్థఆరోగ్య రక్ష కార్డులు అందించేవారు. వీటి ద్వారా ప్రతి ...2లో

గృహజ్యోతిలో అర్హులకు అన్యాయం

- 90 లక్షల కుటుంబాల్లో 30 లక్షల మందికే 'జీరో' బిల్లులు
- ఒక్క యూనిట్ పెరిగినా మొత్తం బిల్లు కట్టమనడం సరికాదు విధివిధానాలు మార్చాలి : సీఎంకు మాజీ మంత్రి టీ హరీశ్‌రావు బహిరంగలేఖ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గృహజ్యోతి పథకంలో అర్హులకు అన్యాయం జరుగుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులు ఉంటే, వారిలో కేవలం 30 లక్షల మందికే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు మంగళవారంనాడాయన ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసారు. 200 యూనిట్లు దాటి ఒక్క యూనిట్ పెరిగినా మొత్తం బిల్లు చెల్లించాలని చెప్తున్నారనీ, అలాకాకుండా పెరిగిన యూనిట్ల వరకే బిల్లులు వసూలు చేసేలా విధివిధానాల్లో మార్పులు చేయాలని సూచించారు.

దీనివల్ల వినియోగదారులు రోజూ తాము ఎంత కరెంటు కాలుస్తున్నామో...ఫ్యాన్ వేసుకోవాలా వద్దా అని మీటర్ రీడింగ్ చూస్తూ గడిపే దుస్థితికి నెట్టబడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో 30 లక్షల మంది పేదలు ఉంటే వారిలో కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని నిర్ణయించారనీ, దీనివల్ల మిగతా వారికి నష్టం కలుగుతుందని చెప్పారు. అలాగే ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవడం సరికాదనీ, ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా విడిపోయి బతుకుతున్నారని తెలిపారు. వారంతా ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో, వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారనీ, కానీ ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకాన్ని వర్తింపచేస్తున్నదనీ, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. విధివిధానాల్లో ఈ మార్పులు కూడా చేయాలని సూచించారు.

ఆశ్రమ బడుల్లో అనారోగ్యం..!



(మొదటిపేజీ తరువాయి)

నెలా వైద్యులు ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేయించేవారు. కానీ కొన్ని ఏండ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే వీరు అందుబాటులోకి రానున్నట్టు అధికారులు చెబుతున్నారు.



పర్యవేక్షణ మరిచిన అధికారులు..!

ఆశ్రమ పాఠశాలలను నిత్యం పర్యవేక్షణ చేపడుతూ విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ఐటీడీఏ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. రోజువారీగా మెనూ పాటించకుండా పాఠశాలల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారి పైస్థాయి అధికారులను మచ్చిక చేసుకొని నిబంధనలు తుంగలో తొక్కుతున్నట్టు తెలిసింది. విద్యార్థులు సైతం నోరెత్తి అడగలేని పరిస్థితి ఉంటోంది. మెనూ పాటించడం లేదని ప్రశ్నిస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో విద్యార్థులు అడగలేకపోతున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా వీటిపై దృష్టిసారించి గిరి విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా కృషిచేస్తే ఆరోగ్యవంతులుగా ఎదగడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పుడు పౌష్టికాహారం అందిస్తే ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలి

పూసం సచిన్, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు



ఆశ్రమ పాఠశాలల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలి. పౌష్టికాహార లోపంతోపాటు ఆరోగ్య పరిరక్షకులు లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. విద్యార్థుల మరణాలను అరికట్టాలి. ఏఎన్ఎంలను నియమించడంతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి. మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



రక్త పరీక్షలు చేయిస్తున్నాం

దిలీప్, ఐటీడీఏ డీడీ

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే బృందాలతో విద్యార్థులకు రక్త పరీక్షలు చేయిస్తున్నాం. విద్యార్థుల రక్తహీనతకు కారణాలను వైద్యుల నుంచి నివేదిక తెప్పించుకుంటాం. వారు సూచనలు, సలహా ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం. ఐరన్ లోపం కలిగిన మందులు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే వారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తదుపరి ప్రణాళిక రూపొందిస్తాం. ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తాం.

కాంగ్రెస్ అభ్యర్థులెవరు?

- కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలపై ఉత్కంఠ
- ఫైనల్ అయిన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు
- ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్న ఆశావహులు
- కరీంనగర్‌లో 'వెలిచాల' అభ్యర్థిత్వంపై సంకేతాలు
- ప్రాధాన్యత సంతరించుకోనున్న రేపటి ముఖ్యమంత్రి పర్యటన



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్, పెద్దపల్లి స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లు ఫైనల్ అయ్యాయి. బీజేపీ నుంచి కరీంనగర్ అభ్యర్థి ఎవరో తేలిపోయింది. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉండి ఈ రెండు స్థానాల్లో ప్రధాన పోటీదారుగా ఉన్న కాంగ్రెస్ క్యాండిడేట్స్ ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొల్పింది. ఈ రెండు స్థానాలకూ పదుల సంఖ్యలో అర్జీలు రాగా.. ప్రధానంగా ఒకరిద్దరి పేర్లే తెరమీదకు వస్తున్నాయి. పార్టీ క్యాడర్, ప్రజల్లో వచ్చే 'సర్వే' సానుకూలతను బట్టే అభ్యర్థులెవరో నిర్ణయించే పనిలో హైకమాండ్ నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో 'వెలిచాల' అభ్యర్థిత్వంపై సంకేతాలు రాగా.. పెద్దపల్లిలో పోటీదారు ఎవరో చడీచప్పుడు లేదు. వేములవాడలో రేపటి ముఖ్యమంత్రి పర్యటన ప్రాధాన్యత సంతరించుకోగా.. మరికొద్ది రోజుల్లోనే అభ్యర్థులను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

'వెలిచాల'కు చాన్స్ అంటూ సంకేతాలు

కరీంనగర్ కాంగ్రెస్ టిక్కెట్‌కు ఫుల్ డిమాండ్ ఉందనే చెప్పొచ్చు. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ ఆశించి భంగపడిన వాళ్ల 12 మంది ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వారిలో ప్రధానంగా సీనియర్ నేత ఎమ్మెస్సార్ మనువడు రోహిత్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు. కొత్తగా వెలిచాల జగపతిరావు తనయుడు రాజేందర్‌రావు పేరు తెరమీదకు వచ్చింది. వెలమలకు కంచుకోటగా పేరున్న కరీంనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అదే సామాజిక తరగతికి చెందిన వారు కావడంతో.. రాజేందర్‌రావుకు కాంగ్రెస్ టిక్కెట్ ఖాయమనే సంకేతాలు వెలువడుతున్నాయి. అందులోనూ ఆయన గతంలో చిరంజీవి ప్రజారాజ్యం తరఫున పోటీ చేసి లక్షా 60వేల ఓట్లు సాధించిన చరిత్ర కూడా ఉంది. తరువాత బీఆర్ఎస్‌లో చేరినా ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారన్న అభిప్రాయం ఉండటం పట్ల అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపుతున్నట్టుగా కనిపిస్తోంది.

పెద్దపల్లి టిక్కెట్ కోసం బిగ్‌ఫైట్

పెద్దపల్లి లోక్‌సభ స్థానంలోనూ (ఎస్సీ రిజర్వుడ్) ఆశావహుల నుంచి పెద్దఎత్తునే టిక్కెట్ కోసం పోటీ నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 29 అప్లికేషన్లు వచ్చిన పార్లమెంట్ సెగ్మెంట్ కూడా ఇదే. అందుకు కారణాల్లేకపోలేదు. ఈ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లనూ ఆ పార్టీయే క్లీన్ స్వీప్ చేసింది. ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో ఉండబోతున్న కొప్పుల ఈశ్వర్‌కు దీటైన అభ్యర్థి ఎంపికలో హైకమాండ్ క్షేత్రస్థాయి సర్వేలో నిమగ్నమైంది. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కొడుకు వంశీకృష్ణ పేరు ప్రధానంగా వినిపిస్తున్నా.. మంత్రి శ్రీధర్‌బాబు వర్గం ఆశీస్సులు లేవనే ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు తాను స్థానికుడినని, తనకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజిక తరగతికి చెందిన.. టీపీసీసీ కార్యదర్శి పెరిక శ్యామ్ పట్టుబడుతున్నారు. ఇటీవల పెద్దపల్లి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత సైతం కాంగ్రెస్‌లో చేరిపోయారు. అయితే, సిట్టింగ్ ఎంపీగా వెంకటేష్ వైఫల్యాలే అధిష్టానానికి అడ్డుగా ఉన్నాయన్న చర్చ సాగుతోంది. ఈ ముగ్గురూ కాకుండా పార్టీ సీనియర్ నేతను బయట నుంచి తీసుకొచ్చి పోటీలో దింపుతారా? అన్న ఉత్కంఠ నెలకొంది.

రెండు స్థానాల్లో ఫైనల్ అయిన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు

కరీంనగర్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈయన 2014లో ఇక్కడి నుంచే ఎంపీగా పని చేసి.. కరీంనగర్ స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు, కొత్తపల్లి -మనోహరాబాద్ రైల్వేలైన్ వంటి పనులు చేపట్టేందుకు కృషి చేశారన్న పేరుంది. తరువాతి ఎన్నికల్లో ఓడినప్పటికీ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ సర్కారులో ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా సేవలందించారు. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు ఏడాది కాలంగా కరీంనగర్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్లలో సభలు, సమావేశాల పేరుతో చుట్టుముడుతున్నారు. ఇంకోవైపు పెద్దపల్లి స్థానం నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరు ఫైనల్ అయింది. ఈయన గులాబీదళం నుంచే పోటీ చేస్తూ ఏడు సార్లు ఎమ్మెల్యేగానూ, రెండుసార్లు మంత్రిగానూ పని చేశారు. తన సొంత నియోజకవర్గం ధర్మపురి సహా పక్కనే ఉన్న పెద్దపల్లి, రామగుండంలోనూ మంచి పట్టున్న నాయకుడిగానే చెప్పొచ్చు. పైగా గతంలో సింగరేణి కార్మిక నాయకుడిగా పని చేసిన ఆయనకు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లోనూ కార్మిక నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ రెండు స్థానాల్లో బీఆర్ఎస్ తన బలమైన అభ్యర్థులనే ఫైనల్ చేసింది. మరోవైపు కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ పేరునే మళ్లీ బీజేపీ అధిష్టానం ప్రకటించింది. అయితే, ఈయన చేసిన అభివృద్ధి పనులు పెద్దగా లేకపోయినా కేంద్రంలోని మోడీ చరిష్మాతో గెలుస్తాననే దీమా వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లిలో బీజేపీ నుంచి ఆ పోటీగానీ, ఆశావహులుగానీ పెద్దగా తెరమీదకు రావడం లేదు.

ప్రాధాన్యత సంతరించుకోనున్న ముఖ్యమంత్రి పర్యటన

ఈ నెల 7న రాజన్నసిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఆయన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికే వస్తున్నా.. వేములవాడ గుడి చెరువు మైదానంలో నిర్వహించబోయే బహిరంగ సభ ప్రాధాన్యత సంతరించుకోనుంది. జిల్లా ఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి, తరువాత కాంగ్రెస్ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. అనంతరం వేములవాడ గుడి చెరువు మైదానంలో బహిరంగ సభకు ప్లాన్ చేశారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజవకర్గాల పార్టీ శ్రేణులను, ప్రజలను సభకు తరలించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభను ఎన్నికల ప్రచార నేపథ్యంగానే భావిస్తున్నారు.

కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం..

- వారి అవినీతిని కాంగ్రెస్ ఎంత కాలం కాపాడుతుందో చూస్తం పటాన్‌చెరు బహిరంగ సభలో ప్రధాని మోడీ
- రూ.7200 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- ఘట్‌కేసర్-లింగంపల్లి వరకు ఎంఎంటీఎస్ రైల్ షురూ
- సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్, గ్యాస్ పైప్‌లైన్, హైవేలు జాతికి అంకితం
- పలువురు సీపీఐ(ఎం) నాయకుల ముందస్తు అరెస్టు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏ ఒక్కటే: కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"బీఆర్ఎస్, కాంగ్రెస్‌ది అవినీతి బంధం. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారింది. బీఆర్ఎస్ అవినీతిని కాంగ్రెస్ ఎంత కాలం కాపాడుతుందో చూస్తం. అది ఎక్కువ కాలం నిలవదు.." అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణ ప్రజలు చూపుతున్న ప్రేమ, విశ్వాసం, నమ్మకాన్ని దుర్వినియోగం చేయబోనన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు మండలం పటేల్ గూడెం మైదానంలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి సభాస్థలికి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన మోడీకి రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్, కేంద్ర పర్యాటక మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.7200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.333 కోట్ల వ్యయంతో చేపట్టిన పరదీప్ హైదరాబాద్ గ్యాస్ పైప్‌ను జాతికి అంకితం చేశారు. రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్‌ను మోడీ ప్రారంభించారు. రూ.1165 కోట్ల వ్యయంతో ఘట్‌కేసర్-లింగంపల్లి మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) రైల్‌ను మోడీ జెండా ఊపి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.1408 కోట్ల నిధులతో కంది రాంసాన్‌పల్లి, మిర్యాలగూడ-కోదాడ రెండో లైన్ జాతీయ రహదారిని కూడా ప్రారంభించారు.

అదే విధంగా పూణే-హైదరాబాద్ రహదారిలో సంగారెడ్డి మీదుగా మదీనాగూడ ఆరులైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు మోడీ శంకుస్థాపన చేశారు. మెదక్, ఎల్లారెడ్డి రెండో లైన్‌హైవే విస్తరణ, ఎల్లారెడ్డి రుద్రూర్ హైవే పనులకూ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఎటీఎంగా మారిందన్నారు. బీఆర్ఎస్ అవినీతిని కాంగ్రెస్ కాపాడుతూ వస్తుందని, అది ఎంతో కాలం నిలవదన్నారు. బీజేపీలో యువతకు అవకాశాలు వస్తుండటంతో రాష్ట్రంలోని కుటుంబ పార్టీలకు భయం పట్టుకుందన్నారు. తన కంటూ సొంత ఇల్లు కట్టుకోలేకపోవచ్చు కానీ.. దేశంలో ఇండ్లులేని కోట్ల మందికి ఇండ్లు కట్టించానని గుర్తు చేశారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో ఎంపీలు లక్ష్మణ్, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరి, ఎస్పీ రూపేష్, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకుల ముందస్తు అరెస్టు



ప్రధాని నరేంద్ర మోడీ సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో అకారణంగా పలువురు సీపీఐ(ఎం) నాయకుల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. సోమవారం రాత్రి సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎం.యాదగిరిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లోనే నిర్బంధించారు. సంగారెడ్డిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, నర్సింతో పాటు పటాన్‌చెరులో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, వాజీద్‌లను కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఐ(ఎం) నాయకుల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.

ప్రధాని మోడీ సంగారెడ్డి జిల్లా ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక రహదారులు, రైల్వే లైన్ల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణానికి నిధులివ్వకుండా, ఇప్పుడు రాజకీయ ప్రచారం కోసం శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోధన్-నారాయణఖేడ్-బీదర్ రైల్వే లైన్ నిర్మాణం కోసం 2010, 2015లో సర్వే చేసినప్పటికీ ఇప్పటికీ గతిలేదన్నారు. నిజాంపేట్-బీదర్ లైన్‌కు రూ.513 కోట్లు కేటాయించినా పనుల్లో ప్రగతిలేదని ఆరోపించారు. నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఎలాంటి భరోసా లేకుండా పోయిందన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

- నా చావుకు ఎస్ఐ, సూపరింటెండెంటే కారణం
- వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్, సెల్ఫీ వీడియో
- విచారణ చేపట్టిన ఇబ్రహీంపట్నం పోలీసులు
- గతంలోనే మృతుడిపై పలు కేసులు
- పలు కారణాలతో విధుల్లో నుంచి తొలగించిన వైనం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

తన చావుకు ఇబ్రహీంపట్నం ఎస్ఐ మైబెల్లి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథే కారణమని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. వారి వేధింపుల వల్లనే ఆత్మహత్య చేసుకున్నట్టు సూసైడ్ నోట్ రాసి, సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అనంతరం ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని నరసింహస్వామి ఆలయం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం విచారణ చేపట్టినట్టు ఏసీపీ పీవీ రాజు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ ఘటనపై ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా అతని కుమారుడు జయంత్‌ను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. అయితే ఆస్పత్రిలో అతని ప్రవర్తన సరిగా లేకపోవడం వల్ల గత నెల 29వ తేదీన విధుల్లో నుంచి తొలగించారు. దాంతో మనస్తాపానికి గురైన జయంత్ పలుమార్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథ్‌తో ఘర్షణకు దిగారు. అప్పటికే మృతునిపై రఘునాథ్ గతంలోనే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు నేపథ్యంలో మరింత మనస్తాపానికి గురైన జయంత్.. అతనూ ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించి ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథ్‌పై ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు.అయితే ఇబ్రహీంపట్నం ఎస్ఐ మైబెల్లి అతని ఫిర్యాదును స్వీకరించలేదు. పోలీసులు సైతం రఘునాథ్ వైపే నిలిచారని ఆరోపిస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని నరసింహస్వామి ఆలయం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ముందు వీడియో తీస్తూ ఇబ్రహీంపట్నం ఎస్ఐ మైబెల్లి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథ్ వేధింపులే కారణమంటూ సూసైడ్ నోటు రాశారు. దాంతో మృతుని తల్లి విజయలక్ష్మి తన కుమారుని చావుకు ఎస్ఐ మైబెల్లితో పాటు రఘునాథ్ కారణమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీని కలిసి ఫిర్యాదు చేశారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని ఏసీపీ తెలిపారు.

పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలోని జీఏడీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ నెల 16న నిర్వహించబోయే పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జె.కుమార స్వామి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయం సాధారణ పరిపాలనా శాఖలో 100 మందికిపైగా 20 ఏండ్లుగా ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు. ఆ సిబ్బంది అనుభవాన్నే నైపుణ్యానికి ప్రామాణికంగా పరిగణించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మా పాలన చూసి ఓటేయండి..

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించారని ఎద్దేవా చేశారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పాలనను గాడిలో పెట్టేందుకు ధృడ సంకల్పంతో పని చేస్తున్నామని వివరించారు. అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొడుతున్న ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ తీరును సీఎం తప్పుబట్టారు. 'ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అంటూ మా చేతికి కాగితమైతే అందింది, కానీ మనిషే కనబడటం లేదు...' అంటూ ఎద్దేవా చేశారు. శాసనసభకు రాని వ్యక్తి ప్రధాన ప్రతిపక్ష నేత ఎలా అవుతారంటూ ప్రశ్నించారు. తాను సీఎం హోదాలో ప్రధాని మోడీని కలిసిన మాదిరిగానే... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలపై తనను కలుస్తున్నారని చెప్పారు. దీనిపై రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే పడిపోతుదంటూ కామెంట్ చేస్తున్న వారు, అది ఎందుకు పడిపోతుందో చెప్పాలంటూ ఎదురు ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా నిరాహారదీక్ష చేయాలంటూ సూచించారు.

తానో పెద్ద ఇంజినీర్‌నంటూ ఫోజు కొడుతూ కేసీఆర్ కట్టిన కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ... ఇప్పుడు మేడిపండైదంటూ సీఎం విమర్శించారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కుండిపోయిన మేడిగడ్డను ఇప్పటి వరకూ ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు.



తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చీకట్లో వెళ్లొచ్చారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన రిపోర్టు ప్రకారమే తాము ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలువురిపై చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పైనా చర్యలుంటాయని హెచ్చరించారు. తన చదువుతోపాటు అనేక విషయాల్లో కేసీఆర్ నిత్యం అబద్ధాలను వల్లె వేస్తారంటూ విమర్శించారు. జలీల్‌ఖాన్ తరహాలో తాను 'ఎమ్మెస్సీలో పొలిటికల్ సైన్స్' చదివానంటూ కేసీఆర్ చెప్పుకున్నారని గుర్తు చేశారు. అసలు ఎమ్మెస్సీలో పొలిటికల్ సైన్స్ ఉంటుందా..? అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరానికి సంబంధించి లోక్‌సభ ఎన్నికల్లోపు ఎన్‌డీఎస్ఏ రిపోర్టు ఇస్తే... ఆ వెంటనే చర్యలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి సంబంధించి గతంలో జరిగిన అవినీతిపై ఆడిట్ ప్రస్తుతం కొనసాగుతోందని సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. గత బీఆర్ఎస్ హయాంలో ఇసుక ద్వారా రోజుకు కోటి వరకూ ఆదాయం వచ్చేదన్నారు. ఇప్పుడది రెండున్నర కోట్లకు చేరిందని చెప్పారు. జీఎస్టీ రూపంలో వచ్చే ఆదాయం రూ.500 కోట్లకు పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఇదే రకమైన ఆదాయం వచ్చినా...దాన్ని మొత్తం బొక్కి, రాబడిని తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. వివిధ శాఖల్లో గతంలో జరిగిన అవినీతిపై విచారణ చేయించేందుకు తమ వద్ద సరైన అధికారులు లేరని చెప్పారు. ఉన్న వారు కూడా విచారణ సరిగా చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పోలీసులతోనే విచారణ చేయించలేమని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయంటూ రేవంత్ ఈ సందర్భంగా విమర్శించారు. అందుకే కాళేశ్వరంపై కేంద్రం సాగదీస్తోందని అన్నారు. అందులో భాగంగానే మోడీ సర్కార్ వేసిన నిపుణుల కమిటీ విచారణకు నాలుగు నెలల సమయం కావాలంటూ కోరుతోందని అన్నారు. అప్పటి వరకూ ఆ రెండు పార్టీల మధ్య సర్దుబాటు జరుగుతుందేమోననే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థుల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక స్పష్టమైన అవగాహనతోనే ఉన్నాయని అన్నారు. అందుకే మెదక్, చేవెళ్ల అభ్యర్థులను ఇప్పటి వరకూ ప్రకటించలేదని విమర్శించారు. తమ పార్టీకి సంబంధించి ఎంపీ అభ్యర్థుల కసరత్తు ఒక కొలిక్కి వచ్చిందని సీఎం తెలిపారు. సోనియా, రాహుల్...ఇద్దరిలో ఎవరో ఒకరు తెలంగాణ నుంచి పోటీ చేస్తే రాష్ట్ర గౌరవం పెరుగుతందని ఆయన వ్యాఖ్యానించారు. పీసీసీ, పీఈసీలో ఈ మేరకు తీర్మానించామన్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత ప్రచారాన్ని హోరెత్తిస్తామని చెప్పారు. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వల్ల ఏం జరుగుతుందో చూద్దామంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయబోరని రేవంత్ స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి తన తమ్ముడు కొండల్‌రెడ్డి పోటీ చేస్తారనే వార్తల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు.

ట్యాక్స్ పేయర్స్‌కు రైతు భరోసా (రైతు బంధు) ఎందుకివ్వాలంటూ సీఎం ఈ సందర్భంగా ప్రశ్నించారు. అసలైన సాగుదార్లకే పెట్టుబడి సాయం ఇస్తామని వెల్లడించారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి, ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అవసరమైతే అఖిలపక్షంతోపాటు రైతు, కూలీ సంఘాల సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. అంతేతప్ప ఫాంహౌస్‌లు, రాళ్లు, రప్పలున్న భూములకు పెట్టుబడి సాయం అందించేది లేదని స్పష్టం చేశారు. ప్రయివేటు యూనివర్సిటీలపై విచారణ నిర్వహిస్తామని తెలిపారు. డీఎస్సీ -2008 అభ్యర్థుల సమస్య ఈనాటిది కాదన్నారు. అది 15 ఏండ్లుగా కొనసాగుతోందనీ, అందువల్ల 15 నిమిషాల్లో పరిష్కరించలేమని చెప్పారు. అడ్వకేట్ జనరల్ సలహా తీసుకుని, ఈ విషయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకుంటామంటూ సీఎం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పరువు పోతోంది..

- 'విశ్వగురు'గా గుర్తించడం లేదు
- ప్రపంచ దేశాల్లో దిగజారుతున్న ప్రతిష్ట
- ఆంక్షలు, అణచివేతను ఎండగడుతున్న అంతర్జాతీయ సమాజం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తరచుగా మన దేశాన్ని 'విశ్వగురు' (ప్రపంచ నేత)గా అభివర్ణిస్తుంటారు. కానీ వాస్తవానికి ప్రపంచం మనల్ని అలా చూడడం లేదు. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని, హిందూత్వవాదం ప్రబలుతోందని ఐరాస నిపుణులు, పౌర సమాజ బృందాల నుండి అంతర్జాతీయ మీడియా, పలు దేశాల పార్లమెంటేరియన్ల వరకూ ముక్తకంఠంతో విమర్శిస్తున్నారు. భారతావనిలో ప్రజాస్వామ్య వ్యవస్థ దుస్థితిని ఏకరువు పెడుతున్నారు. ఫిబ్రవరి 15-29 తేదీల మధ్య ఆయా సంస్థలు అందించిన నివేదికలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.



అణచివేతే : అంతర్జాతీయ మీడియా

'భారతదేశంలోని పౌర సమాజంపై దశాబ్ద కాలంగా అధికార బీజేపీ సాగిస్తున్నది. అణచివేతే. సైద్ధాంతిక ప్రత్యర్థులను మినహాయిస్తే తమ విదేశీ నిధుల లైసెన్సులు కోల్పోయిన వారిలో సగం మందికి పైగా క్రైస్తవులు లేదా ముస్లింలే. అధికార పార్టీ అకృత్యాలకు అడ్డుకట్ట వేయాల్సిన సుప్రీంకోర్టు తన స్వతంత్రతను కోల్పోతోంది' అని లండన్ నుండి వెలువడుతున్న 'ది ఎకనమిస్ట్' పత్రిక ఎండగట్టింది. 'ప్రొఫెసర్ అశోక్ స్వెయిన్‌కు చెందిన ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఒసీఐ) హోదాను భారత ప్రభుత్వం రద్దు చేసింది. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో వందకు పైగా ఓసీఐ హోదాలు రద్దయ్యాయి. స్వీడన్‌కు చెందిన ప్రొఫెసర్ స్వెయిన్ శాంతి, ఘర్షణలపై అధ్యయనం చేస్తున్నారు. అయితే ఆయన భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం ఆరోపించింది' అని సింగపూర్ నుండి ప్రచురితమయ్యే 'ది స్ట్రెయిట్ టైమ్స్' పత్రిక పేర్కొంది.

'2018లో నిరసనలు జరిగినప్పుడు హర్యానా ముఖ్యమంత్రి ఇజ్రాయిల్‌లో పర్యటించారు. ఆందోళనలను అణచివేసేందుకు అక్కడి పోలీసులు, సైనికులు అనుసరించిన వ్యూహాలను గమనించారు. ఇటీవల భారత్‌లో రైతులు నిరసన ప్రదర్శనలు జరిపినప్పుడు వారిపై హర్యానా పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అందుకోసం డ్రోన్లను వాడారు. ఇజ్రాయిల్‌లో తాను గమనించిన వ్యూహాలనే ఇక్కడ పోలీసులతో అమలు చేయించారు' అని లండన్‌కు చెందిన 'మిడిల్ ఈస్ట్ ఐ' పత్రిక ఎద్దేవా చేసింది. 'ఢిల్లీ పెద్దల ఆదేశాల మేరకు బ్రిటన్‌కు చెందిన విద్యావేత్త నిటాషా కౌల్‌కు కర్నాటకలో ప్రవేశం లభించలేదు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలపై తన అభిప్రాయాలు పాలకులకు నచ్చకపోవడమే దీనికి కారణమని ఆమె తెలిపారు.

రాజ్యాంగం, దేశ ఐక్యతపై కర్నాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సుకు ఆమె హాజరు కావాల్సి ఉంది. ఆమెకు వీసా కూడా మంజూరైంది. కానీ చివరి నిమిషంలో దానిని రద్దు చేశారు' అని లండన్‌కే చెందిన 'ది ఇండిపెండెంట్' పత్రిక తెలిపింది. 'నరేంద్ర మోడీకి సన్నిహితులైన మీడియా దిగ్గజాలు భారత్‌లో పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు. వారు దేశంలోని మీడియా సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొన్నారు' అని న్యూయార్క్ నుండి వెలువడుతున్న ది బ్లూమ్‌బర్గ్ మండిపడింది.

బ్రిటన్ పార్లమెంటులోనూ ప్రస్తావన

భారత్‌లో నిరసనలు వ్యక్తం చేస్తున్న అన్న దాతల భద్రతపై బ్రిటన్ ఎంపీ తన్‌మన్‌జీత్ సింగ్ దేశీ పార్లమెంటులో ఆందోళన వ్యక్తం చేశారు, రైతుల నిరసనలకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కకుండా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సెన్సార్‌షిప్ విధించారని తెలిపారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ జోక్యం చేసు కుంటూ ఇది చాలా తీవ్రమైన పరిస్థితి అని, దీనిపై ప్రధాని తగిన చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు.

ఆంక్షలు..వేధింపులు...వివక్ష

భారతదేశంలో సంస్థాగత స్వయంప్రతిపత్తిపై ఆంక్షలు విధించారని, రాజకీయ నియామకాలు జరుగుతున్నాయని, అసమ్మతివాదులను వేధిస్తున్నారని, స్వీయ నియంత్రణ విధించుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారని 'ఆక్స్‌ఫర్డ్ హ్యూమన్ రైట్స్ హబ్' తెలిపింది. ఇటీవల రైతుల ఆందోళనను అణచివేసిన తీరును అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఎండగట్టింది. పరిస్థితిని చక్కదిద్దాలని, భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు గ్యారంటీ ఇవ్వాలని, శాంతియుత సమావేశాలకు అవకాశం ఇవ్వాలని కోరింది. భారత్‌లో దీర్ఘకాలం విధులు నిర్వర్తించిన ఫ్రాన్స్ పాత్రికేయుడు వనెస్సా డగ్నక్‌ను దేశం నుండి బహిష్కరించడాన్ని 'రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్' తీవ్రంగా నిరసించింది. నరేంద్ర మోడీ హయాంలో పత్రికా స్వేచ్ఛ ప్రతిష్ట ఎంతగా దిగజారిందో ఈ ఉదంతం నిరూపించిందని వ్యాఖ్యానించింది.

భారత్‌లో కులం, మతం, వర్గం ఆధారంగా పెద్ద ఎత్తున విభజన జరుగుతోందని ప్రొఫెసర్ క్రిస్టోఫీ జాఫ్రెలాట్ విమర్శించారు. యూరోపియన్ యూనియన్, భారత్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) భారతదేశంలో మానవ, కార్మిక హక్కులపై ప్రభావం చూపవచ్చునని యూరోపియన్ కమిషన్ హెచ్చరించింది. కుల, మత, లింగ వివక్షల కారణంగా ప్రతికూల ప్రభావం పడుతుందని, బలహీన వర్గాల హక్కులకు విఘాతం కలుగుతుందని తెలిపింది.

భారత్ నుండి వెళ్లి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న సమూహాలు, వ్యక్తులు నిరసనలు తెలుపుతుంటే వాటి సమాచారాన్ని ప్రజలకు తెలియకుండా కేంద్ర ప్రభుత్వం సెన్సార్‌షిప్ విధిస్తోందంటూ అమరికాలోని ఈక్విటీ ల్యాబ్, హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, సిక్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ సంస్థలు ఓ నివేదికను ప్రచురించాయి. ఇన్సాఫ్ ఇండియా అనే సంస్థ జనవరి 31న ముంబయి ఐఐటీలో ఓ ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఒక రోజు ముందు దానిని అధికారులు రద్దు చేశారు. పాలకుల అణచివేతపై గళం విప్పడానికి ఏర్పాటు చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలను రద్దు చేయడం పరిపాటిగా మారింది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నాయకులు చేసే ప్రసంగాల్లో 75శాతం వరకూ ముస్లింలపై విద్వేషాలతో కూడినవేనని వాషింగ్టన్‌కు చెందిన 'ఇండియా హేట్ ల్యాబ్' సంస్థ తెలిపింది. ఇలాంటి ఉదంతాలలో ఐదో వంతు ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి తర్వాత చోటుచేసుకున్నవేనని చెప్పింది.

మూసీ ప్రక్షాళనకు సహకరించండి

అదనంగా 29 మంది ఐపీఎస్‌లను కేటాయించండి

- ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించండి
- జాతీయ రహదారులను సత్వరం పూర్తి చేయండి
- సెమి కండక్టర్ల పరిశ్రమకు తోడ్పాటునందించండి : ప్రధాని నరేంద్ర మోడీకీ సీఎం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు హైదరాబాద్ మెట్రో విస్తరణకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ప్రధానికి 11 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఆయన అందించారు. ప్రధాని తిరుగు ప్రయాణం సందర్భంగా మంగళవారం బేగంపేట విమానాశ్రమంలో మోడీకి వీడ్కోలు పలికిన రేవంత్... విద్య, వైద్యం, విద్యుత్, రైల్వేలు, రహదారులు తదితర పథకాలకు సంబంధించి సత్వర అనుమతులు ఇప్పించడంతో పాటు సహాయ సహకారాలు అందించాలంటూ మోడీకి విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోడీకి సీఎం విన్నవించిన 11 అంశాలు

- ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్ర సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తాం.
- హైదరాబాద్ మెట్రో విస్తరణ, అభివృద్ధికి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రక్షాళనకు సహకరించాలి..
- తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలి.
- హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ అటవీ మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022-23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ,3 కోట్లు మంజూరు చేసింది. రూ.7,700 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి. ఈ కారిడార్ తో అటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దక్షిణ తెలంగాణ వైపు రవాణ మార్గాలు విస్తరిస్తాయి.
- రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలి.
- రాష్ట్రంలో పెరిగిన జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా ఐపీఎస్ క్యాడర్‌పై సమీక్ష నిర్వహించి అత్యవసరంగా 29 పోస్టులను అదనంగా కేటాయించాలి.
- రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూముల్లో కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్ పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (1038 ఎకరాల) భూములను తిరిగి అప్పగించాలి.
- ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీతో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలనే కేంద్ర విధానాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్) నెలకొల్పాలి.
- నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. దానికి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి.
- భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కల్వకుర్తి- కొల్లాపూర్, గౌరెల్లి-వలిగొండ, తొర్రూర్-నెహ్రూనగర్, నెహ్రూనగర్-కొత్తగూడెం, జగిత్యాల-కరీంగర్‌ఫోర్ లేన్, జడ్చర్ల-మరికల్ ఫోర్ లేన్, మరికల్-డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి.
- తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సెమీ కండక్లర్లు, డిస్ ప్లే మ్యానుఫ్యాక్షరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా కేంద్రం సాయం అందించాలి.

కాంగ్రెస్‌వి దగుల్బాజీ రాజకీయాలు

రేవంత్‌రెడ్డి బీజేపీలోకి జంప్ అవుతారు

- మోడీ తెలంగాణకు తట్టెడు మట్టి కూడా ఇవ్వలేదు
- బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దేశానికే ఆదర్శం : సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

'రైతులకు నీళ్ల ఇవ్వొద్దు.. మాజీ సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతో దివాళా, దగుల్బాజీ రాజకీయాలు చేస్తున్నారు. కేసులకు, జైళ్లకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం.. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మొదలుపెడితే సిరిసిల్లలో ఉన్న కాంగ్రెస్ నేత వరకు అందరూ చేతకాని సన్నాసులు.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికైనా బీజేపీలో చేరి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందన్నారు. ప్రధానమంత్రి మోడీకి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో గౌరవం ఇచ్చిందని, కానీ తెలంగాణకు తట్టెడు మట్టి, లొట్టెడు నీళ్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని, ఒక్క దగ్గర పిల్లర్ కుంగితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తోందని అన్నారు. సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడికి అధికారం రాగానే కండ్లు నెత్తికెక్కాయని, పద్మశాలీలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు ముందే ఆ నాయకుడితో పద్మశాలీలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కట్టిన భవనాన్ని ప్రారంభించడానికి సీఎం రేవంత్ వస్తున్నారని, కేసీఆర్ సిరిసిల్లను ఎంత అభివృద్ధి చేశారో చూడాలని హితవు పలికారు. నేత కార్మికులకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఎందుకు ఇయ్యరో చెప్పాలని, తమకంటే ఎక్కువ ఆర్డర్లు ఇచ్చి నేత కార్మికుల మన్ననలు పొందాలని సూచించారు. రేవంత్‌రెడ్డి నేత కార్మికులకు బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించి, వెంటనే చీరల ఆర్డర్లను అందించి, వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తి చేసి వెంటనే నీళ్లు నింపాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కరీంనగర్ ప్రజలకు ఏం చేశారో, ఐదేండ్లలో ఒక గుడి, బడి అయినా కట్టినారా చెప్పాలని సవాల్ విసిరారు. దేవుని పేరు చెప్పుకొని రాజకీయాలు చేస్తూ, ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతుగా బోయినపల్లి వినోద్ కుమార్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ (ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ) చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు గజభింకర్, ఎంపీపీ మానస, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

గొర్రెలు, చేపల పంపిణీ పథకాలపై విచారణ

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బాధ్యతలు
ప్రాథమిక నివేదిక ఆధారంగా ఏసీబీకి ఇవ్వాలని ఆదేశాలు

- ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ప్రోత్సాహకాన్ని చెల్లిస్తాం
- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెయిటేజీ : పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొర్రెలు, చేపల పంపిణీ పథకాల్లో జరిగిన లావాదేవీలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాలను ప్రారంభించినప్పటి లబ్దిదారుల ఎంపిక మొదలు గొర్రెల కొనుగోలు, పంపిణీ జరిగిన తీరుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

విజిలెన్స్ ఇచ్చే ప్రాథమిక నివేదికలో ఏమైనా అవినీతి, అవకతవకలను గుర్తిస్తే ఆయా వివరాలను వెంటనే ఏసీబీకి అప్పగించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో పశు సంవర్థక శాఖ, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ అధికారులతో సీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలు, భారీ అవినీతి జరిగినట్టు కాగ్ తమ నివేదికలో వేలెత్తి చూపిన విషయాన్ని ప్రస్తావించారు. ఇటీవల గొర్రెల పంపిణీకి సంబంధించిన నిధులను బినామీ పేర్లతో కొందరు ఉద్యోగులు సొంత ఖాతాలకు మళ్లించుకున్న కేసులో ఏసీబీ దర్యాప్తును గుర్తు చేస్తూ.. అందులో శాఖా పరంగా వివరాలేమీ సేకరించలేదా? అని ఆరా తీశారు. 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో మొదటి విడతకు రూ. 3,955 కోట్ల రుణం ఇచ్చిన చేసిన నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రెండో విడతకు ఎందుకు రుణం ఇవ్వటాన్ని నిలిపేసిందని ప్రశ్నించారు. అప్పటికే ఈ పథకంపై కాగ్ వివిధ అభ్యంతరాలు లేవనెత్తడంతోపాటు అవకతవకలను గుర్తించిం దన్నారు. ఇప్పటికే తమ వాటా కింద 25శాతం డీడీలు చెల్లించిన అందజేసిన లబ్దిదారులకు ఎందుకు గొర్రెలను పంపిణీ చేయలేదని ప్రశ్నిం చారు. రెండో విడతలో 85,488 మంది ఇప్పటికే తమ వాటా కింద 25 శాతం డబ్బు చెల్లించారన్నారు. దాదాపు రూ. 430 కోట్లు జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. మరో 2,20,792 మంది లబ్దిదారులు ఇంకా డబ్బులు కట్టలేదని తెలిపారు. ఈ పథకం అమలు జరిగిన తీరుపై రకరకాల అనుమానాలున్నాయనీ, దీంతోపాటు చేపల పెంపకానికి సంబంధించి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని సీఎం అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టాలన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే ఒక్కో లీటర్‌పై ఇచ్చే రూ.4 ప్రోత్సాహకం మూడేండ్లుగా ఇవ్వటం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. దాదాపు రూ.203 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాన్ని క్రమం తప్పకుండా విడుదల చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలని చెప్పారు.

ప్రతి మండలంలో వెటర్నరీ ఆస్పత్రి

ప్రతి మండలంలో వెటర్నరీ హాస్పిటల్ తప్పకుండా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 91 కొత్త మండలాల్లోనూ ఇందుకవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలను కొనసాగించాలనీ, అందుకు అవసరమైన టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు. వివిధ పథకాల్లో కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.టీఎస్పీఎస్సీ చేపట్టిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల నియామకాలకు సంబంధించి వివిధ విభాగాల్లో ఏండ్లకు ఏండ్లుగా పని చేస్తున్న వారికి వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలించాలని సూచించారు. వైద్యారోగ్య శాఖలో అమలైన వెయిటేజీ విధానాన్ని ఈ విభాగంలోనూ వర్తించేలా చూడాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి స్పెషల్ సీఎస్ ఆథర్ సిన్హా, డెయిరీ డైరెక్టర్ లక్ష్మి, ఫిషరీస్ డైరెక్టర్ గోపి తదితరులు ఉన్నారు.

ప్రధాని రాక..రాజకీయాలకు కాక

- అభ్యర్థుల ప్రకటనకు పార్టీల శ్రీకారం
- కప్పదాట్లకూ అవకాశం !?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాలు రంజుగా మారుతున్న వేళ ప్రధాని నరేంద్రమోడీ పర్యటన దాన్ని మరింత పెంచింది. ఆయా పార్టీలు లోక్‌సభ ఎన్నికలకు తమ అభ్యర్థులను ప్రకటిస్తున్న తరుణంలో కాక పెరిగింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. పొత్తులకు సంసిద్ధమవుతున్నాయి. ఈ మూడు పార్టీలు వేగంగా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈనెల రెండో వారం తర్వాత ఏ క్షణంలోనైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో అన్ని పార్టీలు కదలికలను వేగిరం చేశాయి. సభలు, సమావేశాలతో తీరికలేకుండా గడుపుతున్నాయి. వ్యూహ, ప్రతివ్యూహాలతో అడగులేస్తున్నాయి. ఈనెల 12 లేదా 14 తేదీల్లో షెడ్యూల్ రావచ్చనే ప్రచారమూ జరుగుతున్నది. ఏప్రిల్, మే లో ఎన్నికలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా దశలవారీగా పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో ఎప్పుడు జరగుతుందనేది కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను బట్టి ఉండనుంది. ఈతరుణంలో రాజకీయాలు మరోసారి వేడేక్కాయి. అధికార, ప్రతిపక్షాలు ఎన్నికల్లో గెలుపు కోసం పలు కసరత్తులు చేస్తున్నాయి. ఎన్నికల సర్వే సంస్థలతో తమ పార్టీ పరిస్థితి, అభ్యర్థులు, ఇతర వ్యవహారాలకు గాను కూపీ లాగుతున్నాయి. కాంగ్రెస్ ఒక అడుగు ముందుకేసి సర్కారీ ఇంటెలిజెన్స్ వ్యవస్థను వాడుకుంటున్నది. తమ పార్టీ పరిస్థితే కాకుండా బీఆర్ఎస్, బీజేపీ కోణంలోనూ సర్వే చేయిస్తున్నట్టు సమాచారం. దాదాపు నెల రోజుల క్రితం నుంచే ప్రయత్నాలు జరుగుతున్నా, గత వారం పది రోజుల నుంచి విస్తృతంగా ప్రజల నాడిని అంచనా వేసేందుకు సర్వే చేయిస్తున్నట్టు తెలిసింది. సీఎం రేవంత్ స్వయంగా ఈ విషయాలను పర్యవేక్షిస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ వ్యవహారాలను కేటీఆర్, హరీశ్‌రావు చూస్తుండగా, బీజేపీ పనులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఇతర కీలక నేతలు పర్యవేక్షిస్తున్నారు. సర్వేలు చేయించే క్రమంలో పార్టీల పరిస్థితులే కాకుండా అభ్యర్థులపై కూడా ప్రజల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లను సర్వే సంస్థల ద్వారా ప్రజల్లోకి వదిలి వారి మనోభావాలను తెలుసుకుంటున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ఈ తరహా ప్రయోగాలు చేస్తున్నట్టు సమాచారం. పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. సీఎం రేవంత్ ఆయా సభల్లో ఇకరిద్దరిని అభ్యర్థులుగా పరిచయం చేయడంతో మిగతా నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు.బీజేపీ సెంట్రల్ ఇంటెలిజెన్స్‌తో ఎన్నికల సర్వేలు చేయిస్తుండగా, కాంగ్రెస్ రాష్ట్ర వేగులను వాడుకుంటున్నది. బీఆర్ఎస్ ప్రయివేటు సంస్థలపై ఆధారపడుతున్నది. బీఆర్ఎస్, బీజేపీ అధికారికంగా కొంత మంది అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తు ఖరారు చేసుకుంది. పొత్తు అంశాలపై ఇంకా కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా ఎన్నికల్లోపు బీఆర్ఎస్, బీజేపీల నుంచి ప్రధాన నాయకులతోపాటు ఎమ్మెల్యేల స్థాయి నేతలు సైతం అధికార పార్టీలోకి జంప్ చేసే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకుల అంచనా.

'పీఎం శ్రీ' రెండోదశలో 251 స్కూళ్ల ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద రెండో దశలో 251 పాఠశాలలు ఎంపికయ్యాయి. 2021-22 యూడైస్ గణాంకాల ప్రకారం మొత్తం 4,930 పాఠశాలు విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు పంపించారు. అందులో 251 పాఠశాలలను పీఎం శ్రీ రెండో దశలో ఎంపిక చేసినట్టు తెలిసింది. అయితే మొదటి దశలో 543 పాఠశాలలను ఎంపిక చేసిన సంగతి విదితమే. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామాగ్రి, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు, మౌలిక వసతులను ఈ పథకం కింద కల్పిస్తారు. ఆ పాఠశాలల అభివృద్ధికి అయ్యే ఖర్చులో మెజార్టీగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ప్రాథమిక పాఠశాలలకు రూ.కోటి, ఉన్నత పాఠశాలలకు రూ.కోటిన్నర వరకు విడుదల చేసే అవకాశమున్నది.

దక్షిణ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా ఎం.వీ.జాన్సన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి దక్షిణ తెలంగాణ ఇంఛార్జీగాఎం.వీ.జాన్సన్‌ను నియమించినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జాన్సన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగల్ల కిష్టయ్య, కోశాధికారి పల్లెలు భూమమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శి జయమ్మ, ఉపాధ్యక్షులు పి.శంకర్, సంయుక్త కార్యదర్శి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.




సంపాదకీయం

చెక్ పెట్టలేమా?

ఆటల్లో వాడే మాటలు రోజువారీ వినియోగంలోకొచ్చి రాజకీయ పరిభాషలోకి జొరబడ్డాయి. చెక్ పెట్టడం, సెల్ఫ్ గోలేసుకోవడం, ఔట్ చేయడం వంటివి ఆ బాపతువే! మిగతా రాష్ట్రాల సంగతెలా ఉన్నా, మన తెలంగాణలో గతేడాది చివరి మూడు నాలుగు నెలలు 'మూడు ముక్కలాట' సాగింది. బీజేపీ వారు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనన్నారు. బీఆర్ఎస్ వారు కాంగ్రెస్, బీజేపీ ఒకటేనన్నారు. కాంగ్రెసేమో బీఆర్ఎస్‌కి ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్లేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలైపోయాయి. సరైన అభ్యర్థులే దొరకని బీజేపీ అధికారంలోకొస్తామనుకోక పోయినా, అటు 'గోడీ మీడియా', ఇటు వారి వాట్సాప్ యూనివర్సిటీ చేసిన నానా యాగీ చూసి రాష్ట్రం విస్తుపోయింది. వెంటనే పార్లమెంటు ఎన్నికలు ముంచుకు వస్తున్నా, రాష్ట్ర పాలకులు మారినా బాణీలు మారలేదు. కాళేశ్వరంపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుమ్మక్కయినాయని మొన్న ఆదిలాబాద్ సభలో మోడీ బలంగా ఉపన్యాసం దంచితే, 'ఛోటే భాయ్‌కా బడే భాయ్' అని మొన్న డిసెంబర్ 7 వరకు 'ఆకాశవాణి'గానే గాక అధికార బాణిగా విరాజిల్లిన పత్రిక నుడివింది. ఎవరిష్టం వారిదని సరిపెట్టుకోవల్సిన విషయాలు కావివి.


> కార్మిక వాడల్లో భారత రాజ్యాంగం పెట్టుబడి దారుల చేతిలో 'టిష్యూ' పేపరైపోయిందని, వందేండ్లకు పైగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు యంత్రాల యజమానుల ముందు చేతులు కట్టుకుని 'చెప్పు దొరా!' అంటూ అల్లావుద్దీన్ అద్భుత దీపంలోని భూతంలా నిలబడుతున్నాయి. ఈ విషయాలేవీ నిన్న పటాన్‌చెరు సభలో వేదికమీదున్న బీజేపీ నేతలెవరికీ పట్టవు. మెదక్ పార్లమెంటు సీటులో కార్మిక వాడలు కీలకమౌతాయి కాబట్టి ఆ వాడల్లోని కార్మికులను మతం ఆధారంగా పోలరైజ్ చేసే ఉద్దేశంతోనే పటాన్‌చెరు సభ జరిగినట్టుంది.



ప్రజల జీవనోపాధికి సంబంధించిన అసలు సమస్యలు- ఉపాధిలేమి, తరిగిపోతున్న వేతనాలు, జీవన ప్రమాణాలు, కుప్పపడున్న సంపద పిడికెడు మంది కి, మగ్గుతున్న పేదరికంలో కోట్లాదిమంది, మానవాభివృద్ధి సూచీలో అధ:పాతాళంలో భారతదేశం, వెరసి అమలుకు నోచుకోని ప్రభుత్వాల వాగ్దానాలను పై మూడు పార్టీలు చర్చనీయాంశం కానివ్వలేదు. సహజంగా జనం వాటి గురించి ఆలోచించకుండా చేయగలిగారు. పార్లమెంటు ఎన్నికల య్యేలోపు ప్రధాని తెలంగాణలో ఎన్ని సుడిగాలి పర్యటనలు చేస్తారో తెలీదు. ఎన్నెన్ని వాగ్దా నాలు కుమ్మరిస్తారో కూడా తెలీదు. మోడీ లక్ష్యాలు వేరు. ప్రజల అవసరాలు వేరు.

ఆదిలాబాద్ జనం యాభైయ్యేండ్లుగా మొత్తుకుంటున్న అంశం బుల్లెట్ ట్రెయిన్ కాదు. ఆదిలాబాద్ పట్టాల్ని ఆర్మూర్ దాకా 140 కి.మీ. వేసి రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేయమని. మోడీ అంటేనే గ్యారంటీ అంటూ రోటినిండా ఊకేసి దంచిన ఆ పెద్దమనిషి 'ఆ ఒక్కటీ అడగద్ద'న్నారు. మూతబడ్డ సిసిఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ను తిరిగి తెరిపించాలనేది ఆ జిల్లా వాసుల కీలక డిమాండు. పైగా తమని గెలిపిస్తే సిసిఐని తెరిపిస్తామనేది గతంలో బీజేపీ నేతల వాగ్దానం. గెలిచిన తర్వాత ఆ ఊసే ఎత్తలేదు సదరు ఎంపీ గారు. ఈ రెండు అంశాల పేరునా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు శాసనసభ కెన్నికైనారు. ఆ డిమాండ్ల పట్ల ఆ జిల్లా వాసుల్లో ఉన్న దాహార్తికి నిదర్శనమిది. ఇనుప ఖనిజం దొరికే జిల్లాలో మినీ స్టీల్ ప్లాంట్ కావాలని అడిగినా, నంబర్ వన్ పత్తి పండే జిల్లాలో టెక్స్టైల్స్ పార్కు డిమాండు చేసినా అది ఆ జిల్లా సమగ్రాభివృద్ధి కోసమేగా!? అక్షర క్రమంలోనే గాక ఉత్తరా నున్న మొదటి జిల్లా సమస్యలు పరిష్కరించడం మరిచిన మోడీ సర్కార్‌కు 'ఫిర్ ఏక్ బార్' అని అడిగే నైతికత ఎక్కడుంది?

ఇక పటాన్‌చెరు కార్మిక కేంద్రంలో దూరంగా ఉండే కొండల్ని చూపి అవి ఎంత నున్నగా ఉన్నాయో అనుభవించి, పలవరించమన్నారు మోడీ. ఆ కార్మిక వాడల్లో నికృష్టపు వేతనాలతో, రోగాలు రొష్టులూ వస్తే ఆదుకునే దిక్కులేక రాలిపోతున్న వారి గురించి బీజేపీ నేతలకు తెలుసా? 12 - 14 గంటలు పని దినంతో, జాతీయ సెలవు దినాల్తో సహా ఏ సెలవూ లేకుండా గానుగెద్దుల్లా ఆ కార్మికులు 365 రోజులు పని చేస్తున్నారని, ఎందరో వలస కార్మికులు భద్రతా పరికరాలు కూడా లేకుండా ప్రమాదాల్లో కాలి మసై పోతున్నారని మోడీకి తెలుసా? కార్మికవాడల్లో భారత రాజ్యాంగం పెట్టుబడి దారుల చేతిలో 'టిష్యూ' పేపరైపోయిందని, వందేండ్లకు పైగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు యంత్రాల యజమానుల ముందు చేతులు కట్టుకుని 'చెప్పు దొరా!' అంటూ అల్లావుద్దీన్ అద్భుత దీపంలోని భూతంలా నిలబడుతున్నాయి. ఈ విషయాలేవీ నిన్న పటాన్‌చెరు సభలో వేదికమీదున్న బీజేపీ నేతలెవరికీ పట్టవు. మెదక్ పార్లమెంటు సీటులో కార్మిక వాడలు కీలకమౌతాయి కాబట్టి ఆ వాడల్లోని కార్మికులను మతం ఆధారంగా పోలరైజ్ చేసే ఉద్దేశంతోనే పటాన్‌చెరు సభ జరిగినట్టుంది. ఎందుకంటే ఒకసారి కార్మికుల్ని వొంచ గలిగితే మిగిలిన సమాజాన్ని వంచడం తేలికనే విషయం కాషాయ నేతలకెరుకే. ఏదైనా తెలంగాణ సమాజం అప్రమత్తమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూచిన తర్వాత ఎన్నో రెట్లు జాగ్రత్త వహించక పోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.



ఎరేజర్

పుట్టినప్పటి నుంచి
వెంటాడుతున్న పుట్టుమచ్చలు
నన్ను సర్టిఫికెట్ చేస్తూ
ఎక్కడకు పోయిన అడుగుతున్నవి
మరల మరల
ఒకే ప్రశ్న... ఒకే తీరు

రెండో తరగతిలో
మూడో ఎక్కం దిద్దుతున్నపుడు
తప్పులను సరిచేసిన
లెక్కల టీచర్
ఇవాళ ఎదురొచ్చి
కన్నీళ్ళ కారణాలను
చెరిపేస్తే బాగుండు.

బతుకు పేజీలలో
రాసుకున్న ఇంకు మరకలు
గీసుకున్న అడ్డుగీతలు
ఒంటరిగా కూర్చోబెట్టి
నిన్నటి చేతల్ని నిలదీస్తుంటే
ఆ చేతుల్ని పట్టుకొని
ఏడ్వాలనుంది.

చూపుల్ని వినికిడిని దాటిపోతూ
ఎన్నో వేల మాటల్ని దిగమింగిన
ఈ కాలంతో అలవాటుగానే
బానిసత్వం బహుమతిగా వచ్చింది.

కొంత దూరం నడిచాక
ఇంకెంతో దూరం ఉందని
పాదాలకు గుర్తు చేసే,
తప్పటడుగులను చెరిపేసే
ఎరేజర్ లాంటి మనసులు కావాలి.
మాసిన బతుకును చెరిపేసే
మనుషులు కావాలి.

- రామ్ పెరుమాండ్ల
89542265831

ఎక్కడి గొంగళి అక్కడే : డబ్ల్యూటీఓ అబుదాబీ చర్చలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

నూట అరవై ఆరు దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఐదు రోజుల పాటు తాగామా, తిన్నామా, పడుకున్నామా, లేచి వెళ్లి పోయామా అన్నట్లుగా వ్యవహరించారంటే అతిశయోక్తి కాదు. ఎక్కడ అనుకున్నారు! యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబూదాబీలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఓ) మంత్రుల పదమూడవ సమావేశం (ఎంసి13) జరిగింది. చిన్నా చితకా అంశాల మీద కొన్ని ఒప్పందాలు జరిగాయి తప్ప కీలకమైన వ్యవసాయం, మత్స్య సంపద సబ్సిడీలు, తదితర అంశాలపై ఎలాంటి ముందడుగు పడలేదు. ఉమ్మడి ప్రకటన కోసం నాలుగవ రోజు మూడుసార్లు సమావేశం వాయిదా పడింది, కుదరలా మరో రోజు పొడిగించారు. చివరికి వచ్చేసారి రాజుగారి గంగాళంలో అందరం పాలు పోద్దాం అన్నట్లుగా మంచి కోసం మరిన్ని చర్చలు కొనసాగిద్దాం అనే అంశం మీద తప్ప మరొక ఏకాభిప్రాయం లేదు. పేద వర్ధమాన దేశాలు తమ ప్రయోజనాలకోసం పట్టుబడితే, ధనిక దేశాలూ అంతకంటే గట్టిగా ఉడుం పట్టు పట్టాయి.ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పదాలలో సంధికాలం నిబంధన(పీస్ క్లాజ్) ప్రకారం మన వంటి దేశాలు యథాతథ స్థితిని కొనసాగించేందుకు లభించిన ఊరట తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదు. అత్యంత పేదరికంతో ఉన్న కామెరోస్, తైమూర్-లెస్తే అనే దేశాలను చేర్చుకోవటంతో సంస్థ సభ్యత్వం 164 నుంచి 166 దేశాలకు పెరిగింది. ప్రపంచ వాణిజ్యంలో 98శాతం వీటి పరిధిలో ఉంది.చూశారా రెండు కొత్తదేశాలు చేరాయంటే డబ్ల్యుటిఓ మీద ఇంకా నమ్మకం ఉన్నట్లే కదా అని కొందరు భాష్యం చెప్పారు. ఇప్పటికిప్పుడు తమకు పెద్దగా ఒరిగేదేమీ లేకున్నా అమెరికా వంటి పెద్ద దేశాల సరసన ఉండి లబ్దికోసం ఎదురుచూడటం తప్ప మరొక మార్గంలేదని న్యూజిలాండ్ ప్రతినిధి చెప్పారు. సంస్థ ఉన్నంత వరకు ఎవరి ప్రయోజనాల కోసం వారు ఉంటారన్నది గమనించాల్సిన అంశం.

వాణిజ్య వివాదాల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉండే విధంగా సంస్కరించాలన్నది ఒక ప్రతిపాదన. ఇప్పుడున్న వ్యవస్థనే పనిచేయనివ్వకుండా 2019 నుంచి అమెరికా, దాని వెనుక ఉన్న ఇతర ధనికదేశాలు మోకాలడ్డుతుండటంతో ఎలాంటి కార్యకలాపాలు లేవు. ఎలక్ట్రానిక్ (ఇ) కామర్స్‌లో జరిగే లావాదేవీలపై సభ్య దేశాలు కస్టమ్స్ సుంకాలు విధించకూడదన్న నిర్ణయాన్ని 1998 నుంచి ప్రతి సమావేశంలో పొడిగించినట్లుగానే అబూదాబీలో కూడా 2026 వరకు అనుమతించారు. ఇది ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న దేశాలకే లబ్ది చేకూర్చుతుందని వేరే చెప్పనవసరం లేదు. మన వంటి దేశాలు ఎప్పుడైనా వాటి సరసన చేరకపోతామా, మార్కెట్లలో ప్రవేశించకపోతామా, మన కార్పొరేట్లకూ లబ్ది చేకూర్చలేకపోతామా అనే బండి గుర్రపు ఆశతో ఎదురుచూస్తున్నాయి. ఇదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాల సబ్సిడీలకు గండికొట్టేందుకు చూడటంతో పాటు తమ సబ్సిడీలను మరింతగా పెంచుకుంటున్నాయి. వాటిని ప్రతిఘటించే స్థితిలో మిగతా దేశాలు లేవు. అయినా ఎండమావుల వెంట పరుగెత్తినట్లుగా మన వంటి దేశాల పరిస్థితి ఉంది. ఒకవైపు లబ్దికోసం రాజీపడుతున్నాయి, మరోవైపు జనం నుంచి వ్యతిరేకతను చూసి ప్రతిఘటిస్తున్నాయి.

మన రైతాంగానికి రక్షణ కల్పించేందుకు గాను కొన్ని పంటలకు కనీస మద్దతు ధర విధానం, ఆహార భద్రతకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) ద్వారా ప్రభుత్వమే ఆహారధాన్యాల సేకరణ విధానాన్ని అమలు జరుపుతున్నాం. ఈ రెండూ కూడా డబ్ల్యుటిఓ నిబంధనలకు విరుద్దమని వాటిని ఎత్తివేయాలని అమెరికా, ఐరోపా దేశాలు 2013నుంచి పెద్దఎత్తున ఒత్తిడి తెస్తు న్నాయి, వాటిని సంతుష్టీకరించేందుకు 2020లో నరేంద్రమోడీ తెచ్చిన మూడు సాగు చట్టాలు రాజీలో భాగమైతే, రైతుల ప్రతిఘటనతో క్షమాపణలు చెప్పి మరీ తోకముడవటం రెండోదానికి నిదర్శనం. మొద టిది వాస్తవం, రెండవది వంచన. కనీస మద్దతు ధర లకు చట్టబద్దత కల్పించేందుకు మొరాయించటమే దీనికి నిదర్శనం. అంతిమ ఫలితం ఏమంటే ధనిక దేశాల వత్తిడే ఎక్కువగా పని చేస్తున్నది.ముందే చెప్పు కున్నట్లుగా సంధికాలం నిబంధన(పీస్ క్లాజ్) ఇంకా అమల్లో ఉన్నందున ఎఫ్‌సిఐ, ప్రజా పంపిణీ వ్యవస్థలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రపంచంలో వివిధ దేశాలు రైతాంగా నికి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేర సబ్సిడీలు ఇస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాలు వీటిని ఎత్తివేసి మార్కెట్లో ప్రవే శించే హక్కు తమకు కల్పించాలని పట్టుబడుతున్నాయి. ఇదే సమ యంలో నిబంధనలకు వక్రభాష్యాలు చెప్పి పెద్ద ఎత్తున అవి సబ్సిడీ లిస్తున్నాయి. ఐరోపా దేశాలు ఇస్తున్న సబ్సిడీలను ఎత్తివేస్తే ప్రపం చంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎనిమిది శాతం పెరుగు తాయని, అది న్యూజిలాండ్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఒక సంస్థ చేసిన విశ్లేషణను న్యూజిలాండ్ ప్రతినిధి ఉటంకించారు.

అబూదాబీలో తేలని మరొక అంశం సముద్ర ఉత్పత్తులకు సబ్సిడీలు. ప్రపంచంలో 26 కోట్ల మంది వీటి వేటలో ఉపాధి పొందుతున్నారు. చిన్న స్థాయిలో చేపలను పట్టే దేశాల వారు సబ్సిడీల వలన నష్టపోతున్నారు.ఆయా దేశాల సముద్ర తీరానికి రెండు వందల నాటికల్ మైళ్ల అవతల ఎవరైనా చేపలు పట్టవచ్చు. చైనా, ఐరోపాలోని ధనిక దేశాల వద్ద భారీ నౌకల ద్వారా చేపలను పట్టే సంస్థలు ఉన్నాయి. వాటితో చిన్నవారు పోటీపడలేరు. భారీ నౌకలకు వ్యతిరేకంగా వర్ధమాన, పేద దేశాలు తెస్తున్న ఒత్తిడికి ఎలాంటి ఫలితమూ కనిపించటం లేదు. రెండవది సముద్ర ఉత్పత్తుల నిర్వచనాల్లో ఉన్న లొసుగులను ఆధారం చేసుకొని ధనిక దేశాలు వ్యవసాయానికి ఇస్తున్నట్లుగానే వీటికి భారీ సబ్సిడీలు ఇస్తున్నాయి. రెండు సంవత్సరాల క్రితం కుదిరిన ఒప్పందం ధనిక దేశాల సంస్థలకు మేలు చేకూర్చేదిగా ఉంది. చట్టవిరుద్దంగా, వివరాలు వెల్లడించని, నియంత్రణ విధానం లేకుండా పట్టినవాటికి, పరిమితికి మించి నిల్వలు ఉన్న చేపలకు సబ్సిడీ ఇవ్వకూడదన్న నిబంధనను 2022లో ఆమోదించారు. ఈ ఒప్పందాన్ని నూట పది దేశాలు ఆమోదిస్తేనే అమల్లోకి వస్తుంది, మరొక 39దేశాలు సంతకాలు చేయాల్సి ఉంది. దీని నిబంధనల్లో ఉన్న లోపాల కారణంగా ఏకీభావం కుదరలేదు.ఈ ఒప్పందం మీద జరిగిన ప్రజా విచారణలో పాల్గొన్న వారు ఇప్పటి వరకు కార్పొరేట్లు భూములను కొల్ల గొట్టారని, ఇది అమల్లోకి వస్తే సముద్రాలను ఆక్రమిస్తారని, నియంత్రణలు లేకపోతే దోపిడీకి హద్దే ఉండదని హెచ్చరించారు. పేద దేశాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వెలుపలికి వచ్చి ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో పెట్రోలియం ఉత్పత్తుల మీద ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేయాలన్న ధనిక దేశాల డిమాండ్‌కు అబూదాబీలో మరో అడుగు ముందుకు పడింది. మన దేశంలో నరేంద్రమోడీ సర్కార్ సబ్సిడీలను ఎత్తివేయటమేగాక, సెస్సుల రూపంలో జనం జేబులను కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే.

ప్రపంచ వాణిజ్యసంస్థ ద్వారా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడటం కంటే తక్షణమే ప్రత్యామ్నాయంగా పేద దేశాలకు ఆహార సర్వసత్తాక హక్కు, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సౌహార్ధతల ప్రాతిపదికన సంస్కరణలు జరగాలని అబూదాబీ సమావేశాలనుద్దేశించి అనేక రైతు, వ్యవసాయ కార్మిక, ఇతర వ్యవసాయ సం బంధ సంస్థలు కోరాయి. బహుముఖ సంక్షోభాలు తలెత్తిన వర్తమా నంలో వాటిని పరిష్కరించేందుకు డబ్ల్యుటిఓ పనికిరాదని, ప్రత్యా మ్నాయం గురించి ఆలోచించాలని కోరాయి.ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని 65దేశాల్లో 2023లో రైతు లు పోరుబాట పట్టారని వారిలో ఉన్న అశాంతికి ఇది నిదర్శనమని పేర్కొన్నాయి. ధనిక దేశాల నుంచి చౌకగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులతో అనేక దేశాల్లో రైతులు నష్టపోతున్నారు. కొన్ని చోట్ల పర్యావరణ రక్షణ పేరుతో వ్యవసాయం మీద ఆంక్షలు విధిస్తు న్నారు. పంజాబ్, హర్యానాల్లో వరుసగా వరి వేయకుండా పంటల మార్పిడి పద్దతిని అనుసరిస్తే మూడు పప్పుధాన్యాలు, పత్తి, మొక్కజొన్నలను కనీస మద్దతు ధరలకు ఐదు సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తామని తాజాగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపా దనను రైతులు తిరస్కరించిన సంగతి తెలిసిందే.

అబూదాబీలో మన దేశం వ్యవహరించిన తీరుతెన్నులను చూద్దాం. ఆహార ధాన్యాల సేకరణ, నిల్వలు, కనీస మద్దతు ధరల విధానాన్ని కొనసాగించాలని కోరటం తప్ప వాటిని వ్యతిరేకిస్తున్న అమెరికా, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశాల మీద గట్టిగా ఒక్క మాట కూడా మాట్లాడలేదంటే అతిశయోక్తి కాదు. వ్యాపారేతర అంశాలను అజెండాలో చేర్చకుండా చూడటంలో, దేశ ప్రయోజనాలను కాపాడటంలో విజయవంతమైనట్లు మనదేశ అధికారులు వర్ణించినట్లు వార్తా సంస్థలు తెలిపాయి. చైనాతో 120 దేశాలు ముందుకు తెచ్చిన "అభివృద్ధి కోసం పెట్టుబడుల ఒప్పంద" ప్రతిపాదనను మనదేశంతో పాటు దక్షిణాఫ్రికా అడ్డుకున్నాయి. ఈ పెట్టుబడులు డబ్ల్యుటిఓ ద్వారా వస్తే అభ్యంతరం లేదని, వేరే మార్గంలో ప్రతిపాదించినందున వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నాయి. అదే విధంగా ఎగుమతులకు లింగవివక్షను ముడి పెట్టటాన్ని కూడా అడ్డుకున్న వాటిలో మనదేశం ఒకటి. ఆహార సబ్సిడీకి 1986-88 సంవత్సరాల ధరలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారని, దీన్ని తాజా ధరలతో నవీకరించాలని మనదేశం కోరింది. విదేశాల్లో ఉన్న వలస కార్మికులు (వీరికి అతిథి కార్మికులని ముద్దుపేరు) తమ దేశాలకు పంపే పొదుపు మొత్తాల ఖర్చు ఆరుశాతానికి మించి ఉంటోంది. దీన్ని తగ్గించాలని ఆయాదేశాలు కోరుతుండగా వీల్లేదని ధనిక దేశాలు పట్టుబడుతున్నాయి. ఎందుకంటే నగదును బదిలీ చేసే సేవా సంస్థలన్నీ అక్కడే ఉన్నాయి, వాటి లాభాలు తగ్గకూడదన్నది వాటి వాదన.మనకార్మికులు 2023లో విదేశాల నుంచి 125బిలియన్ డాలర్లు పంపారు. దీన్ని బట్టి విదేశీ సంస్థలకు దాదాపు ఎనిమిది బిలియన్ డాలర్ల మేర లబ్ది చేకూరినట్లే.

అంతా మీరే చేశారు అంటూ అబూదాబీ సమావేశాల వైఫల్యం గురించి ఐరోపా యూనియన్ దేశాలు మన మీద విరుచుకుపడ్డాయి. ఈ సమావేశాల్లో మన ప్రతినిధిగా పాల్గొన్న కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఒక పత్రికతో మాట్లాడుతూ వాణిజ్యేతర అంశాలను ప్రధాన అజెండాలోకి రాకుండా చూడగలిగామని చెప్పారు. శాంతి సంధి నిబంధన మనకు అనుకూలంగా ఉన్నందున పెద్దగా ఆందోళన చెందాల్సినపని లేదని అన్నారు. ఏ లక్ష్యాలతో మనదేశం ఆ సమావేశాల్లో పాల్గొన్నదో వాటి గురించి సంతృప్తితో తిరిగి వచ్చామని, దేశ ప్రయోజనాలను కాపాడామని సంతోషం వెలిబుచ్చారు. శాంతి నిబంధన ఉన్నందున ఆహార ధాన్యాలను నిల్వచేయవచ్చని, పేదలకు ఉచితంగా పంచవచ్చని చెప్పారు.చేపల సబ్సిడీలకు సంబంధించి నిర్వచనాలు సంతృప్తికరంగా లేవన్నారు. మూడు దశాబ్దాలుగా డబ్ల్యుటిఓ సాధించిందేమీలేనందున అసలు ఈ సంస్థే పనికి మాలిందనే అభిప్రాయం కూడా వెల్లడించిన వారు లేకపోలేదు. బహుళజాతి కార్పొరేట్ సంస్థల మేలుకోసం ధనిక దేశాలు ముందుకు తెచ్చిన ఈ సంస్థ మీద ఇలాంటి వ్యాఖ్యలు వెలువడుతున్నాయంటే పెట్టుబడిదారీ విధాన వైఫల్యానికి బలమైన నిదర్శనంగా చెప్పవచ్చు.



> ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడటం కంటే తక్షణమే ప్రత్యామ్నాయంగా పేద దేశాలకు ఆహార సర్వసత్తాక హక్కు, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సౌహార్ధతల ప్రాతిపదికన సంస్కరణలు జరగాలని అబూదాబీ సమావేశాల నుద్దేశించి అనేక రైతు, వ్యవసాయ కార్మిక, ఇతర వ్యవసాయ సంబంధ సంస్థలు కోరాయి. బహుముఖ సంక్షోభాలు తలెత్తిన వర్తమానంలో వాటిని పరిష్కరించేందుకు డబ్ల్యుటిఓ పనికిరాదని, ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని కోరాయి. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల లోని 65దేశాల్లో 2023లో రైతులు పోరుబాట పట్టారని వారిలో ఉన్న అశాంతికి ఇది నిదర్శనమని పేర్కొన్నాయి.

> ఆహార సబ్సిడీకి 1986-88 సంవత్సరాల ధరలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారని, దీన్ని తాజా ధరలతో నవీకరించాలని మనదేశం కోరింది. విదేశాల్లో ఉన్న వలస కార్మికులు(వీరికి అతిథి కార్మికులని ముద్దుపేరు) తమ దేశాలకు పంపే పొదుపు మొత్తాల ఖర్చు ఆరుశాతానికి మించి ఉంటోంది. దీన్ని తగ్గించాలని ఆయాదేశాలు కోరుతుండగా వీల్లేదని ధనిక దేశాలు పట్టుబడుతున్నాయి. ఎందుకంటే నగదును బదిలీ చేసే సేవా సంస్థలన్నీ అక్కడే ఉన్నాయి, వాటి లాభాలు తగ్గకూడదన్నది వాటి వాదన.మనకార్మికులు 2023లో విదేశాల నుంచి 125బిలియన్ డాలర్లు పంపారు. దీన్ని బట్టి విదేశీ సంస్థలకు దాదాపు ఎనిమిది బిలియన్ డాలర్ల మేర లబ్ధి చేకూరినట్లే.

మనిషి - పులి





డా. ఎస్ తిరుపతయ్య
9849228212

జనవరి మొదటి వారంలో కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దారిగాం అటవీ ప్రాంతంలో రెండు పెద్దపులులు మరణించాయి. పులుల మరణవార్త తెలిసింది మొదలు ఈ రోజుకీ స్థానిక ఆదివాసులపై అటవీ శాఖ వాళ్ళు విచక్షణా రహితంగా కేసులు బనాయిస్తూ, జైళ్లకు పంపుతున్నారు. ఈ కేసుల వలలో చిక్కుకున్న వారంతా అంతరించి పోగల కొలాం జాతికి చెందిన పేద ఆదివాసులు.

పులుల మరణానికి కొద్దిరోజుల ముందు ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి మండలంలోని రింగారిట్ గ్రామానికి చెందిన ఒక ఆవుమందతో పాటు దరిగాం అడవిలోకి మేతకు వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదు. అనంతరం, జనవరి ఆరున ఒక పులి పిల్ల అడవిలో చచ్చిపడి ఉన్న విషయం అటవీ శాఖ అధికారులకు తెలిసింది. దానిపై బలమైన గాయలున్నాయని, ఒక ఎముక కూడా విరిగి ఉందని, రక్తస్రావమైన ఆనవాల్లున్నాయని, అందువల్ల అది మరో పెద్దపులితో జరిగిన ఘర్షణలో చనిపోయి ఉంటుందని వారు ప్రకటించారు. ఎనిమిదో తేదీ మరో పెద్దపులి శవం దొరికింది. ఆవు కళేబరం కూడా వారికి కనిపించింది. దీంతో ఆవు, పులుల మరణానికి సంబంధం ఉంటుందని అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో శాస్త్రీయత, వాస్తవికత ఏ మేరకు ఉన్నాయోగానీ, ఆవు సొంతదారు అయిన ఆదివాసీ రైతు కోవ జంగునూ, మరి కొంతమంది ఆదివాసులపై జనవరి 12న కేసులు మోపి, ఇద్దరిని జైలుకు పంపించారు. విచారణలో ఫారెస్ట్ పోలీసులు నిందితులను విపరీతంగా చిత్రహింసలు పెట్టారని వారి బంధువులు రోదించారు. ఇంకా అనేక మందిపై కేసులు నమోదవుతున్నాయి.

ఆసిఫాబాద్ అడవిలో జరిగిన ఈ పరిణామం చిన్న పిల్లలు చదువుకునే ఆవు-పులి కథ లాంటిది కాదు. ఈ యధార్థ కథలో ఆవు చనిపోయింది. పులీ చనిపోయింది. ఆవు నిజాయితీ గలదో, లేదో ఎవరూ పట్టించుకోలేదు. ఆవుపోతే పోయింది, పులి చనిపోకూడదు కదా! అదీ మనమూ, పాలకులూ పాటించే విలువ. కాబట్టి, పులులు చనిపోవటం చాలా పెద్ద విషయమైంది. ఈ అడవిలో పులులు పశువులపైననే కాదు, మనుషులపైనా దాడిచేశాయి. గతేడాది, ఇప్పుడు పులులు చనిపోయిన అడవికి సమీపంలో, చేలో పనిచేసుకుంటున్న వాంఖిడి మండలానికి చెందిన సిడాం భీంరావ్ అనే ఆదివాసీ రైతును పులినోట కరుచుకుని అడవిలోకి లాక్కెళ్లే ప్రయత్నం చేసింది. పరిసరాల్లో ఉన్న రైతులు కేకలు వేస్తూ, కర్రలు పట్టుకొని పరుగెత్తేసరికి అతన్ని వదిలేసి వెళ్ళిపోయింది. గ్రామస్తులు భీంరావు దగ్గరికి చేరుకునేసరికే అతను చనిపోయాడు. ఈ జనవరిలోనే మనకు పొరుగున ఉన్న గడ్చిరోలి జిల్లాలో దాదాపు వారం రోజుల వ్యవధిలో పత్తి చేలో పనిచేసుకుంటున్న ఇద్దరు మహిళా రైతులను పులి చంపి తినేసింది.

నగర, మైదాన ప్రాంతాల మనుషులకు పులి ఒక వినోద జంతువు. కానీ పులి సంచరించే అటవీ ప్రాంత ప్రజలకది దిన దిన గండం. వారి జీవనోపాధిని దెబ్బతీసే సమస్య. వారి ప్రాణాలకు ముప్పు. దేశంలో ఎలాగైనా పులులను సంరక్షించాలనే పాలకుల విధానాలు ఆదివాసీల, ఇతర పేద ప్రజల జీవించే హక్కుకు తీవ్ర భంగకరంగా మారుతున్నాయి.గత ఇరవై ఏండ్లుగా ప్రభుత్వాల పట్టుదలతో కూడిన పులుల సంరక్షణా చర్యల ఫలితంగా 2006లో 1411 మాత్రమే ఉన్న వాటి సంఖ్య వేగంగా పెరిగి 2022 జూలై నాటికి 3682కి చేరింది. ఇప్పుడు ప్రపంచంలోని డెబ్బై శాతం పులులు భారత్‌లోనే ఉన్నాయి. మధ్య భారతం, కర్నాటకలో పులుల సంఖ్య పెరిగే కొద్దీ అవి క్రమంగా, తమవైన కొత్త ప్రదేశాలను వెతుక్కుంటూ పరిసర అడవుల్లోకి విస్తరిస్తున్నాయి. అలా మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతం నుండి కొంత కాలంగా ఆసిఫాబాద్ అడవులకు పెద్ద సంఖ్యలో పులులు చేరుతున్నాయి.

పులి సాధారణంగా ఒంటరిగా జీవిస్తుంది. పులులను సహజసిద్ధంగా సంరక్షించాలంటే ఒక్కొక్క పులికి అరవై నుండి వంద చదరపు కిలోమీటర్ల దట్టమైన, సహజ వాతావరణం ఉన్న అడవి కావాలి. పాలకుల అటవీ విధ్వంసపు అభివృద్ధి విధానాలూ, మైదాన ప్రాంత మనుషుల కలప దాహంవల్లా అడవి విస్తీర్ణం, నాణ్యతా బాగా తగ్గిపోయి పులికి సహజ ఆహారం దొరికే పరిస్థితి గతంలో ఉన్నట్లు ఈ రోజు లేదు. పులులకు అడవి అనబడే ప్రదేశంలో ఆహారం దొరకనప్పుడూ, వాటి వేటాడే సామర్థ్యం తగ్గినప్పుడూ అడవి అంచున ఉన్న గ్రామాలపై పడి రైతుల పశువులనూ, తరచుగా మనుషులనూ చంపి తింటాయి. గతేడాదిలో తెలంగాణా రాష్ట్రంలో మూడు వందల ఆవులు లేదా ఎద్దులను పులులు చంపి తిన్నాయి. నెల క్రితం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం అందించిన వివరాల ప్రకారమే గత ఐదేండ్లలో దేశంలో 302 మంది పులుల బారిన పడి చనిపోయారు. 2018లో 18 మంది చనిపోతే ఆ సంఖ్య 2022 నాటికి 112కు చేరింది. పులుల సంఖ్యకూ వాటి బారిన పడి చనిపోయే మనుషులకూ స్పష్టమైన సంబంధం గతంలోనూ ఉంది. వందేండ్ల కిందట దేశంలో నలభై వేల పులులు ఉన్నప్పుడు 1876 నుండి 1912 సంవత్సరాల మధ్యన బ్రిటిష్ ఇండియాలో పులుల బారిన పడి అక్షరాల 33వేల 247 మంది చనిపోయారట. కాబట్టి పులుల సంఖ్య ఎంత పెరిగితే మనుషుల ప్రాణాలకు, ముఖ్యంగా అటవీ పరిసర గ్రామాల ప్రజలకు, అంత ముప్పు అనేది పాలకులూ, మైదాన ప్రాంత మనుషులూ తక్షణం గ్రహించాలి. కొత్తగా, పులుల ఆకలిని తీర్చటానికని హైదరాబాద్, కరీంనగర్ లలోని మూడు డీర్ పార్కుల నుండి 550 జింకలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆమ్రాబాద్, కవ్వాల్ అభయారణ్యాల్లోని పులులకు ఆహారంగా వదిలివేస్తున్నారట. పాపం జూలలో ఇంత కాలం మనకు సంతోషాన్ని పంచిన, తప్పించుకోవటం కూడా మర్చిపోయిన వందలాది జింకల బలిని మాత్రం మనం ఎందుకు అంగీకరించాలి. పులుల జనాభా అనియంత్రంగా పెంచుకుంటూపోతే వాటికి ఆహారంగా ఏడాదికి ఎన్ని పశువులూ, ఎన్ని పెంపకపు జింకలూ, ఎంతమంది మనుషులూ బలికావాలి?

నిజానికి, మనుషులు పులులకు ఆహారం అవటం అనేది కూడా పాలకులను బాధించటం లేదు. మానవ సంచారం ఉంటే పులుల స్వేచ్ఛకు అడ్డం అవుతుందని భారత ప్రభుత్వాలు 2008 నుండే వివిధ పులి అభయారణ్యాల నుండి 250 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించి, అందులో నివసించే 2 లక్షల మంది ఆదివాసీ ప్రజలను అభయారణ్యాల వెలుపలికి తరలించాలని లక్ష్యంగా చేసుకుని, ఆ పనిని నిరాఘాటంగా చేస్తున్నాయి. అలా 2010లో కర్నాటకలోని నాగర్ హొళె అభయారణ్యం నుండి కుర్బా జాతి ఆదివాసీ తెగ ప్రజలు నివసించే అనేక గ్రామాలను ఖాళీ చేయించి, బయటకు పంపారు. మైదాన ప్రాంతంలో దినసరి కూలీలుగా మారిన ఆదివాసీలు అక్కడ బతకలేక, ఇక్కడే ఉంటే తాము అంతరించటం ఖాయమని, తిరిగి తాము పూర్వం జీవించిన గ్రామాలకే వెళతామని, నాగర్ హొళె అభయారణ్యం గేట్ల వద్ద నెలల తరబడి ఆందోళన చేస్తున్నారు. పులులతో బతికినా, చనిపోయినా పరవాలేదుకానీ, మాకు స్వేచ్ఛ లేని ఈ పరాయి ప్రాంతంలో మేము ఎందుకు బాధలు పడాలనేది వారి వాదన. ఇంకా ఖాళీ చేయని నాగర్ హొళె ఆదివాసీ గ్రామాల ప్రజలు అటవీ శాఖ నుండి అక్రమ కేసులనూ, వేధింపులనూ ఎదుర్కొంటూ, జైళ్ల పాలు కూడా అవుతున్నారు. తెలంగాణాలో కవ్వాల్ పులుల అభయారణ్యం నుండి ఆదివాసుల తరలింపు పర్వం ఇటీవలే ప్రారంభమైంది. పర్యవసానాలు మనం ఊహించుకోవాల్సిందే.

పులి గొర్రెలను, మేకలను చంపితే ప్రభుత్వం పరిహారేమీ ఇవ్వదు. పశువులను చంపితే ఎంతో కొంత పరిహారం ఇస్తుంది. మనిషిని చంపితే రూ.5లక్షలిస్తారు. ఇది కూడా మనిషి జీవించే హక్కు పట్ల గౌరవంతో కాదు. మనుషులు కోపంతో తిరిగి పులికి హాని చేయకూడదని. పులి అడపాదడపా ఒకరినో, ఇద్దరినో చంపినా దానికి అడ్డు రావద్దట. పరిహారం మాత్రం తీసుకుని గమ్మున ఉండాలి. పులి అనేక మందిని అలా చంపుతూ ఉంటే మాత్రం, అటవీశాఖ దాన్ని మాన్ ఈటర్‌గా పరిగణించి, కట్టడి చేస్తారు. అప్పటివరకు అప్పుడప్పుడూ కొంత మంది చనిపోయినా పరవాలేదనేది వారి విధానం. మనుషులు తమ బతుకు దెరువు కాపాడుకోవటానికి ఒక్కపులిని చంపితే మాత్రం మూడు నుండి ఆరేండ్ల కారాగార శిక్ష, ఆర్థిక జరిమానా ఉంటాయి.

పులినైనా మరే ఇతర అరుదైన, వన్య ప్రాణినైనా అంతరించిపోకుండా సంరక్షించాలనే లక్ష్యంతో మౌలికంగా విభేదం లేదు. కానీ, అందుకు లక్షలాది ఆదివాసీ ప్రజల జీవనాలనూ, వేలాది పేదల ప్రాణాలనూ బలిచేస్తామంటే మాత్రం అంగీకరించలేం. ఈ స్పృహ లేకపోతే అది నాగరిక విలువ అనిపించుకోదు. పులుల స్వేచ్ఛ తప్ప మానవ హక్కుల దృక్పథం పాలకులకే కాదు, సభ్యసమాజానికీ లేకపోవటం ఆదివాసీ, ఇతర పేద ప్రజల జీవితాల పట్ల గౌరవం లేనితనాన్ని తెలియజేస్తుంది. పులుల సంఖ్య వేగంగా పెరుగుతున్న ఈ సమయంలోనైనా ఈ ధోరణిని సమీక్షించుకోవాలి. తక్షణంగా పులుల సంచారాన్ని మనుషులకు హానికరం కానీ, కనిష్ట ప్రాంతానికి పరిమితం చేయాలి. 'సంరక్షింపబడే' ఏ ఒక్క పులివల్లా, ఏ సాధారణ మనిషికీ హాని జరగని విధంగా మాత్రమే పులుల సంరక్షణా విధానం ఉండాలి. ఆ అవకాశం లేకపోతే పులుల జనాభాను నియంత్రించాలి. తమ స్థూల ఆత్మరక్షణలో భాగంగా పులులకు హాని చేసే ఆదివాసీలను వేటగాళ్లను శిక్షించినట్టు శిక్షించవద్దు. పులులను నియమిత ప్రాంతంలోనైనా, సహజ వాతావరణంలో పెరగనీయాలంటే అడవిబిడ్డలను అడవి నుండి బయటికి పంపటం కాకుండా, అడవిలోకి కార్పొరేట్లనూ, పెట్టుబడులనూ ప్రవేశించకుండా చూడాలి.

> పులి గొర్రెలను, మేకలను చంపితే ప్రభుత్వం పరిహారేమీ ఇవ్వదు. పశువులను చంపితే ఎంతో కొంత పరిహారం ఇస్తుంది. మనిషిని చంపితే రూ.5లక్షలిస్తారు. ఇది కూడా మనిషి జీవించే హక్కు పట్ల గౌరవంతో కాదు. మనుషులు కోపంతో తిరిగి పులికి హాని చేయకూడదని. పులి అడపాదడపా ఒకరినో, ఇద్దరినో చంపినా దానికి అడ్డు రావద్దట. పరిహారం మాత్రం తీసుకుని గమ్మున ఉండాలి. పులి అనేక మందిని అలా చంపుతూ ఉంటే మాత్రం, అటవీశాఖ దాన్ని మాన్ ఈటర్‌గా పరిగణించి, కట్టడి చేస్తారు. అప్పటి వరకు అప్పుడప్పుడూ కొంత మంది చనిపోయినా పరవాలేదనేది వారి విధానం. మనుషులు తమ బతుకుదెరువు కాపాడుకోవటానికి ఒక్కపులిని చంపితే మాత్రం మూడు నుండి ఆరేండ్ల కారాగార శిక్ష, ఆర్థిక జరిమానా ఉంటాయి.

చట్ట వ్యతిరేకులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- మధిర సీఐ మధు



నవతెలంగాణ-బోనకల్

చట్ట వ్యతిరేకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మధిర సీఐ దొంగరి మధు హెచ్చరించారు. బోనకల్ పోలీస్ స్టేషన్ ను సీఐ మధు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిఐగా బాధ్యతల స్వీకరించిన మొదటిసారి బోనకల్ పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు, చట్టా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమ తులకాలపై నిత్యం నిఘా పెడతామన్నారు. వీటిని అరికట్టేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట ఎస్సై కడగండ్ల మధుబాబు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన నిధుల నుండి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని ములుగు మాడు గ్రామానికి 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షులు గంటా తిరుపతమ్మ, పంచాయతీ సెక్రెటరీ శ్రీలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బండారు నరసింహ రావు, శీలం శ్రీనివా సరెడ్డి, మండల సీనియర్ నాయకులు అనుమోలు కృష్ణారావు, గంటా శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ కడి యం.శ్రీనివాసరావు, నందిగం సందీప్, మెట్టు క్రిష్ణ, రేళ్ళ చర్ల శ్రీనివాసరావు, బ్రహ్మయ్య కృష్ణారావు, గంటా వెంకటేశ్వరరావు, వాసు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓపై కేసు

నవతెలంగాణ-సత్తుపల్లి

కల్లూరు డివిజన్ సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం పై ఎన్‌టీఆర్ జిల్లా విసన్నపేటలో కేసు నమోదు అయింది. డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం కీర్తన జనరల్ హాస్పిటల్ పేరుతో కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు హాస్పిటల్ ను విసన్న పేటలో నడుపుతున్నారు. హాస్పిటల్ కు వచ్చిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నడనిబాధిత మహిళ బంధువులు హాస్పిటల్ ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. దీనిపై ఆంధ్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సత్తుపల్లి లో డిప్యూటీ డీఎంహెచ్ ఓ హోదాలో ఉన్న సీతారాం తన డివిజన్ పరిధిలో వైద్యులను ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టకుండా కంట్రోల్ చేసే బాధ్యతను మరచి తానే ఓ ప్రైవేట్ హాస్పిటల్ తెరిచి నడిపిస్తుండటం గమనార్హం. గతంలో సత్తుపల్లి డివిజన్ లోని మహిళ ఉద్యోగులపై కూడా అసభ్యకరంగా ప్రవర్తించే వాడనే ఆరోపణలు ఉన్నప్పటికీ ప్రత్యేక హోదాలో ఉండటంలో సీతారాం పై ఫిర్యాదు చెయ్యడానికి ఎవ్వరూ సాహసం చెయ్యలేదు.

జిల్లా చేరుకున్న కాకర్ స్పానియల్ పోలీస్ జాగిలం




నవతెలంగాణ-ఖమ్మం

నేర దర్యాప్తు సమయంలో పోలీసు జాగిలాల సేవలు ఎంతో కీలకమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పేర్కొన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో పేలుడు పదార్థాలను కనుగొనడంలో హాండ్లర్ కానిస్టేబుల్ ఎస్.కె .పాషా ప్రత్యేక శిక్షణలో 8 నెలల పాటు కఠోర శిక్షణ.. పూర్తి చేసుకొని జిల్లాకు చేరుకున్న "కాకర్ స్పానియల్" జాతికి చెందిన 10 నెలల పూనమ్ అనే జాగిలాన్ని పోలీస్ కమిషనర్ అభినందించారు. ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు సంక్లిష్టమైన కేసుల పరిశోధన, ఛేదనలో అత్యంత కీలక పాత్ర వహించేలా విధుల్లో మరింత ప్రతిభ కనబరుస్తాయని తెలిపారు. మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో 21 జాగిలాలకు 8 నెలల పాటు 28 మంది హాండ్లర్స్ (శిక్షకులు) ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.21 జాగిలాలలో ప్రధానంగా లాబ్రడార్, జర్మన్ షెపర్డ్, బెల్జియం మాలినాయిస్, కాకర్ స్పానియల్, గోల్డెన్ రిట్రీవర్ జాతులకు చెందినవి ఉన్నాయని హాండ్లర్స్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.



పాలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేసిన వరి పైరు నీరు లేక ఎండుతోంది. సాగర్ నుంచి నీరు వస్తుందని రైతులు ఎంతో ఆశగా నాట్లు వేశారు. కానీ వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు రాకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం పంట పొలాలు పొట్ట దశలో ఉన్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్న చేస్తున్నారు. అయినా వారి శ్రమ ఫలించడం లేదు. వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు నీళ్లందక పచ్చని పొలాలు నిలువునా ఎండుతున్నాయి. ఆరుగాలం కష్టపడి నీరు పొలాలకు అందకపోవటంతో గత్యంతరం లేని పరిస్థితులలో పచ్చని పొలాలను పశువులను మేపుతున్నారు.



చి'వరి'కి మేతగా..

ఎండుతున్న పైరు

- సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
- పశువులను మేపుతున్న అన్నదాత
- ఒక్కతడి వస్తే గట్టెక్కే అవకాశం

నవతెలంగాణ -కూసుమంచి

మండల పరిధిలోని సాగర్ ఆయకట్టు పరిధిలో సుమారు 7 వేల ఎకరాలకు గాను 5వేల ఎకరాలు వరి నాట్లు వేశారు. మొత్తం పంట సాగర్ కాలువ కింద సాగవుతుంది. కానీ సాగర్ నుంచి ఈ ఏడాది నీరు కావడంతో ఎండుతున్నాయి. మండలంలోని నాయకన్ గూడెం, జక్కేపల్లి, మల్లేపల్లి, పెరకసింగారం తదితర గ్రామాలతో పాటు మండలంలోని సాగర్ ఆయకట్టు పరిధిలోని పంటలకు నీళ్లు అందక పొలాలను పశువులను మేపుడుతున్నారు. వానాకాలంలో మంచి దిగుబడి రావటంతో యాసంగిలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట పొలాలు వరి పొలాలు మొత్తం పొట్ట దశకు వచ్చాయి. ఈ దశలో నీరు సమృద్ధిగా ఉంటే పంటలు పది రోజులలో చేతికందే పరిస్థితి ఉంది. కానీ సాగర్ నుంచి నీరు రాకపోవడంతో సాగర్ కాలువలో చుక్క నీరు లేదు. కాలువలో మోటర్ల పై ఆధారపడి వరి పంటలు వేసిన రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. మోటార్లకు నీళ్ల అందటం లేదు. అయినా రైతులకు పంటపై ఆశ చావక చివరికి తమ పంట పొలాల్లో బోర్లను వేశారు. అయినా ఫలితం కనిపించలేదు. ఎండలు పెరగడంతో కొన్ని బోర్లు ఆగి ఆగి నీరు పోస్తున్నాయి. దీంతో రైతుల ఆశలు ఆవిరైపోయి చివరికి పశువులకు మేతగా తమ పొలాలను మేపుతున్నారు. ఎకరాకి రూ.30 వేల ఖర్చు వచ్చింది. చివరి దశలో నీరు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయి.

నీళ్లు వస్తాయనే ఆశతో సాగు చేశా : ఎల్లావుల గంగయ్య, కౌలు రైతు నాయకన్ గూడెం



నాగార్జున సాగర్ కాలువకు తాగు నీటి కోసం నీటిని విడుదల చేస్తారనే ఆశతో సొంత పొలం మూడు ఎకరాలు, కౌలు 27 ఎకరాలు మొత్తం 30 ఎకరాలు వరి పొలం వేశాను. ప్రస్తుతం పంట పెట్టుబడులు మొత్తం పూర్తి అయ్యాయి. ఎకరానికి 25 వేల నుండి 30 వేల రూపాయల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పొలం మొత్తం పొట్ట దశలో ఉంది. ఒక్కసారి సాగర్ కాలువకు నీళ్ల వస్తే పంట బయటపడుతుంది. లేకపోతే ఈ సంవత్సరం నాకు తీవ్ర నష్టం జరుగుతుంది.

పశువులను మేపుతున్నా : చీమట నరసయ్య, పెరిక సింగారం



నేను మొత్తం ఏడెకరాల వరి పొలం వేశాను. సాగర్ నుండి పాలేరు జలాశయంలోకి నీరు వస్తుందని, దీంతో పాలేరు నుండి మాకు కాల్వ ద్వారా నీరు వస్తాయని ఆశతో వరి పొలం వేశాను. కానీ పంట మొత్తం పొట్ట దశలో ఉంది. కాలువ రాలేదు. ఉన్న బోర్లు నీరు ఇంకిపోయింది. దీంతో ఏమి చేయని పరిస్థితులలో నా ఏడెకరాల పొలాన్ని పశువులకు మేతగా మేపుతున్నాను. సుమారు 25 వేల పెట్టుబడి వచ్చింది. ఇప్పటికైనా నీరు ఇస్తే పంట పొలాలు బతుకుతాయి.

సంకల్పం మంచిదైతే ఆటంకం ఉండదు

- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సత్తుపల్లిలో కూడా సత్యసాయి సేవలు అందించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్
- ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమైన సత్యసాయి సేవలు
- శ్రీసత్యసాయి సంస్థల సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్
- సత్తుపల్లి ప్రశాంతి సేవా నిలయం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం



నవతెలంగాణ-సత్తుపల్లి

సంకల్పం మంచిదైతే చేపట్టిన ఏ కార్యక్రమమైనా ఆటంకం కలగకుండా విజయవంతంగా పూర్తవుతుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మొదటి అంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల విశిష్ఠ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తుమ్మల మాట్లాడారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవలు విస్తృత్తమయ్యాయన్నారు. ఈ సేవా సంస్థల్లో స్వచ్ఛందంగా లక్షలాది మంది ఉచిత సేవలు సమాజానికి అందించడం భగవత్ సంకల్పమన్నారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలతో పాటు మహిళలు స్వయం సాధికారిత సాధించేందుకు వివిధ రకాల శిక్షణలు అందించడంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా వారికి కంప్యూటర్ శిక్షణ, నారాయణ సేవలో కార్యక్రమంలో నిత్యాన్నదాన కార్యక్రమాలు, బాల వికాస్ తరగతులు సాయిసేవ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లిలో కూడా సత్యసాయి సంస్థ ద్వారా సేవలు అందించాలన్నారు. సత్తుపల్లిలో నూతనంగా నిర్మాణం జరిగి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో కూడా నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరారు. అనంతరం శ్రీసత్యసాయి ప్రశాంతి సేవ నిలయానికి భూదానం చేసిన స్వర్గీయ తుళ్లూరి ప్రసాద్ కుటుంబ సభ్యులు సంబంధిత భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఆ పత్రాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సత్యసాయి ట్రస్ట్ బాధ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శ్రీసత్యసాయి సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు గాదె సత్యనారాయణ, జాతీయ సేవ కన్వీనర్ ఎస్ కోటేశ్వరరావు, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పి వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు డి సుధాకరరావు, సత్తుపల్లి సాయిసేవా సంస్థ బాధ్యులు, సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విశ్రాంత రిటైర్డు ఉద్యోగులు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం



నవతెలంగాణ- ఖమ్మం

విశ్రాంత రిటైర్డు ఉద్యోగులు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమని జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన 11 జిల్లాల రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలికి గతంలో ఎన్నిక అయిన టీచర్స్ ఎంఎల్‌సీలు, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీలలో ఒకరిద్దరు తప్ప ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పట్టించుకున్న వారే లేరని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పక్షాన నిలిచి వారికి అండగా ఉండే వ్యక్తినే రాబోవు ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎంఎల్‌సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీకి పెట్టాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల నుండి అభ్యర్థిఉంటే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సెక్రెటరీ జనరల్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోహన్, ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎర్నేని రామారావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి యం.సుబ్బయ్య, జిల్లా కోశాధికారి శర్మ, జిల్లా కమిటీ సభ్యులు జనార్ధన్, రాజారావు, వేణు, సాంబశివరావు, ఖమ్మం టౌన్‌లోని నాలుగు యూనిట్‌ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ పోయినది

చెరుకూరి కృష్ణారావు, తండ్రి పేరు వెంకటేశ్వరరావు, వయస్సు 62 సంవత్సరాలు. నేను 05-01-2024 తేదీన వైరా మండలం సోమవారం గ్రామంలోని మా ఇంటి నుండి వైరాకు జిరాక్స్ కొరకు బైక్ మీద వెళుతుండగా మార్గమధ్యంలో **E2687671** నెంబర్ గల పాస్ పోర్ట్ పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. వైరా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఎవరికైనా దొరికినచో ఈ అడ్రస్ కు తెలియజేయగలరు.

చెరుకూరి కృష్ణారావు,
S/o వెంకటేశ్వరరావు, ఇం.నెం. 1-102, సోమవారం గ్రామం, వైరా మండలం, ఖమ్మం జిల్లా. **సెల్:9381674364**

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT:CHOUTUPPAL
O.S. NO.321 OF 2022

BETWEEN:
Vudutha Yadamma ...Plaintiff
AND
Yerra Sathamma and anothers ...Defendants

To
14. Kotagiri Seetharam Swamy, S/o.subba. Rao, Age 69 years, Occ:Business, R/o H.No. 10-103, Panchali Road, Ashwaraopet Village and Mandal,Khammam District.
15. Gorla Srinivas Reddy, S/o Koti Reddy , Age 77 years, Occ:business, R/o H.No.3-99, Venkat apuram Village,Vennachedu, Khammam District.
16.Puchakayala Bhaskara Reddy S/o sundara Reddy,R/o.Gangaram, Sathupalle, Khammam District.

NOTICE

That the above case is filed by the plaintiff against the defendants for partition and separate possession of the suit schedule property and also declare the registered documents as null and void and not binding on the plaintiff. and said matter is posted on 10-04-2024 for your appearance. If you fail to appear on 10-04-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

//BY ORDER OF THE HON'BLE COURT//
P. MAHIPAL REDDY
Advocate,Choutuppal.
Cell No.9553838566.

కరాటే పోటీలలో రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మంలో సుమన్ షోటోఖాన్డు అకాడమీ ఆఫ్ ఇండియా ఆర్గనైజేషన్ వారు పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కరాటే విద్యలో ఖమ్మం నగరంలోని విడివోస్ కాలనీలో రెజొనెన్స్ విద్యార్థులు బ్లూ, ఆరెంజ్, పసుపు, గ్రీన్ కలర్ బెల్టు సాధించి ప్రముఖ సినీ హీరో డాక్టర్ సుమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందుకున్నారు. విద్యార్థులను రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వీడివోస్ కాలనీ పాఠశాల డైరెక్టర్ నీలిమా బ్లూకలర్ బెల్టు పొందిన 8వ తరగతి చదువుతున్న యస్.ఉదయ్ గ్రీన్ కలర్ బెల్టు పొందిన 7వ తరగతి చదువుతున్న టి.సాత్విక్, 4వ తరగతి చదువుతున్న కె.నిఖిల్, ఎల్లో కలర్ బెల్టు సాధించిన 6వ తరగతి చదువుతున్న ఎస్.హారిక, నిహారిక, ఆరెంజ్ కలర్ బెల్టు సాధించిన 6వ తరగతి చదువుతున్న నవనీత్ మరియు 7వ తరగతి చదువుతున్న ఆనందితలను అభినందించారు. రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ సాధించి తమ సత్తా చాటారని, వివిధ విభాగాలలో జరిగిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని ఆర్‌వి.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ నీలిమ, ఆర్‌వి, నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి కోచింగ్ ఇచ్చిన కరాటే మాస్టర్ ఉపేందర్‌కి పాఠశాల ప్రిన్సిపాల్ టి.గోపాలక్రిష్ణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీలలో అనేక మంది విద్యార్థులు, ఈ కరాటే పోటీలలో విజయాన్ని కైవసం చేసుకున్నందుకు తమకెంతో గర్వంగా ఉందని, విద్యార్థుల ఆల్రౌండ్ డెవలప్మెంట్ కోసం పాఠ్యాంశాలకు ప్రాధాన్యతనిస్తూనే సహపాఠ్య పాఠ్యేంతర అంశాలకు సైతం ప్రత్యేక శ్రద్ధతో అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. అందువల్లే తమ విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందించారు.

రాంనారాయణను పరామర్శించిన మంత్రి పొంగులేటి



నవతెలంగాణ- ఖమ్మం

టియుడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణను రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మంగళవారం రాపర్తి నగర్లోని రాంనారాయణ ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాంనారాయణ ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం విదితమే. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పొంగులేటితో పాటు పలువురు జర్నలిస్టులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాంనారాయణ సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి దృష్టికి తీసుకువచ్చారు. హెల్త్ కార్డులు లేక క్యాష్లెస్ వైద్యం అందక జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో చెల్లుబాటయ్యే విధంగా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. అలాగే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య ప్రధానమైందని, ఇండ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపాలని, కోరగా స్పందించిన మంత్రి పొంగులేటి హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంఎల్‌ఏసి బాలసాని లక్ష్మి నారాయణ, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయబాబు, బొర్ర రాజశేఖర్, స్వర్ణకుమారి, టియుడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఖదీర్, గోగిరెడ్డి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ఐజెయి జిల్లా కోశాధికారి శివానంద, జిల్లా నాయకులు నలజాల వెంకట్రావు, మోహినుద్దీన్, ఎం.పాపారావు, శ్రీనివాస్, వై.మాధవరావు, రమేష్, భూపాల్, మహేందర్, కళ్యాణ్, జనార్ధనాచారి, సాగర్, సత్యనారాయణ, నామ పురుషోత్తం, మేడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

11న ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన : మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఈనెల 11వ తేదీన భద్రాచలంలో శ్రీరాముల వారి సన్నిధిలో 5 వ గ్యారంటీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.20 లక్షల వ్యయంతో మండల పరిధిలోని తెల్దారుపల్లిలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి పేద వారికి మంచి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తామన్నారు.సంక్షేమంతో పాటుగా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, ఎంవీపాలెం పీహెచ్సీ వైద్యురాలు శ్రీదేవి, నాయకులు స్వర్ణకుమారి, రాయల నాగేశ్వరరావు,కళ్లెం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు విస్తృత ప్రచారం చేయాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

మహమ్మద్ ప్రవక్త బోధనలను విస్తృతంగా ప్రచారం చేయాలని ముస్లిం మైనారిటీ జిల్లా కాంగ్రెస్ నాయకులు జిలానిపాషా పిలుపునిచ్చారు. మంగళవారం నేలకొండపల్లిలోని నూతనంగా ఎన్నికైన జమామస్జిద్ కమిటీ ప్రెసిడెంట్ మహబూబ్అలీ, వైస్ ప్రెసిడెంట్ సుభాన్, సెక్రటరీ సొందు, ట్రజరర్ పాష కమిటీ సభ్యులను కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ముస్లింలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని డీసీబీ బ్యాంకు మేనేజర్ దినేష్ కుమార్ అన్నారు.మండల పరిధిలో గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత వల్ల బ్యాంకులపై అవగాహన కలుగుతుందన్నారు. బ్యాంకులో పొదుపు, బ్యాంకు రుణాలు, ఇతర బ్యాంకు కార్యకలాపాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ప్రసాద్, ఉపాధ్యాయులు శ్యామ్, ఆసిఫ్ మియా, బాలు, నాగమణి, వీరన్న పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాపై పెట్టిన కేసులను కొట్టేసిన కోర్టు

హర్షం వ్యక్తం చేసిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ

నవతెలంగాణ-ఖమ్మం

ప్రొఫెసర్ సాయిబాబా 7 సంవత్సరాలకు పైగా జైలు జీవితంలో నరకయాతన పడినాడు. వికలాంగుడైన సాయిబాబాకు బెయిల్ ఇవ్వకుండా కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేసింది. చివరికి కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్ర ఓడింది. న్యాయం గెలిచింది. సాయిబాబాతో పాటు మరో నలుగురికి మంగళవారం న్యాయస్థానం నిర్ధోషులని తీర్పు నివ్వటం పట్ల ఖమ్మం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు మాట్లాడుతూ బాబాల ముసుగులో అనేక మోసాలు చేస్తూ పోలీసులకు లొంగిన డేరా బాబాలకు సైతం పెరోల్ బెయిల్ మంజూరు చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వం వికలాంగుడైన సాయిబాబాకు కనీసం పెరోల్ మంజూరు చేయకపోవటాన్ని పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రస్తుతం న్యాయస్థానం ఆయన యొక్క పరిస్థితులు గమనించి వారిపైన మోపిన అక్రమ కేసులను కొట్టివేసి కోర్టు నిర్ధోషిగా తీర్పు చెప్పటం ప్రజాస్వామ్యంలో గొప్ప విషయం అన్నారు.

సబ్ స్టేషన్‌లో విద్యుత్ వైర్ బండల్ చోరీ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి క్రాస్ రోడ్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ సోమవారం రాత్రి చోరీ జరిగింది. సబ్ స్టేషన్‌లో నిల్వ ఉంచిన మూడు విద్యుత్ వైర్ బండిల్స్‌లు గుర్తు తెలియని వ్యక్తులు బొలారో మాక్స్ వాహనంలో తరలిస్తున్నారు. విధులలో ఉన్న సబ్ స్టేషన్ ఆపరేటర్ అలకిడి విని వెంట పడగా వాహనంతో దొంగలు పరారైనారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్‌ను వివరణ కోరగా సబ్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 3 బండిల్స్ విద్యుత్ వైరును ఎత్తుకెళ్లారన్నారు. దీనికి సంబంధించి పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు.



ఉచిత విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన

నవతెలంగాణ- వేంసూరు

తెలంగాణ ప్రభుత్వం ఉచిత విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు ఏఈ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి వినతి పత్రాన్ని అందజేశారు. మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ 200 యూనిట్లకు ఉచితమని చెబుతున్న అధికారులు ఆపై వాడుకున్న వారికి బిల్లును చెల్లించాలని చెప్పటం సరికాదని అదనంగా వినియోగించుకున్న యూనిట్లకు మాత్రమే నగదు చెల్లించే విధంగా చూడాలని అన్నారు. విద్యుత్ సిబ్బంది నెల రోజులకు రీడింగ్ తీయకుండా లేటుగా రీడింగ్ తీయడం మూలంగా వినియోగదారులకు నష్టం కలుగుతుందని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే సహించం : సీఐటీయు

నవతెలంగాణ-వేంసూరు

తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ చీకటి ఒప్పందానికి భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎర్ర రామయ్య భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎంఎ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు తుంగ శేషయ్య, వెంకటాచారి, ఆర్ఎంపుల మల్లయ్య, సాధు శరత్ బాబు, బింగి లక్ష్మి, బాలాజీ, సంజీవరావు, సత్యనారాయణరెడ్డి, కిన్నెర నాగరాజు తదితరులు ఉన్నారు.

మాటూరులో సీసీ రోడ్లకు శంకుస్థాపన

నవతెలంగాణ-మధిర

మధిర మండలం మాటూరు గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ద్వారా మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చి రాములు, మాటూరు గ్రామశాఖ అధ్యక్షుడు ఎక్కిటీల కృష్ణారావు, మాజీ సర్పంచ్ కొంగల ప్రసాద్ రావు, పుట్టా పుల్లారావు, మాజీ ఉపసర్పంచ్ కాసి కోటేశ్వరరావు, మాటూరు గ్రామ ఎస్సీ శాఖ అధ్యక్షుడు కొంగల భాస్కరరావు, కోల శంకర్రావు, కపిలవాయి సత్యనారాయణరాజు, కోల కృష్ణ, కొట్టే గోపాలకృష్ణ, వారం శ్రీను, మేడిసెట్టి రామకృష్ణ, పుట్టా అబ్రం, కొట్టే విజయ పాల్గొన్నారు.

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎంపీపీ

నవతెలంగాణ-తల్లాడ

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సూచించారు, మంగళవారం తల్లాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో ఇప్పటివరకు నాలుగు పథకాలను అమలు చేశారు. జీరో బిల్లుకు బదులుగా కరెంట్ బిల్లు వచ్చిన వారు ప్రజా పాలన గృహ జ్యోతి పథకంకు అప్లై చేసుకోవాలని సూచించారు. గృహ జ్యోతి పథకానికి అప్లై చేసిన రసీదు, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్‌ను ఆన్లైన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన లహరి (ఏసి) బస్సులు ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో మంగళవారం నాలుగు నూతన లహరి (ఏసి) బస్సులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 20 బెర్తులు 22 సీట్లతో కూడిన బస్సులో అత్యాధునిక సదుపాయాలతో, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని ప్రయాణీకులకు అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. సుఖవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్, ఖమ్మం, మణుగూరు డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాలో చిన్నారి అన్నప్రసన్న వేడుకకు మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హాజరైనారు. బానోత్ రాందాస్ మనమరాలు బానోత్ దీక్షితకు అన్నప్రసన్న వేడుకను జరిపారు. ఆ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, చిన్నారి దీక్షితను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులైన సంతోష్-మేఘనలకు శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగర్‌తండా పర్యటించి గ్రామస్తులు సమస్యలను అడిగితెలుసుకున్నారు. గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన సీసీ రోడ్ల పనులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కారేపల్లి సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ డైరక్టర్ బానోత్ హీరాలాల్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ), నాయకులు గుగులోత్ భీముడు, ఎస్‌కె.గౌస్‌పాషా, భూక్యా రాంచందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ముదిగొండ



అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముదిగొండ తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాలు ఆకస్మిక తనిఖీ చేసి, ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పారదర్శకంగా చేయాలన్నారు. ఆమోదయోగ్యంగా ఉన్న ప్రతి దరఖాస్తును ఆమోదించి, న్యాయం చేయాలన్నారు. తిరస్కరణకు గురయిన దరఖాస్తుకు తగు కారణం పొందుపర్చాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారందరూ ప్రయోజనం పొందేలా అన్ని ఎంపిడివో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులో సరైన వివరాలు నమోదు చేయని వారికోసం ప్రజాపాలన కేంద్రాలని, పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు పని చేస్తాయన్నారు. ఈ సమావేశంలో ముదిగొండ తహసీల్దార్ వై.రామారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి



నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసి విశ్వ వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో కలెక్టర్ విపి గౌతమ్‌తో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత నేలకొండపల్లి గ్రామ సమీపంలోని దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన బౌద్ధ స్తూపాన్ని ఆయన సందర్శించారు. బౌద్ధ స్తూపం చుట్టూ కలియ తిరుగుతూ దాని విశిష్టత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బౌద్ధ స్తూపం ప్రాంగణంలో ఎక్కడ ఏ విధమైన పనులు చేయాలో అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. బౌద్ధ స్తూపం మార్గం చూపిస్తూ మంచి డిజైన్‌తో బోర్డులు అన్ని దిక్కులలో ఏర్పాటు చేయాలని చెప్పారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విడిది కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ముజ్జుగూడెం గ్రామంలో 16 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మయించనున్న పశు వైద్యశాల భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లిలో 53.60 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమలాపురం గ్రామంలో 20 లక్షల రూపాయలు వేయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన భూక్య బిక్షాలు, భూక్య భాగ్య ఇళ్లకు వెళ్లి గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు జీరో బిల్లును తీసి స్వయంగా అందజేశారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల 12 కోట్ల రూపాయలు ఖర్చుతో నూతనంగా నిర్మించిన అదనపు వసతులు వసతిగృహం సముదాయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న విధంగా ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తుందన్నారు. ఈనెల 11వ తేదీన భద్రాచలంలోని రామయ్య సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. మొదటి విడతగా ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు చొప్పున నియోజకవర్గానికి 3,500 ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు. నేలకొండపల్లి మోడల్ డిగ్రీ కళాశాలను రాష్ట్రంలో ఉత్తమ డిగ్రీ కళాశాలగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక సమస్యలను వీలైనంతవరకు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, పురావస్తు శాఖ ఏడి నర్సింగు నాయక్, జిల్లా పర్యటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కే. శ్రీరామ్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణు మనోహర్, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, పిఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఆర్అండ్‌బి ఎస్ఈ శాంప్రసాద్, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీవో ఎం.ఎర్రయ్య, తాసిల్దార్ టీ.గౌరీ శంకర్, ఆర్ఐ మధుసూదన్, పశువైద్యాధికారి దేశబోయిన అరుణకుమారి, గ్రంథాలయ అధికారి భూక్య బాబు, ట్రాన్స్కో ఏఈ కె.రామారావు, నేలకొండపల్లి ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, దోస్పాటి కల్పన, కోరట్లగూడెం, ముజ్జుగూడెం ఎంపీటీసీలు రేగూరి వాసవి, మేళ్లచెరువు అరుణ, జిల్లా మండల కాంగ్రెస్ నాయకులు స్వర్ణకుమారి, శాఖమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విపి.గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయం, స్నానాల లక్ష్మీపురం జాతర ఏర్పాట్లపై దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ, ఆర్టీసి, మత్స్యశాఖ, ఫైర్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుండి జరిగే తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం క్యూలైన్లు, లైటింగ్, పారిశుద్ధ్య పరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ శివారులో పార్కింగ్, మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీరు అందించాలన్నారు. స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఎస్ఈ ట్రాన్స్‌కో సురేందర్, సీఈఓ జడ్పీ వినోద్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్య శాఖ ఏడి ఆంజనేయస్వామి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, ఖమ్మంరూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ముదిగొండ : ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ విపి గౌతమ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తరగతి గదులను ఆయన పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి మధ్యలో బయటికి వెళ్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ గౌతమ్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్‌ను ఆరా తీయగా ఒకేషన్ కోర్స్ విద్యార్థిని, విద్యార్థులకు ఒక గంట పాటు ఓఎ (ఆఫీస్ అసిస్టెంట్ షిప్) షార్ట్ హ్యాండ్ డ్రిల్లింగ్ ప్రేయర్‌కు అవకాశం ఇస్తామని కలెక్టర్‌కు ఆయన చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి టివితో పాటు, ప్రశ్నాపత్రాలను భద్రం పరిచే అల్మర, ప్రశ్నాపత్రాలు అకౌంట్ తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ప్రశ్నాపత్రాలను కారులో పోలీస్ ఎస్కార్ట్‌తోనే తీసుకొస్తున్నారా లేదని గేటు దగ్గర ఉన్న పోలీస్ కానిస్టేబుల్ను కలెక్టర్ విపి గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల దగ్గర నుండి మొబైల్ ఫోన్స్‌ను గేటు వద్ద సెక్యూరిటీగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ దగ్గరనే ఉన్న విషయాన్ని కలెక్టర్ విపి గౌతమ్ దృష్టి సారించారు. కళాశాల గ్రౌండ్‌లో ఆట స్థలానికి నిధులు మంజూరు చేయమని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ కోరగా కలెక్టర్ మంజూరు చేస్తానని, ప్రపోజల్ పంపించమని కలెక్టర్ చెప్పారని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

జాప్యం లేకుండా మెడికల్ బిల్లులు

- ఈ-కుబేర్‌లో పెండింగ్ జీపీఎఫ్ కోసం విజ్ఞప్తి
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ వినతులు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మెడికల్ బిల్లులు సకాలంలో మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్‌కు యూనియన్ నేతలు మంగళవారం విజ్ఞప్తి చేశారు. బిల్లుల మంజూరులో పారదర్శకత పాటిస్తూ, జాప్యం లేకుండా వరుస క్రమంలో బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యాలయంలో సిటిజన్ చార్టర్ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను త్వరితగతిన మంజూరు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ ప్రాతినిధ్యంపై సానుకూలంగా స్పందించిన మెడికల్ సూపరింటెండెంట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఈ నెలాఖరులోగా బిల్లులన్నింటినీ క్లియర్ చేస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగంలో నెలకొన్న సమస్యలపై సూపరింటెండెంట్ శ్రీదేవితో చర్చించారు. ప్రభుత్వం నుంచి జీపీఎఫ్ వడ్డీ జమల కోసం, ఇ-కుబేర్‌లో ఉన్న యాభై చెక్కులకు సుమారు ముప్పై కోట్ల పైకం విడుదల చేయడం కోసం తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి, ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. జీపీఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సూపరింటెండెంట్ త్వరగా పైకం మంజూరు అయ్యేలా తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. నెల రోజుల్లో జీపీఎఫ్ ఖాతాలను అప్డేట్ చేసి, స్లిప్పులు విడుదల చేస్తామన్నారు. టీఎస్ యూటీఎఫ్ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఆయా కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించిన వారిలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, షమీ, షేక్ ఉద్దండ్ షరీఫ్, సతీష్, గురవయ్య తదితరులున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు

ముందస్తు ప్రణాళికతో సంసిద్ధంగా ఉండాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం



వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వి.పి.గౌతమ్‌తో కలిసి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరుల లభ్యత వినియోగంపై సంబంధిత శాఖల సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో పర్యవేక్షణ చేయాలన్నారు. పాలేరు, వైరా, లకారం, లంకపల్లి జలాశయాలలో లభ్యత, వచ్చే నాలుగు నెలలకు సరిపడా కావాల్సిన నీటి లభ్యతకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. బేతుపల్లి, బోడేపూడి సుజలాం సఫలం, భగీరథ ఎన్ఎస్‌పి ద్వారా నీటిని సమకూర్చుకుంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో గ్రావిటీ పెరుగుతుందని తద్వారా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి కొరతను అధిగమించవచ్చన్నారు. మిషన్ భగీరథతో పాటు ఇతర నీటి లభ్యతకు చర్యలు చేపట్టాలన్నారు. 50 శాతం గ్రౌండ్ వాటర్‌ను సమకూర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ మంత్రి సూచనల ప్రకారం నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, తాగునీటి లభ్యత, వినియోగంపై సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. దానవాయిగూడెంలో ఫిల్టర్ బెడ్స్‌తో పాటు లకారంలో 5 ఎంఎల్‌డి ఫిల్టర్ బెడ్స్ ద్వారా నగరంలో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ ద్వారా రోజువారి వినియోగంకు కావాల్సిన నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, జలాశయాలతో పాటు గ్రామాలలో ఉన్న బోర్లను పునరుద్ధరించడం జరిగిందని, రోజువారి వినియోగంకు 013 టిఎంసీ అవసరమవుతుందని, ఏప్రిల్ 1 నాటికి 1 టిఎంసి నీటిని సమకూర్చుకున్నట్లయితే వచ్చే నాలుగు నెలల వరకు సప్లయి చేసేందుకు ఇబ్బందులుండవన్నారు. కార్పొరేషన్ పరిధిలో 33 ఎంఎల్‌డి సప్లయి చేసే వారమని, మరో 5 ఎంఎల్‌డి పెంచడం జరిగిందని, ఇప్పటి వరకు 4 మోటార్లు రన్నవుతున్నాయని, మరో మోటారును కూడా సిద్ధం చేయడం జరిగిందని, 5 మోటార్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇరిగేషన్ శాఖ అధికారులు వివరించారు. సమావేశంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్‌లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఆనంద్‌కుమార్, మిషన్ ఎస్.సదాశివకుమార్, భగీరథ ఇఇ పుష్పలత, గ్రిడ్ ఇఇ వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్‌కుమార్, మున్సిపల్ ఇఇ కృష్ణలాల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిని పరామర్శించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ- ఖమ్మం

ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావును రెవెన్యూ సమాచార-పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. రంగారావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి శస్త్రచికిత్స అనంతరం ఖమ్మం రాపర్తి నగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఉదయం శెట్టి ఇంటికి వెళ్లి పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరు గురించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, సీపీఐ నాయకులు శింగు నర్సింగరావు, పోటు కళావతి, సీపీఎం ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, నర్రా రమేష్ తదితరులు ఉన్నారు. అలాగే, కాంగ్రెస్ ఖమ్మం 58వ డివిజన్ నాయకులు నల్లమల వేణు, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, బోడ వీరన్న, కూసుపూడి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయకండి

10న జరిగే మహాసభను విజయవంతం చేయండి : ఆర్‌ఎంపిడబ్ల్యూఏ

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో ఉన్న గ్రామీణ వైద్యులంతా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయవద్దని ఆర్‌ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాస్‌రావులు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు ఈనెల 10వ తేదీన ఖమ్మం పట్టణంలోని శ్రీశ్రీ సర్కిల్‌లో గల ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న 8వ మహాసభని విజయవంతం చేయాలని గ్రామీణ వైద్యులకి పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్‌ఎంపిడబ్ల్యూఏ జిల్లా ప్రచార కార్యదర్శి జి.రామారావు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డెబోయిన శ్రీనివాస్‌రావు, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.



మాటిచ్చారు.. తీవ్ర సమస్య తీర్చారు..

మంత్రి పొంగులేటి చొరవతో డ్రైయినేజీ తిప్పలకు పరిష్కారం

నవతెలంగాణ-ఖమ్మం

మంత్రి పొంగులేటి మాటిచ్చారంటే ఆ పని పూర్తవ్వాల్సిందే. అందుకు ఖమ్మం 1వ డివిజన్ కైకొండాయిగూడెం ఘటన ఓ చిన్న ఉదాహరణ. రాష్ట్రరెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జనవరి 31వ తేదీన కైకొండాయిగూడెం (ఒకటో డివిజన్)లోని గణేష్ టౌన్షిప్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో కలియ తిరిగి.. స్థానికులతో ముచ్చటించగా.. గణేష్ టౌన్షిప్ ప్రాంతంలో మురుగు సమస్యను విన్నవించారు. దీంతో స్పందించి ఆయన సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో సత్వర చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ ద్వారా కొత్తగా సైడ్ కాల్వ తవ్వించారు. పూడుకుపోయిన పాత డ్రెయినేజీలో మురుగు తొలగించే పనులు పూర్తి చేయించారు. దీంతో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు. గణేష్ టౌన్షిప్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, విహార అపార్ట్మెంట్ కార్యదర్శి గంగాధర్, స్థానికులు మంత్రి పొంగులేటికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన క్రీడా పాఠశాలలో ఎంపికలు

నవతెలంగాణ-కారేపల్లి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులకు ఎంపికకు 9 క్రీడా అంశాలతో కూడిన బ్యాటరీ టెస్ట్ కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎంపికలు మంగళవారంతో ముగిశాయి. ఉమ్మడి ఖమ్మంలో జిల్లాలో కిన్నెరసాని బాలుర క్రీడా ఆశ్రమ పాఠశాల, కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు 9 క్రీడా అంశాలలో పరీక్షలు నిర్వహించి ఎంపికను చేపట్టుతున్నారు. ఎంపికకు హెచ్ఎం బీ.నామా నాయక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బీ.నెహ్రూ ఆధ్వర్యంలో సెలక్షన్ ప్రక్రియను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు క్రీడా పాఠశాలలో 40 చొప్పున 80 సీట్లు ఉంటాయని, వాటిలో ఖమ్మం జిల్లా సంబంధించి బాలురు, బాలికలకు 20 చొప్పున 40 సీట్లకు ఎంపికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి

భారీ జలాశయాలపై మరో 800 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహం

- రాజస్థాన్‌లో 500 మెగావాట్ల సోలార్ ప్లాంటుకు ప్రాజెక్ట్ రిపోర్ట్‌కు ఆదేశం
- మరింత తక్కువ ధరలో విద్యుత్ ఉత్పత్తికి కృషి



నవతెలంగాణ-కొత్తగూడెం

దక్షిణ భారతదేశంలో పేరుగాంచిన భారీ పరిశ్రమ సింగరేణి.... బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతో గత 135 సంవత్సరాలుగా విరాజిల్లుతున్న బొగ్గు పరిశ్రమ నేడు మారుతున్న కాలమాన పరిస్థితుల రీత్యా విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టింది. దాంతో ఆగకుండా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సింగరేణి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిఇస్తున్న క్రమంలో... సింగరేణి సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సింగరేణి 6 జిల్లాలో గనుల ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రాంతాలలో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే... వినూత్నంగా భారీ జలాశయాలపైన నీటి మీద తేలియాడే విధంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే భారీ జలాశయాలపై ప్రయోగాన్ని విజయవంతం చేసిన సింగరేణి సంస్థ తాజాగా 800 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ముందుకు వెళుతుంది.

సింగరేణి కంపెనీ వ్యాప్తంగా 234 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సింగరేణి సంస్థ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో భారీ జలాశయాలపై సుమారు 800 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి సంసిద్ధమైంది. కంపెనీ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కొత్తగా సింగరేణి సంస్థ చేపట్టనున్న సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోలార్ విద్యుత్తు పెంపుదలకు కృషి చేయాలని యోచిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపు నిచ్చిన నేపథ్యంలో భారీ జలాశయాలైన లోయర్ మానేరు డ్యాంపైన 300 మెగావాట్ల నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్ జలాశయంపైన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటుకు తగు సన్నాహ చర్యలుతీసుకోవాలని సంస్థ చైర్మన్ అండ్ ఎండి ఎన్.బలరామ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

లోయర్ మానేర్ డ్యాంపై 300 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన డిపిఆర్ ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో నిర్మాణం చేపట్టడానికి కంపెనీ సిద్ధంగా ఉందని చెప్పక తప్పదు. కాగా మల్లన్న సాగర్ జలాశయంపై ఏర్పాటు చేయనున్న రెండు 250 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి డిపిఆర్‌ను వెంటనే రూపొందించే విధంగా పనులు చకచక సాగుతున్నాయి.

రాజస్థాన్ రాష్ట్రంలో సింగరేణి ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన కార్యాచరణ పైకూడ అధికారులతో రాష్ట్ర మంత్రి సమీక్షించారు. దీనిపై రూపొందించిన డిపిఆర్‌పై మరింత లోతుగా అధ్యయనం జరపాలని, తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, తద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణి సోలార్ విద్యుత్తును ఎక్కువగా కొనే అవకాశం ఉంటుందని సూచించినట్లు సమాచారం. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర పనితీరుపైన సమీక్షించడం జరిగింది. ప్రస్తుత 1200 మెగావాట్ల ప్లాంటుకు అదనంగా అదే ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి నిర్మాణం ప్రారంభించాలని అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. ఇటీవల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమృత లాల్ మీనా ఇదే ప్రాంగణంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ తో పాటు మరో 800 ప్లాంట్‌ను కూడా నిర్మించే అవకాశాలను పరిశీలించాలని సూచించారని సమాచారం. కనుక దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై వెంటనే ఒక నివేదిక సమర్పించాలని చైర్మన్ ఆదేశించారు. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేయటానికి అవకాశాలను, ప్రాంతాలను సందర్శించాలని, దీనికి సంబంధించి ఒక నివేదికను కూడా రూపొందించాలని కేంద్ర మంత్రి కోరినట్లు, ఆ కార్యచరణలో భాగంగా సింగరేణి అధికారులు ముందుకు వెళుతున్నట్లు వినికిడి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-ములకలపల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో భారతి, దమ్మపేట సీడీపీఓ జ్యోతిలు ఆకాంక్షించారు. ములకలపల్లి గుడ్ షెపర్డ్ సిస్టర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న మహిళలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే అన్ని రంగాల్లోనూ రాణించగలరన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడపాలంటే అది కేవలం మహిళలతోనే సాధ్యమవుతుందన్నారు. విలువలతో కూడిన బాల్యాన్ని పిల్లలకు అందించాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సీత, కానిస్టేబుల్ అశ్విని, డీసీసీబీ క్లర్క్ స్వాతి, అంగన్వాడీ సూపెర్వైజర్లు సామ్రాజ్యం, సుందరి, సిస్టర్స్ నిర్మల, దీప్తి, రాజ్యం, సంస్థ సిబ్బంది నాగరాజు, సుజాత, ముత్యం, బాలరాజు, వెంకటలక్ష్మి, సందీప్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను హరిస్తున్న బీజేపీ పాలకులు

- పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మోకాళ్ళ సుగుణ

నవతెలంగాణ-ఇల్లందు

దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్త్రీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ఈ దాడులకు మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం హరించి వేస్తున్నారని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మోకాళ్ళ సుగుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 114వ పోరాట దినోత్సవం సందర్భంగా కొల్లాపురంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చీమల సమ్మక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుగుణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్నదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన పాల్వంచ మండలం జగన్నాథపురం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం...ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో నరసింహరావు (50) మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జూలూరుపాడు మండలం పాపకొల్లుకి చెందిన వాసులుగా పోలీసులు గుర్తించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి పల్స్ పోలియోను తనిఖీ చేసిన డీఐవో



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని మోరంపల్లిబంజర పీహెచ్సీ పరిధిలో గ్రామంలో ఇంటింటి పల్స్ పోలియోను కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) బాలాజీనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి 0-5 ఏళ్లలోపు పిల్లలు ఎవరైనా చుక్కలమందు పొందక పోతే తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎడమ చేతికి మార్కింగ్ చేయడం, వలస కూలీలను గమనించడం, పోలియోపై అందరికీ అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీహెచ్ఓ నాగభూషణం, పీహెచ్సీ వైద్యులు లక్ష్మిసాహితీ, సీహెచ్ఓ ఎం.సత్యవతి, సోమ్లా, హెచ్ఐవో రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచలో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయ అనుబంధ మైనింగ్ కళాశాలను కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మంగళవారం సందర్శించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి కళాశాల సమస్యలపై చర్చించారు. ఉన్నత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనిగంటలపై అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పని గంటలపై అవగాహన కల్పించినట్లు ఏపీవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. గోలియా తండా గ్రామం సమీపంలో జరుగుతున్న చెక్ డ్యాం పూడికతీత పనిని పరిశీలించామన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు ప్రతిరోజు కూలీ రూ.272 పొందాలంటే ఎంత మంది ఎంత పని చేయాలి, ఎన్ని గంటలు చేయాలని వారికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఆరో రోజుకి చేరిన పరీక్షలు

- మూడు కేంద్రాల పరిధిలో 34 మంది గైర్హాజర్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మంగళవారంకు ఆరో రోజుకు చేరాయి. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం జూనియర్, టీఎంఆర్, వీకేడీవీఎస్ ఆర్ జూనియర్ కళాశాలల్లోని మూడు పరీక్షా కేంద్రాల పరిధిలో ద్వితీయ సంవత్సరం గణితం/వృక్షశాస్త్రం/రాజకీయ శాస్త్రం పరీక్షలలో మొత్తం 911 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 877 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, సీఐ జితేందర్, ఎస్‌హెచ్ఓ ఎస్ఐలు శ్రీను, శివరామక్రిష్ణలు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌లుగా దామెర నరసింహారావు, అలవాల వెంకటేశ్వరరావు, రామయ్య, ఝాన్సీ, యేశోబు, ఎల్.శివప్రసాద్‌లు విధులు నిర్వహిస్తున్నారు.

కేంద్రం	ఎలాట్మెంట్	అబ్సెంట్	ప్రజెంట్
జి.జేసి	410	25	385
టిఎం ఆర్ జేసీ	193	05	188
వీకేడీవీఎస్ఆర్ జేసీ	308	04	304
మొత్తం	911	34	877

ఖమ్మం మార్కెట్లో మధ్య దళారీల దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-ఇల్లందు

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మధ్యధళారీల దోపిడీని అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)రాష్ట్ర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మంగళవారం ఖమ్మంలో మంత్రి తుమ్మల క్యాంప్ ఆఫీస్ ముట్టడికి వెళ్లిన న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టులను ఖండిస్తూ మంగళవారం ఇల్లందు ఐఎఫ్టియు కార్యాలయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరెస్ట్ అయిన వారిని బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి కొక్కు సారంగపాణి, సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లందు మండల కార్యదర్శి పొడుగు నరసింహారావు, టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు సూర్ణపాక నాగేశ్వరరావు,ఎట్టి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పేద వాళ్ళకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్రంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం పాయం మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుంది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన వంట సామగ్రి అందించాలి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



నవతెలంగాణ-భద్రాచల రూరల్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 55 ఆశ్రమ పాఠశాలలు, 21 వసతి గృహాలు, మూడు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన పదికాలాలపాటు పనికివచ్చే సామగ్రిని టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసి సరఫరా చేయడం జరుగుతుందని పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో స్కూల్‌లకు సరఫరా చేసే సామగ్రి టెండర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హనుమ కొండ, హైదరాబాద్, భద్రాచలం నుండి ఆరుగురు టెండర్దారులు సరఫరా చేసే వస్తువుల శాంపిల్సు పరిశీలించి, నాణ్యమైన వస్తువులను టెండర్ దారులు తక్కువ కోడ్ చేసిన ఏజెన్సీలకు ఈ వస్తువులు సరఫరా చేసే బాధ్యతను అప్పగించడం జరిగిందని ఆయన అన్నారు.

వస్తువులు సరఫరా చేసే ఏజెన్సీ దారులు శాంపిల్స్ ప్రకారము చూపిన వస్తువులను మాత్రమే ఆశ్రమ పాఠశాలకు, వసతి గృహాలకు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, డీఎం జీసీసీ విజయ్ కుమార్, ఏటీడీవోలు జహీరుద్దీన్, నర్సింగరావు, చంద్రమోహన్, రూపా దేవి, కార్యాలయం సిబ్బంది ప్రమీల బాయ్, రమణమ్మ, ఏజెన్సీ దారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల బడ్జెట్ ప్రణాళికలు రూపొందించాలి

- కలెక్టర్ ప్రియాంక అల





నవతెలంగాణ-పాల్వంచ

మున్సిపాల్టీల ఆదాయ, వ్యయాల నిర్వహణకు బడ్జెట్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ప్రియాంక అల మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన, పట్టణ ప్రగతి అంశాలపై మున్సిపల్ చైర్మెన్లు, పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, పారిశుధ్య అధికారులు, టిపిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీలకు వచ్చే ఆదాయ వ్యయాలను బేరీజు వేసి ఎటువంటి పొరపాట్లుకు తావులేకుండా జాగ్రత్తగా బడ్జెట్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రూపాయి లెక్క తీయాలని చెప్పారు. బడ్జెట్ ప్రకారం అజెండా తయారు చేసి కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలని పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పన చాలా ముఖ్యమని, వాస్తవికంగా ఉండాలని, ప్రిలిమినరీ ద్వారా సమగ్ర అవగాహన వస్తుందని చెప్పారు. గత సంవత్సరం డ్రెయిన్లు, రహదారులు నిర్మాణానికి కేటాయించిన నిధులు, ఖర్చుల నివేదికలు అందచేయాలని చెప్పారు. ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ప్రక్రియ కొత్తగూడెంలో 72, పాల్వంచలో 81, ఇల్లందులో 96, మణుగూరులో 62 శాతం జరుగుతున్నదని, తక్కువ సేకరణ జరుగుతున్న వార్డుల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు. చెత్త సేకరణలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్పిలను భాగస్వాములను చేయాలని చెప్పారు. వార్డుల వారిగా సేకరించిన తడి చెత్తను అక్కడే వర్మి తయారు చేయు విధంగా యూనిట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి వార్డులో వర్మి యూనిట్లు ఏర్పాటు కావాలని, ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎఫ్ఎసిపిలలో గ్రీనరీ ఉండాలని, బ్రహ్మాండంగా ఉండాలని, ఫుట్పాత్లపై పాదచారులు నడిచే పరిస్థితి లేదని, పాదచారులు వెళ్లే విధంగా ఉండాలని ఆక్రమణలను తొలగిం చాలని ఆదేశించారు. డిఆర్ సిసిలో సక్సెస్ కం జెట్టింగ్ యంత్రాలు వినియోగించాలని, డిఆర్సిలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువులు కంప్రెస్ చేయడానికి హైడ్రాలిక్ బెయిలింగ్, కన్వేయర్ బెల్టులు ఏర్పాటు చేయాలని చెప్పారు. బృహత్ పల్లె ప్రకృతి వనాల్లో డెన్స్ ప్లాంటేషన్ చేయాలని చెప్పారు. మరణించిన వ్యక్తుల అంతిమ కార్యక్రమాల నిర్వహణకు ప్రతి మున్సిపాల్టీలో గ్యాస్ ఆధారిత దహనవాటికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉన్నట్లు చెప్పారు. తద్వారా మున్సిపాల్టీలకు ఆదాయం కూడా సమకూరుతుందని చెప్పారు. రహదారులు పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలను వినియోగించాలని చెప్పారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల అధికారులకు సూచించారు. ఇట్టి సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల యాక్షన్ టేకెన్ రిపోర్టులను తయారు చేయాలని, తదుపరి నిర్వహించే సమావేశంలో సమీక్షించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ ఆడిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిజాయితీ గల అధికారిపై బురద పూస్తారా

- ఎంపీఓపై అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం
- పినపాక సెక్రటరీల సంఘం హెచ్చరిక

నవతెలంగాణ-పినపాక

ఎంపీఓ వెంకటేశ్వరరావుపై అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకోమని పినపాక సెక్రటరీల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పినపాక మండల కార్యదర్శిలు హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీల సంఘం నాయకులు మాట్లాడుతూ తమపై ఎంపీఓ ఎటువంటి ఒత్తిడిలకు గురి చేయలేదని, కేవలం ఒక అధికారిగా పని మాత్రమే చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. వృత్తిపరమైన అంశాలలో అసత్య ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకటి రెండు పత్రికలు పని పట్టుకొని అదే విధిగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. పత్రికలు నిజాలు రాసి పాత్రికేయ విలువలు కాపాడాలని కోరారు. ఆధారాలు లేని వార్తలు రాసి తమను ఇబ్బంది పెట్టవద్దని తెలియజేశారు. ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సైతం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 23 గ్రామ పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులలో చదవడం అదృష్టం

- ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీలో ఎస్‌హెచ్ఓ ఎస్సై శ్రీరాముల శ్రీను



నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రభుత్వ బడుల్లో చదువుకోవడం అదృష్టం అని, మన పూర్వీకులు అయిన తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు నాటి ప్రభుత్వ బడుల్లో చదువుకున్న వారేనని స్తానిక ఎస్‌హెచ్ఓ ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఉద్బోధించారు. స్తానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో "ఎ లైవ్ యూత్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ బడుల్లో సైతం అనేక సదుపాయాలు కల్పిస్తుందని, ఊరి బడిలో చదివి ఒక ఉన్నత స్థానానికి చేరుకోవడంలో నేనే ఒక ఉదాహరణ అని, ఎందుకంటే మాది అతి సామాన్యమైన రైతు కుటుంబం అని, నాటి ప్రభుత్వ బడుల్లో అరకొర సౌకర్యాలు నడుమ అప్పటి మా కుటుంబ ఆర్థిక పరిస్థితులకు లోబడి కష్టపడి చదివి నేడు ప్రభుత్వ ప్రధాన రక్షణ శాఖలో ఎస్ఐ స్థాయిలో సమాజానికి సేవలు అందించడం నాకు గర్వకారణంగా ఉందని అన్నారు. సమాజ హితం కోరే సేవా కార్యక్రమాలలో నన్నూ భాగస్వామిని చేసినందుకు ఏ లైవ్ యూత్ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత మాట్లాడుతూ ఏ లైవ్ యూత్ ఫౌండేషన్ చే రాబోవు పరీక్షలకు ప్యాడ్స్ పంపిణీ చేయడం సంతోషకర అన్నారు.

ఫౌండేషన్ అధ్యక్షులు అశోక్ బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో ప్యాడ్స్ పంపిణీ చేస్తూనే ఉన్నాం అని ఎందుకంటే మేము చదివిన మా బడి పై అభిమానం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, వి.కిశోర్ బాబు, బాలస్వామి, నాగేశ్వరరావు, మధుసూదన్, సలీం పాషా, శోభారాణి, రామిరెడ్డి, కాంతారావు, పూర్ణచంద్రరావు, విష్ణు ప్రియ, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి ప్రసాద్, ఏ లైవ్ యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు చొక్కా అశోక్ బాబు, కార్యదర్శి శీను, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కిన్నెరసానిలో క్రీడా పాఠశాలల ఎంపికలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ భద్రాచలం ప్రతీక్ జైన్, డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఆదేశాల మేరకు 2024-2025 విద్యా సంవత్సరపు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మోడల్ క్రీడా పాఠశాలల బాలురు కిన్నెరసాని, బాలికలు కాచినపల్లిలకు 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశాల కోసం మొదటి రోజు మంగళవారం ఎంపికలు కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాల యందు దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్ ప్రారంభించారు. ఎంపికలకు మొదటిరోజు బాల, బాలికలు 200మంది హాజరైనారు. సంక్షేమ సహాయ అధికారి, చంద్రమోహన్ జిల్లా క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, ఎస్ఓలు కొమరం వెంకటనారాయణ, నాగేశ్వరరావు, బి.రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చందు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు బుగ్గ వెంకటేశ్వర్లు, పీడీలు ఏ.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కే.వెంకటేశ్వర్లు, పి.రాంబాబు, కే.వెంకటేశ్వర్లు, డి.రవి, ఎం.రాంబాబు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన సీఐటీయూ పోరాటం

- డైలీ వేజ్ వర్కర్ల వేతనాల బడ్జెట్ విడుదల



నవతెలంగాణ భద్రాచలం రూరల్

ఫిబ్రవరి 27 నుండి మార్చి రెండవ తేదీ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన డైలీ వేజ్ వర్కర్ల సమ్మె ఫలితంగా డైలీ వేజ్ వర్కర్ల వేతనాల బడ్జెట్ విడుదలైంది. హైదరాబాదులో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో సీఐటీయూ నాయకత్వం గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డిని కలిసి సమస్యల పై మంగళవారం వినతిపత్రం అందజేశారు. 30కోట్ల రూపాయల బడ్జెట్ విడుదల అయిందని జిల్లాల వారిగా బడ్జెట్‌ను విడగొట్టి నాలుగురోజుల్లో కార్మికుల అంకౌంట్‌లో జమచేస్తామని సీఐటీయూ నాయత్వానికి అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి చెప్పారు. పర్మినెంట్ చేయటం, టైమ్ స్కేల్ అమలు, చనిపోయిన కార్మికుల వారసులకు డైలివేజ్ పోస్టు ఇవ్వడం, నెలనెలజీతం ఇవ్వడం, జీతాలకు అవసరమైన పూర్తిబడ్జెట్ కేటాయించాలని సిఐటియు కోరింది. కొత్త ప్రభుత్వానికి సమస్యలను తెలియజేస్తామని ప్రభుత్వ పాలసితో ముడిపడివున్న సమస్యలపై మంత్రిమండలి నిర్ణయం తీసుకోవాలి కాబట్టి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని ఏడీ చెప్పారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల బకాయివేతనాల బడ్జెట్ కేటాయించాలని కోరాగా బడ్జెట్ విడులకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపిచామని ఏడీ చెప్పారు. క్యాటరింగ్ విధానం రద్దుచేయాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని సిఐటియు కోరింది. సమస్యలు పరిష్కారం చేయకపోతే మళ్లి సమ్మెచేస్తామని సిఐటియు తెలిపింది. సమ్మెకాలం వేతనం ఇవ్వాలని సిఐటియు కోరింది. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, నాయకులు కె.బ్రహ్మాచారి, రత్నం రాజేందర్, తదితరులు అడిషనల్ డైరక్టర్‌ను కలిసారు.



బస్ షెల్టర్ నిర్మాణానికి పాయం శంకుస్థాపన

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని మోతే పట్టీనగర్ గ్రామంలో ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షతో నిర్మించ తలపెట్టిన బస్ షెల్టర్ నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీసీ పీఎస్పీడీ పరిసర గ్రామాల్లో బసెల్టర్లు, పాఠశాలలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా బస్ షెల్టర్ కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఈ పనులకు ఐటీసీ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఐటీసీ అధికారులు మాట్లాడుతూ 40 రోజుల్లో బసెల్టర్ పూర్తిచేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగ్రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, బెల్లంకొండ రామారావు, మోహనరెడ్డి, నాగిరెడ్డి, పూలపెల్లి సుధాకర్ రెడ్డి, స్థానికనాయకులు పాల్గొన్నారు.

ఆటో ట్రాలీని ఢీకొన్న లారీ

నవతెలంగాణ-బూర్గంపాడు

ఐటీసీకి బొగ్గులోడుతో వచ్చిన ఓ లారీ యూటర్న్ తీసుకుంటూ టాటా ట్రాలీని ఢీకొన్న సంఘటన సారపాకలో మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి నుంచి ఐటీసీకి బొగ్గులోడుతో వచ్చిన లారీ యూటర్న్ తీసుకునే క్రమంలో ప్రధాన రహదారిపై వెళుతున్న టాటా ఆటోట్రాలీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోట్రాలీ వాహన ముందుభాగం నుజ్జయింది. ప్రాణాపాయం లేకపోయినప్పటికీ ఐటీసీకి వచ్చిపోయే వాహనాలు ఇలా నిబంధనలు పాటించకుండా యూటర్న్, విచ్చలవిడిగా నడపడటంతో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవేకు ఐటీసీ ఆనుకుని ఉండటంతో ఐటీసీ ఉన్నతాధికారులు వాహన రాకపోకలపై పర్యవేక్షణ చేయాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

పంటల నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని కిష్టారం గ్రామంలో పంటల నమోదు ప్రక్రియలో భాగంగా పంటలను జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు మంగళవారం పరిశీలించినట్టు తెలిపారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపీరిఫాస్ 2.5మెల్ లేదా కార్తాఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కేజీలు ఎకరానికి వేయాలని తెలియజేసినట్లు తెలిపారు. వరి చిరు పొట్ట దశలో దశలో యూరియా, 25కేజీలు పోటాష్ 20 కేజీలు వేయడంవలన గింజ గట్టిపడి నాణ్యత బాగుంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రెహన, ఎంఏఓ అన్నపూర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అభివృద్ధి పనులు పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ

ఈ నెల 11న జిల్లాలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అభివృద్ధి పనులు పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రియాంక అల అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎస్పీ రోహిత్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రామాలయ దర్శనం అనంతరం జిల్లాలోని అభివృద్ధి పనులపై రివ్యూ మీటింగ్‌కు గిరిజన భవన్‌లో అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఎంపిక చేసిన సభ స్థలంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రామాలయ దర్శనం, హెలిపాడ్ నిర్మాణం, సభాస్థలికి ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండాలన్నారు.



అనంతరం జిల్లాలో జరిగే అన్ని అభివృద్ధి పనులు పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ధరణి, ఎల్లారెస్, ప్రజా పాలనకు మొత్తం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది అర్హులు ఉన్నారు అన్ని వివరాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గృహలక్ష్మీ, గహజ్యోతి పథకాలకు మొత్తం వచ్చిన దరఖాస్తులు, మొత్తం లబ్దిదారుల వివరాలను సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్య శాఖలకు ఇప్పటివరకు మంజూరు అయిన నిధులు చేపట్టిన పనులు, మన ఊరు మనబడి, జిల్లాలోని అన్ని పాఠశాలలు అంగన్వాడీ, కేంద్రాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పై నివేదికలను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. శ్రీరామ నవమి నాటికి భద్రాచలం వద్ద నిర్మిస్తున్న రెండవ వంతెన పనులు పూర్తి అవ్వాలని అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని నేషనల్ హైవే అధికారులు ఆదేశించారు. వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా తీసుకునే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులు ఆదేశించారు.

భద్రాచలం రామాలయ పరిధిలోని భూముల వివరాలు, భద్రాచల రామాలయ అభివృద్ధి కోసం చేపట్టవలసిన అభివృద్ధి పనులు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని రామాలయ ఈవో రమాదేవిను కలెక్టర్ ఆదేశించారు. రేపు సాయంత్రం లోగా అన్ని శాఖల అధికారులు అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు జిల్లాలో ఇప్పటివరకు ఇచ్చిన పోడు పట్టాల సంబంధించిన వివరాలను నివేదిక అందజేయాలని డీఎఫ్ కృష్ణ గౌడ్‌ను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, డీఆర్ఓ రవీందర్ నాథ్, జిల్లా పరిపాలన అధికారి గన్య, డీఎంహెచ్ఓ శిరీష, డీఎస్ఓ రుక్మిణి, భద్రాచలం ఆర్డీవో కే.దామోదర్ రావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్అండ్‌బీ ఈఈ అర్జున్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పురుగుమందు డబ్బాలతో

గిరిజన రైతుల ఆందోళన

నవతెలంగాణ-ములకలపల్లి

గిరిజన రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అంటగట్టారని బాలాజీ ఫెర్టిలైజర్స్ దుకాణం ఎదుట బైఠాయించి పురుగుమందు డబ్బాలతో గిరిజన రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ములకలపల్లి మండలం తాళ్లపాయకు చెందిన గిరిజన రైతులు యాసంగి వరిసాగు కోసం ములకలపల్లికి చెందిన బాలాజీ ఫెర్టిలైజర్స్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి నాటువేశారు. ఈ విత్తనాలు వయస్సు రాకముందే వరి ఈనడంతో తాలు కంకులు వచ్చాయి. రైతులకు ఏంచేయాలో దిక్కుతోచక బాలాజీ ఫెర్టిలైజర్ దుకాణదారులను అడగ్గా మాకు సంబంధంలేదు.. ఏమైనా ఉంటే ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో రైతులు పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమను ఆదుకోవడంలో అధికారులు విఫలమయ్యారని, తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమంటూ పురుగుమందు డబ్బాలతో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో విత్తనాలు తీసుకుని మోసపోయిన బాధిత రైతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం : ఏఓ కరుణామయి

బాలాజీ ఫెర్టిలైజర్‌కి ఏవో కరుణామయి వచ్చి రైతులను న్యాయం చేస్తామని, అలాగే బాలాజీ ఫెర్టిలైజర్స్‌లో మా అనుమతులు వచ్చేంతవరకు క్రయవిక్రయాలను నిలిపివేయాలని ఆమె ఆదేశించారు.

అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తింప చేయాలి

- నిబంధనల పేరుతో అర్హులకు అన్యాయం చెయ్యొద్దు
- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



అర్హులైన ప్రజలందరికీ గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిందని ప్రజల వద్ద ప్రజాపాలన దరఖాస్తులు సేకరించి 200 యూనిట్ల లోపు కరెంటు వాడే వారికి ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న ప్రజలలో కేవలం 10 శాతం లోపు ప్రజలకు మాత్రమే వర్తించేలాగా ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. 200 యూనిట్ల లోపు కరెంటు వాడుకునే వారు కూడా తమకు ఎందుకు అవకాశం రాలేదని ఇంటికి వచ్చిన అధికారులను అడిగితే ఎండీఓ ఆఫీస్‌కి వెళ్లి తెలుసుకోమని చెబుతున్నారని దీని వలన ఈ పథకంలో గందరగోళం నెలకొందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రజా పాలన దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఎండీఓ ఆఫీస్‌కి ఎందుకు వెళ్లాలని ఆయన ప్రశ్నించారు. నిబంధనల పేరుతో అర్హులైన వారికి అన్యాయం చెయ్యొద్దని ఆయన సూచించారు.

పార్టీలు ఫిరాయించడం జాతి ద్రోహం

- ఆదివాసీల పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య పై గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలవడంతో ఆయన పార్టీ మారుతున్నాడని చర్చ డివిజన్ వ్యాప్తంగా సాగుతుంది. కాగా వెంకట్రావు మాత్రం తాను పార్టీ మారడం లేదని భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి, టెంపుల్ సిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిశానని ప్రజల తీర్పుకు అనుకూలంగా నడుచుకుంటానని, తన రాజకీయ గురువు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని తేల్చేశాడు. ఈ మాటలతోనే ఆయన పార్టీ మారుతున్నాడని విషయాన్ని చెప్పకనే చెప్పినట్లు అయింది. ఈ నెల 11వ తేదీన భద్రాచలం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పార్టీలో చేరడం లాంచనమే అనే ప్రచారంతో పార్టీ నాయకత్వం, కేడర్, కార్యకర్తలు కొంత విస్మయం చెందడంతో పాటు పునరాలోచినలో పడ్డారు. వెంకట్రావు పార్టీ మారుతున్నాడనే చర్చ జరుగుతున్న సమయంలో మంగళవారం ములకపాడు సెంటర్లో ఆదివాసీల పేరుతో ముద్రించిన ఫ్లెక్సీ వెలిసింది. ఫ్లెక్సీలో గెలిపించిన కార్యకర్తలను హేళన చేసే విధంగా పార్టీ మారే విధానాన్ని భద్రాచలం నియోజకవర్గంలో తీసుకురావద్దని, అమర జీవులు కామ్రేడ్ కుంజ బొజ్జి, సున్నం రాజయ్య, గుమ్మడి నరసయ్యలు మన జాతి కీర్తి ప్రతిష్టలు, నలుదిక్కుల వ్యాపించే చేశారని వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ జాతి గౌరవాన్ని కాపాడుకుందాం అంటూ పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని, కార్యకర్తల శ్రమను నాయకుల తెగింపును తక్కువగా చూసి మీ దారి మీరు చూసుకోవడం హేయమైన చర్య అన్నారు. ఇప్పుడిప్పుడే చైతన్యం పొంది అన్ని రంగాలలో ముందుకు పోతున్న, మనం వర్గం ప్రజల మీద నమ్మకం కోల్పోయే విధంగా దీని పరిణామాలు ఉంటాయని ముద్రించిన ఫ్లెక్సీ ఏర్పాటుతో పెద్ద ఎత్తున చర్చ సైతం కొనసాగుతుంది.

నూతనంగా నియమితులైన నాయకులకు సన్మానం

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని పాపకొల్లు గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీనివాసరావు (కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి), కోదుమూరి కోటేశ్వరరావు (కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి), వాంకుడోత్ కిషన్ నాయక్ (మండల సేవాదళ్ అధ్యక్షులు)గా నూతనంగా నియమి



తులైన సందర్భంగా పాపకొల్లు గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతి అరికట్టాలి

నవతెలంగాణ-బూర్గంపాడు



ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని భద్రాద్రి మహిళావెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు మండిపడ్డారు. మంగళవారం సారపాకలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేదలు, కూలీలు, రైతుకూలీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అభాసుపాలవుతుందని, ఈ పథకం కింద చేపట్టిన పనుల్లో అవకత వకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు పడటంలేదని, ఇంటి వద్ద ఉన్నవారికి, పనిచేయనివారికి వేతనాలు పడుతున్నాయని ఉపాధి అధికారుల పనితీరును ప్రశ్నించారు. ప్రతి పంచాయతీలో అర్హులందరికీ జాబ్కార్డులు మంజూరు చేసి వేతనాలు సక్రమంగా ఇవ్వాలని, అవకతవకలు జరగకుండా చూడాలని, వీటిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పాలెప్ను భవానీ, కోశాధికారి సుమతి, సహాయ కార్యదర్శి పసుపులేటి రాణి, ఉపాధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-మణుగూరు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మణుగూరు ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచంద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2024 ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో సింగరేణి కుటుంబాల మహిళలకు, యువతులకు టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ బాస్కెట్ , బాల్ త్రో, బాంబ్ ఇన్ దా సిటీ క్రీడా పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన దుర్గం సుమతి రామచందర్ మాట్లాడుతూ...మహిళా శక్తి ఎంతో గొప్పది, మహిళలు వంటింటికి పరిమితం అన్న నానుడిని తుడిచేసి, నేటి మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు అన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని, ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయి అన్నారు. మహిళా క్రీడా పోటీలకు విచ్చేసిన వారికి ఆమె అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు 7వ తేదీన బంగ్లోస్ ఏరియా ఇల్లందు క్లబ్‌లో జరిగే మహిళా దినోత్సవ ప్రధాన వేడుకల్లో బహుమతి ప్రధానం చేయబడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు వీసం రమా కృష్ణయ్య, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లీ, ఇతర ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సభ్యులు జమీల బేగం, సంధ్య రాణి, సింగరేణి ఉద్యోగుల మహిళలు, స్థానిక యువతులు, తదితరులు పాల్గొన్నారు.

200 యూనిట్ల లోపు వారికి రాని జీరో బిల్లులు

- గృహ విద్యుత్ వినియోగదారులు 30 వేలు
- గృహజ్యోతి లబ్ధిదారులు 16 వేలు
- వెల్లువెత్తుతున్న దరఖాస్తులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

విద్యుత్ శాఖ అశ్వారావుపేట సబ్ డివిజన్‌లోని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో గృహ విద్యుత్ వినియోగదారులు 30 వేల గృహాలకు విద్యుత్ సౌకర్యం కలిగి ఉండగా ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ అనంతరం ప్రభుత్వం 16 వేల గృహ వినియోగదారులకు మాత్రమే జీరో బిల్లు జారీ చేసింది. ఇందులో 200 యూనిట్ల లోపు వినియోగదారులకు సైతం కొందరికి జీరో బిల్లు



రాకపోవడంతో పేదల్లో ఆందోళన కలుగుతుంది. జీరో బిల్లు రాని 200 యూనిట్లు లోపు వినియోగదారులు ప్రజా పాలన సేవా కేంద్రాల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ కేంద్రాల్లో దరఖాస్తులు వెల్లువెత్తున్నాయి. సోమ, మంగళ వారాల్లోనే రెండు రోజుల్లో అశ్వారావుపేట మండలం పరిషత్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో రెండు వందల లోపు దరఖాస్తులు వచ్చాయి. నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలోనే దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని గృహ విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

- బాంబే హైకోర్టు తీర్పు సంతోషకరం

నవతెలంగాణ-ఇల్లందు

ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను బాంబే హైకోర్టు నిర్దోషిగా తేల్చింది. ఆయనకు విధించిన జీవిత ఖైదును రద్దుచేసింది. ఈమేరకు మంగళవారం ఉదయం బాంబే హైకోర్టు తీర్పు వెలువరించడం సంతోషకరమని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో మహారాష్ట్ర పోలీసులు ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఢిల్లీలోని ఆయన నివాసంలో మావోయిస్టు సాహిత్యం దొరికిందని ఆరోపించారు. ఆయనను గడ్చిరోలి సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. 2017లో సెషన్స్ కోర్టు ఆయనను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. అనారోగ్యంతో వీల్ చెయిర్ కే పరిమితమైన ప్రొఫెసర్ సాయిబాబా ప్రస్తుతం నాగ్ పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. సెషన్స్ కోర్టు తీర్పుపై ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. 2022 అక్టోబర్ 14న ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది.

సెషన్స్ కోర్టు తీర్పును కొట్టేసింది. అయితే, ఈ కేసులో మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా బాంబే హైకోర్టు తీర్పును అత్యున్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. మరోసారి విచారణ జరపాలని బాంబే హైకోర్టుకు సూచించింది. దీంతో మళ్లీ విచారించిన బాంబే హైకోర్టు తాజాగా మంగళవారం ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు నివ్వడం సంతోషకరమన్నారు.

కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి

నవతెలంగాణ-సుజాతనగర్



కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికుల సొసైటీలను పునరుద్ధరించి వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. తరతరాల నుండి ఏజెన్సీ ఏరియాలోని గ్రామాలలో గీత వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులు తమ సొసైటీలను రద్దు చేయడంతో ఉపాధి కోల్పోయారని ప్రభుత్వం వృత్తిదారులకు ఇచ్చే సంక్షేమ పథకాలు వీరికి వర్తించడం లేదని ఆవేదన చెందారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో ఈ విషయం ప్రస్తావించారని అందుకని ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దు చేసిన సొసైటీలను పునరుద్ధరించాలని అన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు విపరీతంగా పెట్టడం వలన కల్లు అమ్మకాలు రోజురోజుకి పడిపోతున్నాయని, అందుకని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని ప్రకృతి పానీయం కల్లును ప్రోత్సహించాలని, ప్రతి సొసైటికి చెట్ల పెంపకానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని ఉన్న 560 జీవో అమలు చేయాలి లేదా కొనివ్వాలని, తాటి, ఈత, జీలుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టి చెట్లు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెజవాడ సత్యం, బొర్రా నాగేంద్ర, ఆకుల లక్ష్మయ్య, బొమ్మగాని శ్రీకాంత్, మాచర్ల నరసయ్య, కక్కిరేణి వీరయ్య, ఈశ్వర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుడిసె వాసుల దాహార్తి తీర్చాలి

- ఎండీఓ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలోగల రాజీవ్ నగర్ శివారు సున్నం రాజయ్య నగర్, దేవులపల్లి యాకయ్య నగర్ లలో గుడిసె వాసుల దాహార్తి తీర్చాలని మంగళవారం ఎండీఓ ఆఫీసు ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చీమల నాగరత్నమ్మ, ఎండీఓలకు వినతి పత్రాన్ని సమర్పించారు. స్పందించారు. ఎంపీపీ, ఎండీఓ పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు దరావత్ రాందాస్ అధ్యక్షన జరిగిన సభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఇందిరమ్మ సొంతింటి పథకం గుడిసె వాసులకు వర్తింప జేయాలని, త్రాగు నీరు, ఇంటి నంబర్, విద్యుత్, మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో మద్దెల వీరాస్వామి, వీరభద్రం, వెంకన్న, రాజు, ఆనంద్, నర్సయ్య కోటమ్మ, సుజాత, నీలారాణి, సంతోష, కౌసల్య, రజియా బేగం, హబీబున్నిసా, పద్మ, రేష్మ మంగ, రమాదేవి, రవళి, కమల, అబ్జల్ బీ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ డీఏ బిల్లులు సకాలంలో చెల్లించాలి

- టీఎస్ యుటీఎఫ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పీఆర్సీ డీఏ బిల్లులు సకాలంలో చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ పక్షాన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణకి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం త్వరలోనే బిల్లులను సబ్మిట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్ఎస్ఎం జెడ్పిహెచ్ఎస్ కొర్రాజులగుట్ట కాంప్లెక్స్ పరిధిలో గల సిపిఎస్ ఉద్యోగుల పీఆర్సీ, డీఏ ఏరియల్ బిల్లులు ఎస్టీఓలో సమర్పించుటలో జరిగిన జాప్యానికి గల కారణాలు తెలియజేయాలని, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్నందున సత్వరమే ఆయా బిల్లులను ఎస్టీఓలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, మండల అధ్యక్షులు జె.శ్రీను, కాంప్లెక్స్ కన్వీనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎండిఓ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు తగు సమాచారంతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

పట్టాలిచ్చిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు

నవతెలంగాణ-పెనుబల్లి



గత ప్రభుత్వం గృహలక్ష్మి పేరట పట్టాలిచ్చి మోసం చేసిందని, ఇప్పుడు వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళ వారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతి రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం సెప్టెంబర్‌లో గృహలక్ష్మి పేరట పేద ప్రజలకు పట్టాలిచ్చి ఇంటి నిర్మాణం చేసుకోమని చెప్పిందన్నారు. పనులు పునాది లెవలకు తీసుకువచ్చారని, కానీ ఇప్పటి ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేయడంతో పేద ప్రజల బెంబేలెత్తుతున్నారని, గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టినటువంటి ఇండ్లకు తక్షణమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, 5 లక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం మరో 10 లక్షలు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి తక్షణమే స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండే సత్యం, తోట ప్రసాద్, సమ్మెట నాగేశ్వరరావు, సంబారు రామారావు, గోసు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సారపాక సబ్ స్టేషన్లలో లైన్‌మెన్ దివాస్ కార్యక్రమం

నవ తెలంగాణ -బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్లో లైన్మెన్ దివాస్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు స్టాఫ్ ట్రాన్స్కో ఏఈ గుర్రం ఉపేందర్ ఈ కార్యక్రమం - నిర్వహించారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి సిబ్బంది వరకు నిత్యం కరెంటు సరఫరాలో పగలూ, రాత్రి తేడా లేకుండా విద్యుత్ అంతరా యం తలెత్తకుండా విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా లైన్ ఇన్ స్పెక్టర్ శంకర్, ఎస్-ఎల్ఎ కోటేశ్వరరావు, లైన్మెన్ వెంకట్రావు, జేఎల్ఎం శ్రీనివాసరావులను శాలువాతో సత్కరించి అనంతరం సిబ్బందికి భద్రత, విధులపై వివరిస్తూ విధులపట్ల నిర్లక్ష్యం వహించవద్దని విద్యుత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నీలాద్రీశ్వరుని ఆలయంలో రుద్రాక్షలతో ప్రత్యేక పూజ

నవతెలంగాణ-పెనుబల్లి

భవనపాలెం అటవీ ప్రాంతంలో నీలాద్రీశ్వరుని ఆలయంలో ఈ ఏడాది రుద్రాక్షలతో ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తులను ఆకట్టుకోనుంది. తిరుపతికి చెందిన ఆస్ట్రామాలజిస్ట్ విజయ్ కుమార్ గురూజీ పర్యవేక్షణలో, రామకృష్ణ చిన్ని ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. నేపాల్ నుండి సేకరించిన 2,27,000 రుద్రాక్షలతో శివలింగాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి నీలాద్రి తిరునాళ్లకు తరలివచ్చి భక్తుల దర్శనార్థం కన్నుల పండుగ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. తిరుపతి కుప్పంతో పాటు అనేక ప్రాంతాల్లో రుద్రాక్ష శివలింగాలను భక్తులకు దర్శనార్థం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



జ్యోతిబా పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


- మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-మధిర

మహాత్మ జ్యోతిబా పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి తరం మహిళా ఉపాధ్యాయులు స్త్రీ అభివృద్ధి కోసం సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత ఏర్పడుతుందని వారి స్ఫూర్తితో ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎం.లత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎస్ యుటిఎఫ్ మధిర డివిజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ఏర్పాటు చేసింది. క్రీడా పోటీల అనంతరం జిల్లా సబ్ కమిటీ సభ్యులు యం.కస్తూరిబాయి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా సదస్సుకు ఆమె ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక స్పృహ కలిగిన యుటీఎఫ్ మహిళలకు క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, మధిర ఎర్రుపాలెం మండలాల అధ్యక్షులు ఏ వినోద్ రావు, బి నాగరాజు, ఉపాధ్యక్షులు ఎస్కే ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి ఈ వీరయ్య కోశాధికారి బి చెన్నయ్య, కార్యదర్శి డి భాస్కరరావు, మహిళా కార్యదర్శిలు జిబిఎంఎస్ రాణి, కళావతి, ప్రాంతీయ కార్యాలయం కోశాధికారి డి.భీమశంకర్ రావు, సీనియర్ నాయకులు టీఎస్ యుటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి తాళ్లూరి ఆంజనేయులు మరియు మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజిలెన్సు అండ్ ఏపీటీఎస్
సీఐగా బాధ్యతలు స్వీకరించిన వినోద్

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం విజిలెన్స్ అండ్ ఏపిటిఎస్ పోలీస్ స్టేషన్ సీఐగా కె.వినోద్ బాధ్యతలు స్వీకరించారు. 2004 సంవత్సరంలో ఎస్ఐగా ఉద్యోగం పొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అశ్వారావుపేట, ఏన్కూరు, బూర్గంపాడు, ఖమ్మం 2 టౌన్ లో సిఐగా, భద్రాచలం టౌన్, ఖమ్మం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా ముధోల్ సీఐగా పనిచేసి ఖమ్మం విజిలెన్స్ అండ్ ఏపిటిఎస్ పోలీస్ స్టేషన్‌కి డెప్యూటేషన్ పై వచ్చారు. వీరి పరిధిలో ఖమ్మం , కొత్తగూడెం జిల్లాలు వస్తాయి.

నవజాత శిశువు మృతిపై పలు అనుమానాలు

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి నవజాత శిశువు మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. కానీ , తల్లి గర్భంలోనా? కాన్పు జరిగాక నవజాత శిశువు మృతి చెందాడా అనే విషయం తెలియాల్సి ఉంది. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామం గుత్తికోయ గుంపుకు చెందిన ఆడెమ్మ అనే పూర్తి నెలలు నిండని (8నెలలు) గర్భిణికి సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో అడెమ్మ మగ శిశువుకు జన్మనిచ్చిందని, ఆ కొద్ది క్షణాల్లోనే పుట్టిన నవజాత శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే విషయమై ఆసుపత్రి వైద్యాధికారిని వివరణ కోరగా.. గర్భిణీకి గర్భం దాల్చిన సమయం నుంచి తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నప్పటికీ, అలా పాటించకపోవడంతోనే శిశువు తల్లి గర్భంలోనే మృతి చెంది జన్మించినట్లు వైద్యులు చెప్పారు.

7న ఖమ్మంలో కేసిఆర్‌కు కృతజ్ఞత సభ

నవతెలంగాణ-ఖమ్మం

బీఆర్ఎస్ పార్టీ నుండి రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్రను రెండోసారి ఎంపిక చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఖమ్మం నగరంలో భారీ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్టు బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ తెలిపారు. బైపాస్ రోడ్ లోని గాయత్రి గ్రౌండ్స్ లో 7వ తేదీ సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో మాజీ మంత్రి తెలంగాణ ఉద్యమ నాయకుడు హరీష్ రావుతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. సభకు జిల్లా నలుమూలల నుండి హాజరయ్యే బీఆర్ఎస్ కార్యకర్తలకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చూడాలని నిర్వాహకులకు సూచించారు. సభా ప్రాంగణంలో స్టేజి మైక్ కుర్చీలు తదితర ఏర్పాట్లపై కూడా సమీక్షించారు. ఖమ్మం జిల్లా నుంచి బీసీ నేతగా ఎదిగిన వద్దిరాజు రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ అవకాశం దక్కడం బీఆర్ఎస్ కార్యకర్తల శ్రమకు తగ్గ ఫలితం అని.. ఇదే ఉత్సాహంతో రేపటి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపుకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలనీ సూచించారు. సభాస్థలిని పరిశీలించిన వారిలో తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, పైడిపల్లి సత్యనారాయణ, డోగుపర్తి సుబ్బారావు, బిచ్చాల తిరుమలరావు, కాసాని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గ్యారెంటీ పథకాల

- లబ్ధి చేకూరేలా చర్యలు
- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా
- ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా
- గ్యారెంటీ పథకాల డాక్యుమెంట్ సేకరణ

నవ తెలంగాణ-పాల్వంచ

అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ హెడ్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదుపై జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా డిఆర్‌డిఎ పిడి విద్యా చందన, జడ్పీ సీఈఓ ప్రసూన రాణితో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రజాపాలన సాఫ్ట్ వేర్ ద్వారా లబ్దిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లాలోని ఎంపీడీవోలు ఎంపీలతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదేవిధంగా మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం క్రింద క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేశామని, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. గృహజ్యోతి క్రింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తు దారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సమర్పించవచ్చని ఆమె తెలిపారు. ప్రజలు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్ కార్డు/తెల్ల రేషన్ కార్డు వివరాల ద్వారా ప్రజా పాలన దరఖాస్తును గుర్తించాలని, అనంతరం తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్/విద్యుత్ మీటర్ నెంబర్ మ్యాచ్ ఐతే సదరు లబ్ధిదారులను గ్యారంటీ పథకాల క్రింద ఎంపిక చేసామని, వివరాలు మ్యాచ్ కాని పక్షంలో మరోసారి సరైన వివరాలు నమోదు చేయాలని అన్నారు. తెల్ల రేషన్ కార్డు వివరాలను ముందుగా వ్యాలిడేట్ చేయాలని, ముందస్తుగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారునిగా గుర్తించిన తర్వాత సదరు దరఖాస్తుదారులు అందించే గ్యాస్ కనెక్షన్ నెంబర్ వివరాలు, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు వ్యాలిడేట్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి విద్యా చందన, జెడ్పీ సిఈఓ.- ప్రసూన రాణి ఎం.పి.డి.ఓలు, మునిసిపల్ కమిషనర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాలను అమెరికా సమర్థిస్తుంది

- సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర నాయకులు సంజయ్ సింగ్వి

నవతెలంగాణ-ఖమ్మం

కమ్యూనిస్టు విప్లవ శక్తులు వ్యక్తులను అఖిలభారత యునైటెడ్ పార్టీగా ఏకం చేయాలని, నేటి పరిస్థితి మాస్ ఆర్గనైజేషన్ స్థాయిలో ముఖ్యంగా యూనియన్ ఐక్యతను కోరుతుందని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర నాయకులు సంజయ్ సింగ్వి పిలుపునిచ్చారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో కామ్రేడ్ డీవీ కృష్ణ, సంతోష్, రానా నగర్లో జరుగుతున్న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదం నాటి కూటమి ద్వారా చైనా పైన దూకుడుగా వ్యవహరిస్తుందని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాలను అమెరికా సమర్థిస్తుందని, ప్రపంచ దేశాలు ఈ దుర్మార్గపుమారణకాండలను వ్యతిరేకిస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ప్రజలు నేడు చాలా ప్రమాదకరమైన కాలంలో జీవిస్తున్నారని, తాజాగా పాలస్తీనా, ఉక్రెయిన్ ప్రజల పైన జరిగిన దారుణ మారణకాండ కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల ప్రధాన కర్తవ్యం ఆర్ఎస్ఎస్ ఫాసిజాన్ని సిద్ధాంత, రాజకీయ నిర్మాణపరంగా ఓడించాలని ఆల్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ (అఖిలభారత కమిటీ పార్టీ) అత్యవసరమైనదని ఆయన పిలుపునిచ్చారు. మూడు విప్లవ పార్టీల కమ్యూనిస్టు సంస్థల విలీనం అనేది మొదటి అడుగని ఈ ఐక్యత కార్యక్రమాలు సుదీర్ఘంగా కొనసాగాలని(లాంగ్ మార్చ్) ఆయన ఆకాంక్షించారు. పార్టీ నిబంధన అనే అంశంపై సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, మాస్ లైన్ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు పోటు రంగారావు మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వం ఎక్కడైతే కొనసాగుతుందో అక్కడ రెండింటిని వ్యతిరేకించడం కూడా ముఖ్య కర్తవ్యం అని ఆయన అన్నారు. దేశంలో అధిక ధరలు వ్యవసాయ పెట్టుబడులలో తక్కువ రాబడులు కారణంగా రైతులు ఆర్థికంగా వెనక పడుతున్నారని ఆయన అన్నారు. ఈ దుస్థితికి కారణం నయాఉదార వాద విధానాలని ఆయన అన్నారు. మోడీ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్లో మహిళల అభివృద్ధికి ఏమాత్రం నిధులు కేటాయించకపోవడం, భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిరుద్యోగం, మనదేశంలో ఇప్పుడు ఉన్న నిరుద్యోగ ఉపాధి కొరత సంక్షోభాన్ని చూసినప్పుడు యువతలో ఒక వర్గానికి సులభంగా రుణాలు అందించాలని, మోడీ ప్రభుత్వ వ్యూహంఒక జోకులాగా అనిపిస్తుందని ఆయన అన్నారు. ఈ మహాసభలలో అధ్యక్షవర్గంగా కేజీ రామచంద్ర, కె.రమ, దినేష్ గోహైన్, ధ్రువ, రిషి వ్యవహరించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ప్రదీప్ సింగ్, ఠాగూర్, కెచ్చెల రంగయ్య, దేవవ్రత శర్మ, ఉమాకాంత్ వ్యవహరించారు. వివిధ రాష్ట్రాల నుండి హాజరైన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఇతర కళా సంస్థల బృందాలు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు హిందూ మతోన్మాద ఫాసిజం, కులతత్వం, దోపిడీపై, మహిళలు నిరుద్యోగ సమస్య వ్యవసాయ రంగ సమస్యపై పాడిన పాటలు సభికులను అలరింపజేశారు.



మహ-బాద్ ఎంపీ సీటును ఆదివాసీలకే కేటాయించాలి

నవతెలంగాణ -దుమ్ముగూడెం

త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ అభ్యర్థులకే కేటాయించాలని జాతీయ ఆదివాసీ సంఘాల అఖిలపక్ష నాయకులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జాతీయ ఆదివాసి సంఘాల జేఏసీ పిలుపు మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని చెరు పల్లి, కొత్తపల్లి, కోయ నర్సాపురం, మారాయి గూడెం, భీమవరం, పెదార్ల గూడెం, లచ్చిగూడెం, చిన్నార్లగూడెం కాటాయగూడెం గ్రామాలలో పర్యటించి కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన పదేళ్ల కాలంలో మహబూబాబాద్ పార్లమెంటు సీటును అని రాజకీయ పార్టీలు వలస లంబాడీ సామాజిక వర్గానికి కట్టబెడుతున్నారే తప్ప నిజమైన ఆదివాసీలకు ఇవ్వకుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. భద్రాచలం నియోజకవర్గం వర్గ పరిధిలో గల ఆదివాసీ గ్రామాలను సందర్శిస్తూ చైతన్యం చేస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో వలస లంబాడి సామాజిక వర్గానికి సీటు కేటాయిస్తే వారిని ఓడిస్తామన్నారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు పునరాలోచన చేసి ఆదివాసీల ఓటు బ్యాంకు ఎక్కువ ఉన్నందున తెలంగాణాలో ఆదివాసీలకు ముందు ప్రాధాన్యత ఇచ్చి వారికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలలో సామాజిక న్యాయం కొరవడిందని రాజ్యాంగ బద్ధమైన ఆదివాసీలకు ఎస్టి రిజర్వుడు స్థానాల్లో ఇవ్వకుండా డి నోటిఫైడ్ కింద వచ్చిన వలసవాదులకు టికెట్ కేటాయించడంలో పార్టీలు వైఖరి ఏమిటని ప్రశ్నించారు. లంబాడీలకు సీటు ఇస్తే మాత్రం ఓడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ సంఘాల ప్రతినిధులు కోడి చంటి, కాటేబోయిన సాయి, శ్యామల వెంకటేష్ కొర్స జగదీష్, పెనుబల్లి వెంకటేష్ సోందే చిన్నక్క.తదితరులు పాల్గొన్నారు.

మిర్చి మార్కెట్లో మధ్య దళారీ దోపిడీని అరికట్టాలి

- ఖమ్మంలో మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-ఖమ్మం



మిర్చి మార్కెట్లో మధ్య దళారీ దోపిడీని అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాన్ని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిందని, జిల్లాలో రైతులు తిరగబడితే బేడీలు వేసి జైలుకు పంపిన చరిత్ర గత ప్రభుత్వానికి ఉన్నదని, అదే తరహాలో కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేక కార్యక్రమాల చేయవద్దని, రైతులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ నాయకులు అవునూరి మధు మాట్లాడుతూ అఖిల భారత స్థాయిలో రైతాంగ ఉద్యమాలు ఒకపక్క జరుగుతా ఉన్నాయని, ఎంఎస్పీ చట్టం తేవాలని రైతాంగానికి మద్దతు ధర కనీసం క్వింటాకు రూ.30 వేలు నిర్ణయించాలని అన్నారు. అఖిలభారత రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు డేవిడ్ కుమార్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాల్లో రైతులు పండించిన పంటను ఖమ్మం మార్కెట్లోకి తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. మార్కెట్లో ఉన్న వ్యాపారులు రైతులను నిలువునా దోపిడీ చేస్తూ మార్కెట్ మాయాజాలంతో రైతులు విలవిల కొట్టుకుంటున్నారు. క్వింటా మిర్చికి జెండా పాట 22 వేలు పాడితే అలా కొనకుండా దాన్ని 14 నుండి 16 వేల రూపాయలకు ఖరీదు చేస్తున్నారని, రైతులు అడిగితే వారి అతి తెలివిని చూపి రైతులను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూరి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బద్దూరి వెంకట రామిరెడ్డి, వై.ప్రకాష్, ప్రజల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, జిల్లా కార్యదర్శి వై జానకి, జిల్లా నాయకులు ఐ వెంకన్న, జి.రమేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమో ఖమ్మం నగర కార్యదర్శి పాముల మోహన్ రావు పాల్గొన్నారు.

వైభవంగా షిరిడీ పుష్కర ద్వారక
సాయిబాబా సప్తమ వార్షికోత్సవం

నవతెలంగాణ -బూర్గంపాడు

మండల పరిధిలోని సారపాకలో కొలువైన షిరిడీ పుష్కర ద్వారక సాయిబాబా మందిరంలో సప్తమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో సాయినాధుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 9 గంటలకు శ్రీలక్ష్మిగణపతి, దుర్గామాత, కుబేర హెూమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేయగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సాయిబాబాను గ్రామ పురవీధుల్లో నృత్యాలు, కోలాటాల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

జక్కుల నరసింహారావుకు నివాళి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని పాపకొల్లు గ్రామపంచాయతీ, పుట్టకోట గ్రామానికి చెందిన జక్కుల నరసింహారావు పాల్వంచ పట్టణ పరిధిలోని జగన్నాధపురం గ్రామ శివారు తొక్కుగూడెం వద్ద ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ కు గురై మరణించగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు జక్కుల నరసింహారావు స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ధర్మరాజుల వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల నరసింహారావు, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కోదుమూరి కోటేశ్వరరావు, టీపిసిసి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, మండల నాయకులు ముల్లపాటి అప్పారావు, బానోత్ మంగ్యా, నేర్పుల సంగయ్య, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తాళ్లూరి అఖిల్, తాళ్లూరి సాయి, స్వర్ణ శాసయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



- మంత్రులు తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు అన్నారు. మంగళవారం గ్రామీణ వైద్యుల సహాయక సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా 23వ మహాసభ ఎస్ఆర్ కన్వెన్షన్ లో జిల్లా అధ్యక్షుడు బాలబోయిన వెంకటేశ్వర్లు(బీవీఆర్) అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించకుండా 10 సంవత్సరాలు తాత్సారం చేసిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అర్హులైన గ్రామీణ వైద్యులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లను, గుర్తింపు కార్డులను అందించిందన్నారు. అదే తరహాలో మీకు శిక్షణను ప్రభుత్వం తరుపున ఇప్పించేందుకు కృషిచేస్తామన్నారు. మంత్రి తుమ్మల వేదికపై నుండి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కమిషనర్ లతో మాట్లాడి సమస్యను వారికి వివరించారు. వారు కూడా సానుకూలంగా స్పందించారు. మీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు హైదరాబాద్ వస్తే ఆరోగ్య శాఖ మంత్రి వద్దకు తీసుకువెళ్ళి మీ సమస్యలను వివరిస్తానని మంత్రులు తెలిపారు. స్వర్ణ భాస్కర్ మాట్లాడుతూ నేటి సమాజంలో గ్రామీణ వైద్యుల పాత్ర చాలా గొప్పదని అన్నారు. ఈ మహాసభలో ప్రధాన కార్యదర్శి వీరాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న, ఎం శ్రీనివాసరావు, ఏ అమతరావు, ఎం వెంకటేశ్వర్లు, సోమశేఖర్, ఓమ్మి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూలింగ్ వన్ టీవి న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజలకు ప్రభుత్వానికి వారధి లాగా మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ఆ దిశగా వార్తాప్రసారాలు ఉండాలని, ఇటు ప్రభుత్వంతో, ప్రజలతో మీడియా మన్ననాలు పొందాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార, పౌర సంబంధాల శాఖ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రూలింగ్ వన్ టివి న్యూస్ క్యాలెండర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి ఆరు గ్యారెంటీల పథకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేబుతూ.. పథకాలు అమలు జరుగుతున్న తీరు తెన్నులు , పథకాలు అర్హులకు అందేవిధంగా రూలింగ్ వన్ టీవి న్యూస్ వార్తా ప్రసారాలు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూలింగ్ వన్ టీవీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్, అండ్ స్టేట్ బ్యూరో ఇన్ చార్జ్, టీ యూ డబ్ల్యు జే (టీజేఎఫ్) ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం జిల్లా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.కె. జానిపాషా, మౌలానా, ఆబిద్, గౌస్, అహ్మద్, జాఫర్, సమీర్ అన్వర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రెవెన్యూ డివిజన్
అధికారిగా కొల్లు దామోదర్ రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొల్లు దామోదర్ రావు మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్‌ను తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా పిఓ ఆర్డీవోను అభినందిస్తూ గిరిజన గ్రామాలలో రెవెన్యూ కు సంబంధించిన ఏమైనా భూ సమస్యలు గానీ గిరిజనుల భూ సమస్యలు ఏమైనా ఉంటే గిరిజనులకు ఇబ్బందులు కలగకుండా తప్పనిసరిగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆర్డీఓకు సూచించారు.

భద్రాచలం వాసికి డాక్టరేట్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ గుజ్జు పుల్లదాస్ తనయుడు గుజ్జు శివకృష్ణకి సాటిలైట్ ఇమేజ్నరీ ఎనాలసిస్ రంగంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చెన్నైలోని బి.ఎస్. అబ్దుర్ రెహమాన్ క్రెసెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో డైరెక్టర్ జనరల్ సిఎస్ఐఆర్, సెక్రటరీ డిఎస్ఐఆర్ డా. కలై సెల్వి చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల సంగతేంటి..!

- మంత్రి ఉత్తమ్ సమీక్ష



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై మంగళవారం సచివాలయం సమీక్ష నిర్వహించారు. దాదాపు అన్ని ప్రాజెక్టులపై రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఇటీవల సాగునీటి పారుదల శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన శాఖపై అవగాహన కోసం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇరిగేషన్ శాఖకు చెందిన ఉన్నతాధికారులందరూ ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సమీక్ష జరుగుతుందని తెలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం సమీక్షకు వచ్చారు. కొద్దిసేపు అధకారులతో ఆయా విషయాలపై మాట్లాడారు. వెంట ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సైతం ఉన్నారు. మంత్రి వెళ్లిపోయాక ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ సమీక్షను కొనసాగించారు. శాఖను అధ్యయనం చేయడం కోసమే సమీక్ష జరిగిందని, ఇందులో ఎలాంటి నిర్ణయాలు జరగలేదని సమాచారం.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీపీడీపీఎంఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీడీపీఎంఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం అధ్యక్షులు బి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ, నాయకులు రమణారెడ్డి, టి శ్రీధర్‌రావు, ఎ పరమేశ్వర్ కలిసి వినతిపత్రం సమర్పించారు.

డిగ్రీ కాలేజీల్లో బీబీఏ, బీసీఏ కోర్సుల అనుమతి నిర్వహణ బాధ్యతను విశ్వవిద్యాలయాల పరిధి నుంచి తప్పించి ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకెళ్లె ప్రయత్నం వెంటనే అడ్డుకోవాలని కోరారు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసిన దోస్త్ విధానాన్ని ప్రక్షాళన చేయాలని సూచించారు. ఇంటర్ తరహాలోనే కాలేజీ యాజమాన్యాలు సొంతంగా అడ్మిషన్లు చేపట్టి విశ్వవిద్యాలయాల వెబ్‌సైట్‌లో పెట్టేలా నిబంధనలను రూపొందించాలని కోరారు. అడ్మిషన్ల విషయంలో స్వయం ప్రతిపత్తి గల వర్సిటీల నియంత్రణ మాత్రమే ఉండాలని తెలిపారు.

రెండేండ్లకు ఒకసారి ఫీజులను సవరించాలని పేర్కొన్నారు. సొంత భవనాలు కలిగిన కాలేజీలకు శాశ్వత అనుబంధ గుర్తింపు ఇవ్వాలని సూచించారు. పదేండ్లు పూర్తి చేసుకున్న కాలేజీలకు ఐదేండ్లకోసారి అనుబంధ గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీల్లో బడ్జెట్ విద్యాసంస్థలకు వేరే కేటగిరీ ఏర్పాటు చేసి రాయితీ కల్పించాలని తెలిపారు.

30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- పీఆర్సీ కమిటీకి టాప్ర ప్రతిపాదన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పెన్షనర్లకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పెన్షన్ నిర్ణయించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ ఎన్ శివశంకర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి నారాయణరెడ్డి, పి కృష్ణమూర్తి కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ని 65 ఏండ్లకు చెల్లించాలని తెలిపారు. ఉద్యోగి చివరి నెల వేతనంలో 2/3వంతు లేదా నెలకు రూ.30 వేలు కనీస పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ అలవెన్స్ నెలకు రూ.ఐదు వేలు చెల్లించాలనీ, స్వంత ఇల్లు లేక కిరాయి ఇంట్లోనే ఉంటున్న వారికి ఇంటి అద్దె అలవెన్స్‌ని ఇవ్వాలని సూచించారు. పండగ అప్పు ఇవ్వాలని పేర్కొన్నారు. గత వేతన సవరణ కమిషన్ సూచించిన 20 ఏండ్లకు పూర్తి పెన్షన్ చెల్లించాలని కోరారు. నెలకు రూ.398 వేతనంతో పనిచేసిన కాలానికి స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలిపారు. గ్రాట్యుటీ రూ.30 లక్షలు ఇవ్వాలనీ, 50 శాతం పెన్షన్ కమ్యుటేషన్‌కు అనుమతించాలని సూచించారు. 10 ఏండ్లకే కమ్యుటేషన్‌ని నిలిపేసి పూర్తి పెన్షన్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాప్ర నాయకులు నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, అరుణ, కృష్ణారావు, సీతారాం, అశోక్, స్వరాజ్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉన్నత విద్య అందని ద్రాక్షే...!

కళాశాలలకు దూరమవుతున్న ముస్లిం మైనారిటీలు

సామాజిక, ఆర్థిక పరిస్థితులే కారణం

- కానరాని ప్రభుత్వ మద్దతు
- ఉత్తరాదిలో కంటే దక్షిణాదిలోనే బెటర్



న్యూఢిల్లీ : ముస్లిం మైనారిటీలు క్రమేపీ ఉన్నత విద్యకు దూరమైపోతున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ రాష్ట్రాల్లో ముస్లిం జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ ఉన్నత విద్యా సంస్థల్లో చేరుతున్న వారి సంఖ్య బాగా తక్కువగా ఉంటోంది. 'భారత్‌లో ముస్లింల విద్య' అనే అంశంపై జరిపిన ఓ అధ్యయనం ఈ విషయాన్ని బయటపెట్టింది. 2020-21, 2021-22లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

దక్షిణాది రాష్ట్రాల్లో...

2016-17లో దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 17,39,218 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశం పొందారు. వీరి సంఖ్య 2019-20 నాటికి 21,00,860కి పెరిగింది. అయితే ఆ తర్వాతి సంవత్సరం ఈ సంఖ్య 8.53% తగ్గింది. అంటే 1,79,147 మంది ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్న మాట. 18-23 సంవత్సరాల మధ్య వయసున్న ముస్లిం విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) జాతీయ సగటు 8.41%. వీరిలో పురుషుల (8.44%) కంటే మహిళలే (9.43%) ఎక్కువగా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, తమిళనాడు, తెలంగాణలోనూ, కేంద్ర పాలిత ప్రాంతాల లోనూ ముస్లిం విద్యార్థుల జీఈఆర్ అధికంగా ఉంది. ఇందులో తెలంగాణ 34% జీఈఆర్‌తో అగ్రస్థానంలో ఉండగా 28% జీఈఆర్‌తో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. అక్షరాస్యతకు నిలయమైన కేరళలో 20% ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. కర్నాటక 15.78% జీఈఆర్‌తో నాలుగో స్థానంలో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 10% ముస్లిం విద్యార్థులు మాత్రమే కళాశాలలకు వెళుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ రాష్ట్రంలో 9.56% మంది ముస్లిం జనాభా ఉంది.

దక్షిణాదిలోని కేంద్ర పాలిత ప్రాంతాల విషయానికి వస్తే పాండిచ్చేరిలో 25% మంది ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. లక్షదీవుల జనాభాలో 96% మంది ముస్లింలే అయినప్పటికీ అక్కడ 4% మంది మాత్రమే కళాశాలలకు వెళుతున్నారు.

ఉత్తరాదిలో...

ఉత్తరాదిలోని హిందీ ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఢిల్లీలో సగటున సుమారు 7% మంది ముస్లిం విద్యార్థులు మాత్రమే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఇది 12 శాతం పాయింట్లు తక్కువ. జార్ఖండ్ (15%), ఉత్తరా ఖండ్ (12.48%) రాష్ట్రాలలో మాత్రమే ముస్లిం విద్యార్థులు రెండంకెల సంఖ్యలో కళాశాలలకు వెళుతున్నారు. యూసీసీని అమలు చేస్తున్న తొలి రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో 13%కి పైగా ముస్లిం మహిళా విద్యార్థులు కాలేజీలలో ప్రవేశం పొందారు. హిందీ రాష్ట్రాలన్నింటిలోనూ ఇదే అధికం. ఢిల్లీలో 7. 09%, ఛత్తీస్‌గఢ్‌లో 7%, మధ్య ప్రదేశ్‌లో 6.57%, బీహార్‌లో 6.13%, ఉత్తర ప్రదేశ్ లో 5.43%, రాజ స్థాన్‌లో 5.08%, హర్యానాలో 4.49% ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తు న్నారు.

ఏం చేయాలంటే...

ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. స్కాలర్ షిప్పులు, గ్రాంట్లు, విద్యా రుణాలు అందించడం ద్వారా వారిని ప్రోత్సహించవచ్చు. ఆర్థికపరంగా మరిన్ని ప్రోత్సాహకాలు అందించవచ్చు. గ్రామీణ, వెనుక బడిన ప్రాంతాల్లో మరిన్ని పాఠశాలలు ఏర్పాటు చేసి, విద్యా సౌకర్యాలు మెరుగపరచవచ్చు. అప్పుడే ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్య చేరువవుతుంది.

సామాజిక, ఆర్థిక సూచికల్లో వ్యత్యాసాలే కారణం

దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థుల సామాజిక, ఆర్థిక సూచికల్లో వ్యత్యాసాలు ఉన్నాయని మౌలానా ఆజాద్ నేషనల్ ముస్లిం యూనివర్సిటీ (మనూ) ప్రొఫెసర్ కేఎం జియాయుద్దీన్ చెప్పారు. తలసరి ఆదాయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని తెలిపారు. చాలా కాలం క్రితమే కర్నాటకలో రిజర్వేషన్ విధానం అమలులోకి వచ్చిందని, ఈ విధానం కారణంగా అట్టడుగు వర్గాలు, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని వివరించారు. ఈ రాష్ట్రాలలో పాఠశాలలు, కళాశాలల సంఖ్య కూడా ఎక్కువేనని అన్నారు. విద్యా నాణ్యత, పర్యవేక్షణ సైతం మెరుగ్గానే ఉందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలలో మైనారిటీల పట్ల వివక్ష లేదని, అక్కడ వారు సురక్షితంగా ఉంటారని ఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. అక్కడి సమాజాలలో అంతర్గత కూర్పు సమతూకంగా ఉంటుందని అన్నారు. హిందీ ప్రాంతాల్లో ఉన్నత విద్యా సంస్థల్లో ముస్లిం విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉండడానికి అక్కడ నెలకొన్న రాజకీయ వాతావరణం కూడా కారణమేనని వివరించారు.

ఉన్నత విద్యలో మైనార్టీల నమోదు శాతం

రాష్ట్రాలు	జనాభా (2011 లెక్కల ప్రకారం)	ఉన్నత విద్య మహిళలు	ఉన్నత విద్య పురుషులు	మొత్తం
ఆంధ్రప్రదేశ్	9.556	9.44	10.75	10.12
కర్నాటక	12.919	15.57	15.97	15.78
కేరళ	26.562	25.16	15.8	20.35
తమిళనాడు	5.862	24.66	30.34	27.59
తెలంగాణ	9.556*	33.84	33.27	33.55
పుదుచ్చేరి	6.054	23.83	27.73	25.74
లక్షదీవ్	96.58	7.08	1.78	4.32
బీహార్	16.866	6.39	5.9	6.13
ఉత్తరప్రదేశ్	19.26	6.26	4.7	5.43
మధ్యప్రదేశ్	6.574	6.8	6.35	6.57
హర్యానా	7.027	2.83	5.9	4.49
ఉత్తరాఖండ్	13.948	13.94	11.16	12.48
రాజస్థాన్	9.067	4.64	5.48	5.08
జార్ఖండ్	14.532	5.29	4.94	14.532
ఢిల్లీ	12.859	6.49	7.65	7.09
ఛత్తీస్‌గఢ్	2.016	8.07	5.95	7
దేశవ్యాప్తంగా(మైనార్టీలు) 2021-2022	14.225	9.43	8.44	8.91
దేశవ్యాప్తంగా (అన్ని వర్గాలు) , 2020-21		27.3	27.9	26.7

ఇవీ కారణాలే

కళాశాలల్లో ముస్లిం విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉండడానికి మరికొన్ని కారణాలు కన్పిస్తున్నాయి. వారికి బ్యాంకుల నుండి మద్దతు తక్కువగా ఉంటుంది. రుణాలు లభించవు. ఆదాయాలు తక్కువగా ఉండడం, ఆస్తులు లేకపోవడం, మనుగడ కోసం తాపత్రయ పడాల్సి రావడం వల్ల ఉన్నత విద్యలో ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు ముస్లిం మైనారిటీల కోసం పథకాలనైతే ఆర్భాటంగా ప్రకటిస్తాయి కానీ వాటి అమలుపై దృష్టి సారించడం లేదు. ప్రైవేటు విద్యా సంస్థల్లో తమ పిల్లల్ని చేర్చే ఆర్థిక స్తోమత మైనారిటీలకు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం లభించకపోతే చదువుకు స్వస్తి చెప్పాల్సిందే.

ఆంధ్రప్రదేశ్‌లో సెకండరీ విద్య తర్వాత ముస్లిం విద్యార్థుల్లో ఎక్కువ మంది చదువుకు గుడ్‌బై చెబుతున్నారు. కర్నాటక, కేరళ రాష్ట్రాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బీహార్, జార్ఖండ్‌లో 20%కి పైగా డ్రాపవుట్లు నమోదవుతున్నాయి. రాజస్థాన్, హర్యానా, యూపీలో కూడా పరిస్థితి దాదాపు అలాగే ఉంది. పులి మీద పుట్రలా 2022-23 నుండి మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను రద్దు చేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది.

కేసీఆర్ మాయమాటలతో మోసపోయి గోసపడ్డాం..

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ గల్లంతు : రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-మరిపెడ

పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ మాయ మాటలతో మోసపోయి గోసపడ్డామని, రాష్ట్రంలో మార్పు రావాలని ప్రజల కోరిక మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డోర్నకల్ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఏ నమ్మకంతోనైతే కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకొచ్చారో.. అదే నమ్మకాన్ని వమ్ము చేయకుండా అతి తక్కువ కాలంలో 6 గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 48 గంటలు దాటకముందే మహిళలకు అభయ హస్తం కల్పిస్తూ.. ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల పరిమితితో ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చినట్టు చెప్పారు. 90 రోజుల్లో మహిళలకు రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమల్లోకి తీసుకొచ్చినట్టు స్పష్టం చేశారు. డోర్నకల్,మహబూబాబాద్ నియోజక వర్గాలు నాకు రెండు కండ్లు లాంటి వారని తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపు నిచ్చారు.

డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలకు పదవులు లేని ఈ మూడు నెలలకే విలవిలాడుతున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్ అన్నారు. ఓడిపోయిన బీఆర్ఎస్ నేతలు దొడ్డిదారిన కాంగ్రెస్‌లోకి రావాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎంపీ కవిత గత్యంతరం లేక మళ్ళీ బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేసి బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు రాకుండా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు లూనావత్ రాధా బాయి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికోమ్ము యుగంధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి నాయక్, పట్టణాధ్యక్షులు తాజుద్దీన్, నాయకులు గంధసిరి అంబరీష్, శ్రీ రంగారెడ్డి పాల్గొన్నారు.



పాటియాలా: 'ఢిల్లీ చలో' నిరసనలో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలో మహిళా రైతులు



నేతన్నల బతుకులు మార్చండి..

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ప్లకార్డులతో నిరసన
- నేడు చేనేత జౌళి శాఖ ఆఫీస్ ఎదుట ధర్నాకు పిలుపు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

'అయ్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా నేతన్నల బతుకులు మార్చండి' అంటూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఇతర అనుబంధ రంగాల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు ప్లకార్డులు పట్టుకుని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. గురువారం సిరిసిల్ల పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమంలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై ఆధారపడి పనిచేస్తున్న వారందరికీ నిరంతరం ఉపాధి కల్పించే విధంగా బతుకమ్మ చీరలు, ప్రభుత్వానికి అవసరం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల వస్త్రాలన్నింటికీ ఆర్డర్ ఇవ్వాలని కోరారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా అన్ని రంగాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించాలని కోరారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

కొన్ని నెలల నుంచి సిరిసిల్లలో పవర్‌లూమ్స్ బంద్ అవ్వడంతో వేలాదిమంది కార్మికులు, ఆసాములు ఉపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించు కోవ డంలో భాగంగా బుధవారం సీఐటీయూ, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ ఆఫీస్ ముందు ఉదయం 10 గంటలకు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ధర్నాకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని రంగాల కార్మికులు, ఆసాములు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, ఒగ్గు గణేష్, మచ్చ వేణు, సురేష్, రవీందర్, సత్యం, వెంకటేశం, రాజు, ప్రవీణ్, సత్యనారాయణ, ప్రభాకర్, శ్యామ్, భాస్కర్ పాల్గొన్నారు.

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన

- నాణ్యత లేని భోజనం పెడుతున్నారంటూ ఆవేదన
- హాస్టల్ ఎదుట రోడ్డుపై బైటాయింపు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నాణ్యత లేని భోజనం పెడుతున్నారంటూ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. హాస్టల్ ఎదుట రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. దాంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కాగా, విద్యార్థులకు పోలీసులు నచ్చ జెప్పారు. అయినప్పటికీ వినకపోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా నిజాం కళాశాల హాస్టల్ లో తమకు నాణ్యత లేని అన్నం, కూరలు పెడుతు న్నారని తెలిపారు. తాము అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందువల్లే ఆందోళనకు దిగినట్టు విద్యార్థులు వెల్లడించారు.

ఫుట్‌బోర్డు ప్రయాణం.. బస్సు టైర్ల కింద పడి మహిళ మృతి

నవతెలంగాణ - వనపర్తి రూరల్

బస్సు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్న మహిళ ప్రమాదవశాత్తు కింద పడి మహిళ మృతిచెందింది. ఈ ఘటన వనపర్తిలో జరిగింది. ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తిలోని ఇందిరా కాలనీకి చెందిన గోవిందమ్మ(50) ఏదుట్ల గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఫుట్‌బోర్డుపై నిలబడటంతో ప్రమాదవశత్తు కిందపడింది. దీంతో కాళ్లపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ మేరకే కేసు దర్యాప్తులో ఉంది.

మహిళలకు అండగా భరోసా కేంద్రాలు

రాచకొండ సీపీ తరుణ్ జోషి

- శాంతి భద్రతల చర్యలపై సమీక్ష
- ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచన



నవతెలంగాణ- నాగోల్/హయత్‌నగర్

మహిళలకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయనిరాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి సీపీ మంగళవారం ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ పోలీస్ స్టేషన్, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్, సీడీఈడబ్ల్యూ భరోసా కేంద్రాలను సందర్శించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీ టీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు.

అనంతరం అధికారులతో సీపీ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని, ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే విధంగా వాతావరణం ఉండాలని తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ మాట్లాడుతూ ..త్వరలోనే కేంద్ర ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక శక్తుల గురించి ఎప్పటికప్పుడూ సమాచారం సేకరించాలని ఆదేశించారు. భరోసా కేంద్రాల ద్వారా మహిళా సంరక్షణకు, భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు స్వయంగా రాలేని బాధితులు రాచకొండ కంట్రోల్ రూమ్ వాట్సప్ నెంబర్ 8712662111 కుగానీ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందించి సత్వర న్యాయం చేకూరుస్తామని కమిషనర్ తెలిపారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	64,850	▲	760
22 క్యారెట్లు	59,450	▲	700
కిలో వెండి	78,200	▲	1200



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	126
రిటైల్ (లైవ్)	రూ.	148
స్కిన్‌తో	రూ.	215
స్కిన్‌లెస్	రూ.	244





దేవతలుగా పూజించక్కర్లేదు. ఆడపిల్లల్ని వారి తీరున వారిని బతకనిచ్చే మనిషితత్వం ఉంటే చాలు. మహిళలపై ద్వేషాన్ని, తమ అహంకారపు విషపు గొట్టాలతో వెదజల్లి, సమాజాన్ని దుర్గంధంతో నింపి వేయడమే మన సంస్కృతా? అదే మన సంప్రదాయమా? అని అందరం ప్రశ్నించుకోవాలి. జెండర్తో పని లేకుండా ప్రతి మనిషికి ఈ దేశంలో స్వేచ్ఛగా, స్వతంత్ర నిర్ణయాలతో జీవించే హక్కుంది. ఆడవాళ్లకి స్వతంత్రం ఎందుకు? అన్న భావజాలాన్ని ఎక్కువ శాతం జనాభా సమర్థించడం భయాన్ని కలిగిస్తోంది. మహిళలపై నిరంకుశత్వానికి, పైశాచికత్వానికి కట్టుబాట్లు అని పేరు పెట్టే వెకిలి ప్రవృత్తి మారనంత కాలం గళమెత్తిన ప్రతి మహిళ గొంతును నొక్కేయడానికి కోట్ల కొద్దీ పితృస్వామ్యపు విష కోరలు చాపుతూనే ఉంటాయని ఇటీవలి కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

మానవవాద సంప్రదాయం ఎక్కడ?

సంస్కృతి, సంప్రదాయం ముసుగులో మహిళల వ్యక్తిత్వాలని, వారి శరీరాలను ఛిద్రం చేసే వికృత మానవులు పెద్ద సంఖ్యలో మందలు మందలుగా, మోరల్ పోలీసింగ్ రాక్షసులుగా రూపుదిద్దుకుంటున్నారు. సమాజం ఇటువంటి చీడ పీడలతో నిండిపోతోంది. అంతకంతకూ అవి మరింత విస్తృతంగా లోతుగా వేళ్లూనుకుంటూ పాతుకుని పోతున్నాయి. కాలం మారుతోంది. ఆడపిల్లలకు చదువులు, అన్నింటా అవకాశాలు లభిస్తాయి. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటారు. భావితరం అమ్మాయిలు మరింతగా తమకు నచ్చినట్టుగా తమ జీవితాలను చక్కదిద్దుకుంటారనే ఆశలు అడియాశలుగానే కనిపిస్తున్నాయి. 2024కి వచ్చినా కూడా ఇంకా ఆడపిల్ల ఉనికి సమాజానికి కంటకంగానే ఉంది.

నగ్నత్వమే కనిపిస్తుంది

అమ్మాయి పుడితే బంగారు తల్లి పుట్టిందని మురిసిపోయే తల్లిదండ్రులారా! బహు పరాక్! ఆడపిల్లను కేవలం లైంగిక వస్తువుగా చూసి బూతులతో విరుచుకుపడే గొప్ప సమాజం మనది. ఇంకా ఎన్ని దశాబ్దాలు ముందుకెళ్లినా ఇటువంటి భావజాలం ఒక తరానికి ఇంకో తరం అందిపుచ్చుకుంటోంది తప్ప మారట్లేదు. ఆడపిల్లలకు సొంత అభిప్రాయాలు ఉండకూడదు. నచ్చిన బట్టలు వేసుకోకూడదు. వాళ్ల కాళ్లు, వేళ్లని వెర్రెక్కినట్టు చూస్తారు. అమ్మాయికి అది తన మనసుకు నచ్చిన ఒక అందమైన డ్రెస్సు మాత్రమే. కాని చూసేవారి కళ్లలో కామం, వెకిలితనం ముద్దలుగా నిండిపోతే ఆమె తన శరీరాన్ని ఎన్ని వస్త్రాల వెనుక దాచినా నగ్నత్వమే కనిపిస్తుంది. బంగారు తల్లికి బంగారు భవిష్యత్తు ఉండాలంటే సంప్రదాయం పేరిట జరిగే తీవ్రవాదాన్ని సమర్థించడం కాదు. వ్యతిరేకించాలి.

సమాజంలో కలుపు మొక్కలు

పాతకాలపు ఆలోచనా ధోరణినే కండ్లు మూసుకుని ముందుకు తీసుకువెళ్లడం కాదు. ఒక అంశంపై ఎలా ఆలోచించాలి, ఎలా స్పందించాలి. జడ్జిమెంటలా ఉండే తీరు మార్చుకోవాలి. దీనికి మానసిక పరిపక్వత ఏర్పడాలి. చిన్నప్పటి నుండి ఇంటి వాతావరణం పిల్లల్లో ఆ దృక్పథాన్ని ఇవ్వగలగాలి. కాని సంప్రదాయపు కుటుంబాలలో తండ్రి ఇంటి యజమాని, తల్లి ఇంటికి బానిస. ఇంట్లో పుట్టిన ఆడపిల్ల ఇంటి పరువు సింబల్. ఆడవారిని తిట్టి, కొట్టగలిగే హక్కు మగవాడికి ఉంటుంది. బాల్యం నుండి నువ్వు మొగోడివిరా అనే అహాన్ని నింపడం. మగవాడిగా పుట్టడం, మగపిల్లలకు జన్మనివ్వడం గొప్ప విషయాలని నమ్మే భావజాలం మధ్య పిల్లలు పెరుగుతారు. అటువంటివారే సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్య రాతలు రాసేది. బూతులతో, తిట్లతో ఈసడింపులతో వారి మనోబలాన్ని ముక్కలు చేసి మళ్లీ వంటింటి వైపుకు పారిపోయేలా వెంట తరుముతుంటారు. ఇటువంటి కలుపు మొక్కలతో సమాజం నిండిపోతోంది. ఇక దాన్ని బాగు చేయడం అసంభవం అయిపోతుంది. సంప్రదాయపు తీవ్రవాద మూకలను తయారు చేసే గట్టి సంకల్పం దేశంలో ఓ అంటు వ్యాధిలా ప్రబలుతోంది.

ఉచ్చులో బంధించి

ఏ విధమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకోకుండా కేవలం పూజలు, వ్రతాలు చేసుకుంటూ అన్నిటికీ ఇంట్లోని మగ వారిపై ఆధారపడుతూ, అమాయకత్వంతో, తెలివి తక్కువగా ఉంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లని ఆడవాళ్లు, భర్త తిట్టినా, కొట్టినా అదే మహా ప్రసాదం అనుకునేవారు, చాలా సంస్కారవంతమైన ఆడవాళ్లు. ఇవి మనుస్మృతి ఆధారిత నీతి సూక్తులు. ఇవి అందిపుచ్చుకున్న మగ జెండర్ గొప్ప అని మహిళ నమ్ముతుంది. జీవితకాలం తండ్రి, సోదరుడు, భర్త స్థానంలో ఉన్న మగవాడి కనుసన్నల్లో బతకడానికి పాకులాడుతుంది. పితృస్వామ్యంలో మహిళలు కూడా భాగస్వాములే. తన జెండర్ తక్కువ కాబట్టి ఇతర మహిళల పట్ల కూడా ఒకరకమైన ఏహ్యత, అస్వీకరణ ఉండటం సర్వ సాధారణం. అటువంటి ఒక నమ్మికే 'ఆడవారికి స్వతంత్రం ఎందుకు? బయటకు ఎందుకు వెళ్లాలి?' వంటి భావజాలాన్ని ప్రకటించడానికి కారణం. మన సమాజం మహిళకు యవ్వనాన్ని, అందాన్ని ప్రామాణికతగా ఏర్పరచింది. వీటిని నిలబెట్టుకుంటేనే ఆమెకు ఉనికి. కాబట్టి ఈ రెండిటి చుట్టూ ఆమె జీవితం పరిభ్రమిస్తూ ఉంటుంది. పితృస్వామ్య సమాజం చాలా తెలివితో ఆడవాళ్లను ఈ ఉచ్చులో బంధించింది. అందరూ ఇదే ఉచ్చులో ఉండాలి. ఎవరైనా అటు ఇటుగా, మనిషిగా తన హక్కుల కోసం గొంతు విప్పుతున్నా, ఈ సంప్రదాయాల సాలె గూడును తప్పించుకుని తమకు నచ్చినట్లుగా ఉండాలనుకున్నా వారిపై మగవాళ్లతో పాటుగా పితృస్వామ్య పోకడలను అవపోసనం పట్టిన ఆడవాళ్లు కూడా రాళ్లు విసరడానికి సిద్ధమవుతున్నారు.

చేతన కలిగి ఉండటమే పరిష్కారం

సంస్కృతి, సంప్రదాయం కేవలం ఆడవారిని చట్రంలో ఇరికించడానికి చేసే పన్నాగం మాత్రమే. సింధూరం, మెట్టెలు ధరించకుండా ఉండే మహిళకు భర్త విడాకులు ఇవ్వొచ్చు అని 2022లో ఒక కోర్టు తీర్పునిచ్చింది. మనుస్మృతి ప్రభావం ఎక్కడైనా ఉంటోంది. చేతన కలిగి ఉండటం ఒక్కటే పరిష్కారం. తన ఇంట్లో, తన సమాజంలో ఏం జరుగుతోంది, వీటిలో ఉన్న మర్మమేంటనే అవగాహన రావాలి. కుమారి, శ్రీమతి, విధవ ఇన్ని రూపాలు తనకు మాత్రమే ఎందుకు? రకరకాల వేషధారణలు ఆపాదించి వ్యక్తిగా తనకంటూ స్థానం లేకుండా చేస్తున్నారని అర్థం కావాలి. ముస్లిం మహిళలు తమకు బురఖా వద్దని ప్రతిఘటించవచ్చు, వేసుకోవచ్చు. వద్దనడానికి మీరెవరని ధిక్కార స్వరం వినిపించవచ్చు. అది పూర్తిగా మహిళ సొంత నిర్ణయం. దాన్ని గౌరవించాలనే కనీస జ్ఞానం కలిగి ఉండటమే మన దేశ సంస్కృతి, సంప్రదాయం కావాలి. అడుగడుగునా రాబందుల్లా మోరల్ పోలీసింగ్ భూతాలు వెంట తరుముతుంటే ఎదురు నిలబడే ఆత్మస్థైర్యం కావాలి. ఎదురు ప్రశ్నించే రౌద్ర స్వరాలు, వందలు, వేలు, లక్షలై ప్రతిధ్వనించాలి. సంప్రదాయపు మంత్రాలు పఠించి ఆడవాళ్లని అణచివేసే మృగాలు తోకముడవాలి.

ఆలోచనా తీరు మారాలి

లైంగిక దాడి, మొలెస్టేషన్. ఇది పూర్తిస్థాయి సెక్సువల్ ఇంటర్ కోర్సు కాకపోవచ్చు. కాని ఆమె శరీరాన్ని తాకడం, ఇవన్నీ చాలా సాధారణ అంశాలు మహిళల జీవితంలో. చిన్నప్పుడు తన పట్ల దగ్గరి చుట్టాలు, ఇంట్లోని సభ్యులు, బయటి వ్యక్తులు తన శరీరాన్ని కామవాంఛతో ముట్టుకున్నారన్న జ్ఞాపకం, గుర్తు, ఆమె మనో ధైర్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. ఆడపిల్లగా పుట్టినందుకు బాధ, తన శరీరంపై తనకే వెగటు వేయక మానదు. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన దగ్గరి చుట్టం గురించి పైకి చెప్తే కుటుంబ పరువు పోతుంది. ఇంట్లో అందరూ కలిసి ఆ మొలెస్టర్ మగ వాడిని కాపాడటంలో ఏకం అవుతారు. సంప్రదాయపు కుటుంబాలలో మగవాళ్లు అలానే ప్రవరిస్తారు. ఆడపిల్లలు నోటి నుంచి శబ్దం రాకుండా ఉండటమే పరువు గల ఆడపిల్ల చేయవలసింది అని ఆమె నమ్మేలా చేస్తారు. వారిని బయట స్కూలు, కాలేజీ, పని ప్రదేశాలు ఎక్కడైనా సరే మగవారి ప్రవర్తన ఎలా ఉన్నా కిమ్మనకుండా ఉండాలి. 'మీటూ' లాటి వాటిలో గొంతు వినిపించారా, చెడిపోయిన ఆ సదరు మహిళ పరమ పవిత్రుడైన మగవాడిపై బురద జల్లాలని చూస్తోందని సంప్రదాయపు జాగిలాలు ఎగబడి నిలువునా ప్రాణాలు తీసేస్తాయి. మనుషుల ఆలోచనా తీరు మారాలి. మార్పు నిరంతరం జరుగుతూనే ఉండాలి. అప్పుడే ఆడపిల్లలు కూడా జీవించగలుగుతారు.

- శ్రీదేవి కవికొండల



చిన్మయి శ్రీపాద...

మధురమైన గాత్రమే కాదు.. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నిర్భయంగా తన కటువైన స్వరాన్ని వినిపించడంలోనూ వెనక్కి తగ్గరు. 'ఆడపిల్లలకు స్వతంత్రం ఎందుకు? వారికి రాత్రి పూట బయట ఏం పని?' అంటూ ఓ సీనియర్ నటి చేసిన వ్యాఖ్యలకు తనదైన శైలిలో ప్రతిస్పందించి ఖండించారు.

ఆమె గళమే ఒక గర్జన

ఆడవారి పట్ల ఇటువంటి భావజాలం కలిగిన దేశంలో తాను ఆడపిల్లగా పుట్టినందుకు బాధను వ్యక్తం చేశారు. అలా అనడాన్ని తప్పుపట్టి భారత దేశాన్ని కించపరిచిందంటూ హెచ్‌సీయూ విద్యార్థి ఆమెపై కేసు దాఖలు చేశారు. అప్పటి నుండి సోషల్ మీడియాలో ఆమెను విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. అందులో బూతులు, తిట్లు, లైంగికదాడి బెదిరింపులు ఎన్నో ఉన్నాయి. అయినా ఆమె తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా వ్యక్తం చేస్తూ మరింత విశ్లేషణలతో వీడియోలలో ఆలోచన రేకెత్తించే విధంగా మాట్లాడుతున్నారు. సరైన ఆలోచనా దృక్పథానికి ఆమె మార్గం చూపిస్తున్నారు.



హైకోర్టు తీర్పు హర్షణీయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ ద్రోహ చట్టం కింద ఎంతో కాలంగా జైల్లో మగ్గుతున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాతోపాటు, మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గతంలోనే బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా తేల్చినా, మహారాష్ట్ర పోలీసులు సుప్రీంకోర్టుకు వెళ్లారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఈ కేసును మరోసారి విచారించాలంటూ బాంబే హైకోర్టుకు సూచించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా పేర్కొందని వివరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడే బాంబే హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తక్షణమే వారిని విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారన్నారు. దేశంలోని 140 కోట్ల మంది భారతీయులూ తన ప్రజలేననీ, దేశంలోని ప్రతి చెల్లీ, ప్రతి తల్లీ తన కుటుంబ సభ్యురాలేనని చెప్పారు. ఇది ఇండియా కూటమికి అర్థం కావడం లేదన్నారు. వాళ్లు తమ కుటుంబాలకు విలాసవంతమైన ఇండ్లను కట్టిస్తే తాను ప్రధాని అయ్యాక నాలు కోట్ల ఇండ్లను పేదలకు కట్టించానని తెలిపారు. వాళ్లలాగా ప్రజలు తలదించుకునే పనులను తాను చేయబోనని నొక్కి చెప్పారు. దళితుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టామన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఉన్నతస్థాయి కమిటీ వేశామనీ, దానిపై కీలక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో బీజేపీ పట్ల ఆదరణ పెరుగుతున్నదనీ, ప్రజల ఆశీర్వాదాన్ని వృథా కానివ్వబోనని హామీనిచ్చారు. తెలుగు ప్రజలు ప్రపంచంలోని పలు దేశాల్లో కీలక భూమిక పోషిస్తున్నారనీ, ఇది చాలా గర్వకారణంగా ఉందని చెప్పారు. మోడీ ఏదైతే చెబుతాడో అదే చేస్తాడన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 370 ఆర్టికల్ రద్దు చేశామనీ, అయోధ్యలో రామమందిరాన్ని కట్టించామని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. ఆ రెండు పార్టీలకు అబద్ధాలు చెప్పడం, దోచుకోవడమే తెలుసునన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుంభకోణానికి పాల్పడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడానికి బదులు ఆ ఫైలును మూసేసిందని విమర్శించారు. 'తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కావాలి..బీజేపీకి ఓటువేయాలి..దేశ భవిష్యత్తు కోసం 400 సీట్లలో గెలిపించాలి' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ముగించారు.

రియల్టర్ల నుంచి రాహుల్‌గాంధీ ట్యాక్స్ వసూలు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు రియల్టర్లు, వ్యాపార వేత్తల నుంచి రాహుల్‌గాంధీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో పదేండ్ల కాలంలో కేసీఆర్ కుటుంబం దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మార్పేమీ రాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కుటుంబ, అవినీతి పార్టీలనీ, వాటికి ఏఐఎం తోడైందని ఆరోపించారు. తెలంగాణ మార్పు రావాలంటే కుటుంబ పార్టీలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మోడీ గ్యారంటీ ఇస్తారంటే కచ్చితంగా నెరవేరుతుందన్నారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో 17 సీట్లలోనూ బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.గ్రామాలు, రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందనే విజన్‌తో ప్రధాని మోడీ వెళు న్నారని చెప్పారు. ఈ సభలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, ఉపనేత వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ నేతలు రఘునందన్‌రావు, బంగారు శృతి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా నిర్దోషి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ఊరట లభించింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న కేసులో 90 శాతం అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను ముంబాయి హైకోర్టు (నాగపూర్ ధర్మాసనం) నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో 54 ఏండ్ల సాయిబాబాతో పాటు మరో ఐదుగురు మహేష్ తిర్కి, హేమ్ మిశ్రా, పాండు నారోట్, విజయ్ తిర్కి, ప్రశాంత్ రహీని 2017 మార్చిలో సెషన్స్ కోర్టు దోషులుగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మీకి ఎస్.ఎ మెనిజేస్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం పక్కన పెట్టింది.

నిందితులపై ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని, ఎటువంటి ఆధారాలను చూపించలేకపోయారని పేర్కొంది. అందువల్లే సాయిబాబాను, మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తున్నామని, వారిపై మోపిన అభియోగాలను కొట్టివేస్తున్నా మని తెలిపింది. యూఏపీఏ కింద నిందితుల్ని బుక్ చేయాలని చేసిన ప్రతిపాదనను కూడా కోర్టు కొట్టేసింది. రూ.50 వేల పూచీకత్తుపై నిందితులను విడుదల చేయాలని ధర్మాసనం తెలిపింది. మరోవైపు హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మహారారష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే ప్రభుత్వం ఇందుకు పూనుకుంది.

దేశంపై యుద్ధం చేస్తున్నారని, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని 2014లో 90 శాతం వైకల్యంతో వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబా, మరో ఐదుగురిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఈ కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చేపట్టింది. 2017 మార్చిలో గడ్చిరోలి సెషన్స్ కోర్టు.. నిందితులందరికీ జీవిత ఖైదు విధించింది. అప్పటి నుంచి సాయిబాబా నాగ్‌పూర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. అయితే సెషన్స్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు 2022 అక్టోబర్ 14న వారిని నిర్దోషులుగా ప్రకటించింది. వెంటనే వారిని జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. తీర్పు వెలువడిన రోజే మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2022 అక్టోబర్ 15న విచారణ జరిపిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో ప్రత్యేక ధర్మాసనం నిందితుల విడుదలపై స్టే విధించింది. వీరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. అనంతరం, సుదీర్ఘ విచారణ తరువాత, 2023 ఏప్రిల్ 19న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిన తీర్పును పక్కన పెట్టి, తాజా పరిశీలన కోసం ఈ విషయాన్ని తిరిగి హైకోర్టుకు రిమాండ్ చేసింది. మళ్లీ మొదటి నుంచీ విచారణ జరపాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే విచారణ చేపట్టిన ముంబాయి హైకోర్టు.. సాయిబాబా సహా మిగతా నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. కాగా.. అరెస్టు నేపథ్యంలో 2014లో ఆయనను ఢిల్లీ యూనివర్శిటీ సస్పెండ్ చేసింది. 2021 మార్చి 31న ఆయనను పూర్తిగా విధుల నుంచి తొలగించింది. అయితే, సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిన హైకోర్టు జస్టిస్ రోహిత్ డియో 2023 ఆగస్టు 2న హైకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారు.

పదేండ్ల పోరాటం తరువాత న్యాయం: ప్రొఫెసర్ సాయిబాబా భార్య వసంత కుమారి

పదేండ్ల పోరాటం తరువాత తమకు న్యాయం జరిగిందని ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా భార్య వసంత కుమారి అన్నారు. తన భర్త ప్రతిష్టను ఎప్పుడూ పణంగా పెట్టలేదని, ఆయనకి తెలిసిన వ్యక్తులు ఆయనను నమ్ముతున్నారని తెలిపారు. పోరాటంలో సాయిబాబాకు మద్దతుగా నిలిచిన న్యాయవాదులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా విడుదల పట్ల ఐలు హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ ద్రోహ చట్టం కింద ఎంతో కాలంగా జైల్లో మగ్గుతున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాతోపాటు, మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడం పట్ల ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె పార్థసారధి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించి కేసులో ఇరికించి జైలు పాలు చేసిందని తెలిపారు. ఇన్ని రోజుల తర్వాత న్యాయం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలకు ఎందరో అమాయకులు బలవుతున్నారని తెలిపారు. ఈ కుట్రకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇన్నేండ్లపాటు జైలు శిక్ష అనుభవించినందుకు పెద్దమొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కోర్టులను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాలనీ, ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆకలి కేకలు



న్యూఢిల్లీ : దేశంలో 67 లక్షల మంది చిన్నారులు రోజంతా పస్తులతో కాలక్షేపం చేస్తున్నారు. 24 గంటల పాటు ఆహారం అనేదే లేకుండా కాలం గడుపుతున్నారు. 2019-2021 కాలానికి సంబంధించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఈ చేదు నిజాన్ని బయటపెట్టింది. దేశంలోని చిన్నారుల్లో 19.3 శాతం మంది రోజంతా ఆకలితో అలమటించిపోతున్నారు. గునియా (21.8 శాతం), మాలి (20.5 శాతం) తర్వాత భారతావని మూడో స్థానంలో నిలవడం సిగ్గుచేటే. పశ్చిమాసియా దేశాలైన గునియా, బెనిన్, లైబేరియా, మాలిలో నెలకొన్న పరిస్థితులే మన దేశంలోనూ కన్పిస్తున్నాయని సర్వే తేల్చింది.

బంగ్లాదేశ్‌లో 5.6 శాతం, పాకిస్తాన్‌లో 9.2 శాతం, డీఆర్ కాంగోలో 7.4 శాతం, నైజీరియాలో 8.8 శాతం, ఇథియోపియాలో 14.8 శాతం మంది చిన్నారులు రోజంతా ఆకలితో నకనకలాడుతుంటే మన దేశంలో ఆ సంఖ్య మరింత అధికంగా ఉండడం గమనార్హం. చిన్నారులకు ఆహారం లభించకపోవడంతో పాటు తల్లులు తమ పిల్లలకు అవసరమైన పాలను అందించలేకపోవడం దీనికి కారణమేనని బాలల పౌష్టికాహార అంశాలకు సంబంధించిన ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆరు నెలల వయసు నుండి 24 నెలల వయసు వరకూ ఉన్న పిల్లల్లో 19.3% మందికి రోజులో 24 గంటలూ పాలు లేదా ఘన ఆహారం లేదా సెమీ ఘన ఆహారం లభించడం లేదు.

ప్రపంచంలోని 92 నిరుపేద, పరిమిత ఆదాయం కలిగిన దేశాల్లో పరిశోధకులు సర్వే నిర్వహించారు. ఈ దేశాల్లో రోజంతా ఆహారం లభించని చిన్నారుల్లో 99 శాతం మంది తల్లి పాలు తాగుతున్న వారే. వీరికి ఆహారం లభించకపోయినప్పటికీ కొంతమేర కేలరీలు అందుతున్నాయి. అయితే ఆరు నెలల వయసున్న చిన్నారులకు తల్లి పాలు సరిపోవు. వారికి అవసరమైన పౌష్టికాహారం తల్లి పాల ద్వారా మాత్రమే లభించదు. వారికి తల్లి పాలతో పాటు అదనపు ఆహారం ద్వారా ప్రొటీన్లు, శక్తి, విటమిన్లు, ఖనిజాలు అందించాల్సి ఉంటుంది.

రోజంతా ఆహారం లభించని చిన్నారులు దక్షిణాసియాలోనే ఎక్కువగా ఉన్నారని సర్వే తెలిపింది. ఆ ప్రాంతంలో 80 లక్షల మంది రోజంతా పస్తులతో గడుపుతుంటే వారిలో ఒక్క భారతదేశంలోనే 67 లక్షల మంది ఆకలి మంటలతో బాధపడుతున్నారు. 'ఆరు నెలల వయసున్న పిల్లలకు ఆహారాన్ని అందించడం తేలికైన పని కాదు. అందుకు సమయం, శక్తి అవసరం. గ్రామాలు, పట్టణాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు ఆదాయం కోసం రోజంతా పని చేయాల్సి వస్తుంది. వారికి తమ పిల్లలకు కావాల్సిన అదనపు ఆహారాన్ని అందించడం సాధ్యం కావడం లేదు' అని పిల్లల వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడు వందన ప్రసాద్ తెలిపారు.

కాజీపేటలో అగ్నిప్రమాదం..

(మొదటిపేజీ తరువాయి)

రైల్వే అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొని రావడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు, ప్రయాణీకులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వే జంక్షన్‌లోని రైల్వే ప్లాట్‌ఫారంకు అతి సమీపంలోని రైల్వే గూడ్స్ యార్డులోని ఆర్ 6 నంబర్ రైలు పట్టాలపై నిరూపయోగంగా ఉన్న 8 ప్రయాణీకుల (ఖండం బోగీలు) బోగీలను రైల్వే అధికారులు ఈనెల 3వ తేదీ రాత్రి ఉంచారు. కాగా, మంగళవారం ఉదయం రైల్వే గూడ్స్ యార్డు నుంచి విపరీతమైన పొగలు వస్తూ, ఒక్కసారిగా మంటలు ఉవ్వెత్తున లేచాయి. యార్డులో మంటలు ఎగిసి పడుతుండటంతో సంబంధిత రైల్వే అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక దళం సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక ఫైరింజన్ సిబ్బంది ఫైర్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో అగ్నికి ఆహుతి అవుతున్న రైలు బోగీలను వేర్వేరుగా విడదీసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రైల్వే గూడ్స్‌యార్డులో నిలిపి ఉన్న (ఖండం) రైలు జనరల్ బోగీలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పడవేయడంతో ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని రైల్వే అధికారులు భావిస్తున్నట్టు తెలిపారు. కాగా, ప్లాట్‌ఫారంకు అతి సమీపంలో నుంచి మంటలు ఎగిసి పడుతుండటంతో భాగ్యనగర్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్ల కోసం వేచి చూస్తున్న ప్రయాణీకులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ అగ్ని ప్రమాదంపై రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టుతున్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనతో సుమారు రూ.50 లక్షల రైల్వేకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు అధికారులు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ యార్డులోనే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఖండం కోచ్‌లకు, పాత ఫిట్రెన్‌లో అగ్గి పెట్టారని, అదేవిధంగా 2016లో ఈ యార్డులో గుర్తు తెలియని వ్యక్తులు తాగి పడేసిన సిగరేట్‌తో రెండు నిరూపయోగంగా ఉన్న బోగీలు దగ్ధమైనమైనట్టు గుర్తుచేశారు. రైల్వే యార్డులో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనా స్థలాన్ని ఆర్పీఎఫ్, జీఆర్పీ, రైల్వే అధికారులు తదితరులు సందర్శించారు.

మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్‌ఎస్ ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గాల నాయకులతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. నాగర్ కర్నూల్ అభ్యర్థిత్వం ఇంకా ఖరారు కాలేదు. బీఎస్పీతో పొత్తు నేపథ్యంలో ఆ స్థానం నుంచి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్య నాయకులతో చర్చించి నాగర్ కర్నూల్ అభ్యర్థిపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

యువత పస్తులుంటూ జైశ్రీరామ్ అనాలా..?

(మొదటిపేజీ తరువాయి)

మరణించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

లోక్‌సభ ఎన్నికలయ్యాక రాహుల్‌గాంధీ సమన్లు : అసోం సీఎం

గౌహతి : భారత్ జోడో న్యాయ్ యాత్రలో హింసాత్మక ఘటనల కేసులో రాహుల్ గాంధీకి లోక్‌సభ ఎన్నికల తరువాత సమన్లు జారీ చేస్తామని, పోలీసు విచారణకు భౌతికంగా హాజరుకావాల్సి ఉంటుందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మంగళవారం తెలిపారు. 'ఎవరైనా సరే చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు సమన్లు జారీ చేయబడతాయి. రాహుల్‌గాంధీకి కూడా సమన్లు వెళ్తాయి' అని శర్మ అన్నారు. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే జాకీర్ హుస్సేన్, అసోం పీసీసీ చీఫ్ భూపేన్‌కుమార్ బోరాలకు సమన్లు జారీ చేయడం 'విచారణ యొక్క ప్రారంభం' మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. జనవరిలో గౌహతిలోని ప్రధాన వీధుల్లో భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు బారికేడ్లు ధ్వంసం చేసిన ఘటనపై అసోం పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.



100 పరీక్ష

ఏ క్రికెటర్‌కు అయినా 100 టెస్టులు అత్యంత ప్రత్యేకం. జాతీయ జట్టు తరఫున ఓ టెస్టులో బరిలోకి దిగితే చాలు అనుకుని మొదలైన ప్రయాణం వందకు చేరుకుంటే అదే అద్భుతం. భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లాండ్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టో ఇప్పుడు ఈ మైలురాయి టెస్టుకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి ఆరంభం కానున్న ధర్మశాల టెస్టులో అశ్విన్, బెయిర్‌స్టో కెరీర్ వందో టెస్టు మ్యాచ్ ఆడనున్నారు.

- అశ్విన్, బెయిర్‌స్టో కెరీర్ వందో టెస్టు
- ధర్మశాలలో మైలురాయి మ్యాచ్‌కు సిద్ధం



స్వదేశీ 'చాంపియన్'

చెన్నై వీధుల్లో టెన్నిస్ బాల్ క్రికెట్‌లో 'సొడుకు' బంతితో మాయజాలం చేసిన కుర్రాడు.. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ ఆ మ్యాజిక్ చూపిస్తాడని, 21వ శతాబ్దపు మాయావీగా నిలుస్తాడని ఎవరు ఊహించారు?!. 37 ఏండ్ల రవిచంద్రన్ అశ్విన్ ఆఫ్ స్పిన్నర్‌గా భారత్‌కు 99 టెస్టుల్లో ప్రాతినిథ్యం వహించాడు. ధర్మశాల టెస్టులో కెరీర్ వందో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఉపఖండంలో మాయగాళ్లకు కొదవలేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో మిస్టరీ మాయ.. ఎంతోకాలం నిలువదు. ఎప్పటికప్పుడు సరికొత్త అస్త్రాలను సిద్ధం చేసుకోవాలి. ఆధునిక టెస్టు క్రికెట్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఆ సవాల్‌కు ఎదురొడ్డి నిలిచాడు. 99 టెస్టుల్లో 507 వికెట్లు పడగొట్టాడు. టెస్టు కెరీర్‌లో 8 పర్యాయాలు పది వికెట్ల ప్రదర్శన, 35 సార్లు 5 వికెట్ల ప్రదర్శన సహా 24 ఇన్నింగ్స్‌ల్లో 4 వికెట్లు కూల్చాడు. మ్యాచ్ విన్నర్‌గా పేరొందినా.. అశ్విన్‌ను ఎక్కువగా 'స్వదేశీ చాంపియన్'గానే చూశారు. అందుకు కారణం లేక పోలేదు. స్వదేశంలో అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్ కంటే ఎక్కువ వికెట్లు అశ్విన్ పడగొట్టాడు. స్వదేశీ టెస్టుల్లో అశ్విన్ ఏకంగా 354 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలలో 70 టెస్టు వికెట్లు పడగొట్టాడు. 2011లో ఢిల్లీలో వెస్టిండీస్‌పై టెస్టు అరంగ్రేటం చేసిన అశ్విన్.. నిజానికి ఎప్పుడో వంద టెస్టుల క్లబ్‌లో చేరాల్సింది. విదేశీ టెస్టుల్లో అశ్విన్‌కు ఎక్కువగా అవకాశాలు దక్కలేదు. అయినా, అవకాశం దొరికినప్పుడు ప్రత్యర్థిని వణికించాడు. బ్యాటర్‌పై మానసికంగా పైచేయి సాధించేందుకు అశ్విన్ వ్యూహా త్మక ఎత్తుగడలు వేయటం లో దిట్ట. స్టీవ్ స్మిత్, జో రూట్‌లపై అశ్విన్ వినూత్న ఎత్తుగడలతో పైచేయి సాధించాడు. మహా మాయగాడు అశ్విన్‌లో ఓ నాణ్యమైన బ్యాటర్ దాగి ఉన్నాడు. 99 టెస్టుల్లో బ్యాట్‌తో అశ్విన్ మెప్పించాడు. 26.47 సగటుతో 3309 పరుగులు చేశాడు. ఐదు సెంచరీలు, 14 అర్థ సెంచరీలు అశ్విన్ ఖాతాలో ఉన్నాయి. ధర్మశాలలో మైలురాయి మ్యాచ్ కు సిద్ధమవుతున్న అశ్విన్..2018 ఎడ్జ్‌బాస్టన్ టెస్టు, 2017 బెంగళూర్ టెస్టు మ్యాచులను తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనలుగా తెలిపాడు.

అనుకోకుండా 'వంద'!

జానీ బెయిర్‌స్టో. ఇంగ్లాండ్ వికెట్ కీపర్ బ్యాటర్. ఇంగ్లాండ్ జట్టులో పరుగుల వేటలో నమ్మకమైన ఆటగాడు జో రూట్. పరుగుల వేటలో విధ్వంసకుడు బెన్ స్టోక్స్. ఈ ఇద్దరి మేళవింపే జానీ బెయిర్‌స్టో అని ఇంగ్లీశ్ క్రికెట్ పండితులు కితాబిస్తారు. అందుకు తగినట్టే బెయిర్‌స్టో ధనాధన్ జోరు ఉంటుంది.. కానీ అందులో నిలకడే లోపించింది. వైట్‌బాల్ ఫార్మాట్‌లో బెయిర్‌స్టో సత్తా, సామర్థ్యంపై వాదనలకు చోటు లేదు. కానీ టెస్టుల్లో ఇతడి గణాంకాలు అందుకు ఉసిగొల్పుతున్నాయి. ఇంగ్లాండ్ తరఫున 100 టెస్టులు ఆడిన 16వ ఆటగాడిగా నిలువనున్న బెయిర్‌స్టో ఓ చెత్త రికార్డునూ మూటగట్టుకున్నాడు. వంద టెస్టులు ఆడిన ఆటగాళ్లలో అతి తక్కువ బ్యాటింగ్ సగటు (36.42) కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. 2012లో లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌పై అరంగ్రేటం చేసిన జానీ బెయిర్‌స్టో.. ధర్మశాలలో కెరీర్ 100వ టెస్టు ఆడటం కొంతమందికి ఆశ్చర్యం కలిగించేదే. అందుకే బెయిర్‌స్టో 100వ టెస్టు అనుకోకుండా జరిగిందనే చెప్పాలి!. ఇంగ్లీశ్ క్రికెటర్‌గా జానీ బెయిర్‌స్టో అవకాశాలు పుష్కలంగా దక్కించుకున్నాడు. కెరీర్ ఆరంభంలో బెయిర్‌స్టో చూపిన దూకుడు, జోరు ఆ తర్వాత నెమ్మదిగా కనుమరుగయ్యాయి. టెస్టు కెరీర్‌లో బెయిర్‌స్టో ఇప్పటివరకు 12 సెంచరీలు, 26 అర్థ సెంచరీలే చేశాడు. 58.68 స్ట్రయికరేట్‌తో 5974 పరుగులు చేశాడు. 2016, 2022 బెయిర్‌స్టో టెస్టు కెరీర్‌లో అత్యుత్తమం. 1470 పరుగులు, 70 వికెట్లలో భాగస్వామ్యం (క్యాచ్, స్టంప్డ్)తో 2016 క్యాలెండర్ ఇయర్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వికెట్ కీపర్‌గా నిలిచాడు. నాలుగు సెంచరీలు సహా 681 పరుగులతో 2022లో బజ్‌బాల్ మేనియాలో అదరగొట్టాడు. 2018 శ్రీలంకతో టెస్టులో అసమాన శతక ఇన్నింగ్స్, 2022 హెడింగ్లే ఇన్నింగ్స్‌తో బెయిర్‌స్టో అభిమానుల హృదయాల్లో చోటు సాధించాడు. ప్రస్తుత భారత్‌తో టెస్టు సిరీస్‌లో బెయిర్‌స్టో మంచి ఆరంభాలను సద్వి నియోగం చేసుకోలేదు. కెరీర్ వందో టెస్టులో తనదైన భయమెరు గని ధనాధన్ ఇన్నింగ్స్ ఆడేందుకు జానీ బెయిర్‌స్టో ఎదురుచూస్తున్నాడు. బెయిర్‌స్టో తండ్రి డెవిడ్ బెయిర్‌స్టో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్. తండ్రి వికెట్ కీపర్ కావటంతో బెయిర్‌స్టో వికెట్ కీపర్‌గా జట్టులో నిలిచేందుకు ఆసక్తి చూపిస్తాడు.

నవతెలంగాణ క్రీడావిభాగం

ధర్మశాలలో స్పిన్ పిచ్?

ధర్మశాల : భారత్, ఇంగ్లాండ్ ఐదో టెస్టుకు ధర్మశాలలో సైతం 'స్పిన్ పిచ్' సిద్ధమవుతోంది. 3-1తో సిరీస్ టీమ్ ఇండియా సొంతమైనా.. రోహిత్, ద్రవిడ్ ద్వయం ప్రత్యర్థికి ఎటువంటి అవకాశం ఇచ్చే ఆలోచనలో లేరు. దీంతో ధర్మశాలలో ఊరట విజయంపై కన్నేసిన ఇంగ్లాండ్‌కు ఇది కాస్త మింగుడు పడని వార్తే. సహజంగా ధర్మశాల పిచ్ పేసర్లకు అనుకూలం. కానీ 2022లో ఇక్కడ పిచ్‌ను కొత్తగా తయారు చేశారు. అప్పట్నుంచి ఇక్కడ స్వల్ప స్కోర్లు నమోదవుతున్నాయి. ఈ సీజన్ రంజీ ట్రోఫీలో ఇక్కడ సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 288 పరుగులు. వారం రోజులుగా ఇక్కడ వర్షం, మంచుతో పిచ్ రూపకల్పన సాధ్యపడలేదు. క్యూరేటర్, మైదాన సిబ్బంది ఇప్పుడిప్పుడే పూర్తి స్థాయిలో పిచ్‌పై పని చేస్తున్నారు. ఇక భారత్, ఇంగ్లాండ్ క్రికెటర్లు మంగళవారం ధర్మశాల స్టేడియంలో ముమ్మర సాధన చేశారు. ఇరు జట్ల నుంచి వందో టెస్టుకు సిద్ధమవుతున్న అశ్విన్, బెయిర్‌స్టోలు ప్రాక్టీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్, రజత్ పాటిదార్, జశ్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, సర్ఫరాజ్ ఖాన్ సహా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రాక్టీస్ సెషన్లో పాల్గొన్నారు. ఇంగ్లాండ్ నుంచి ఒలీ పోప్, ఒలీ రాబిన్‌సన్, బెన్ స్టోక్స్, మార్క్‌వుడ్, జేమ్స్ అండర్సన్, జో రూట్ సాధన చేశారు.

ఇంగ్లాండ్, భారత్ క్రికెటర్ల ముమ్మర సాధన

ఛేదనకు చాన్స్?

భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో ఛేదన అందని ద్రాక్షగా మిగిలింది. లక్ష్యాలను ఛేదించటంలో భారత్, ఇంగ్లాండ్ విఫలమయ్యాయి. స్పిన్ పిచ్‌లు, నాల్గో రోజు ఆటలో పిచ్ పగుళ్లతో పరుగుల వేట గగనమైంది. కానీ ధర్మశాల పిచ్ ఛేదనకు అనుకూలమని చెప్పవచ్చు!. పిచ్ స్వభావ రీత్యా స్పిన్నర్లకు అనుకూలించినా.. ఇక్కడ శీతల వాతావరణం పిచ్‌పై పగుళ్లను ఏర్పడకుండా చేస్తుంది. దీంతో బంతిపై మెరుపు పోగానే బ్యాటర్లకు, స్పిన్నర్లకు పిచ్ నుంచి సహకారం లభించనుంది. భారత స్పిన్నర్లు లైన్ అండ్ లెంగ్త్‌తో మాయ చేస్తుండగా, ఇంగ్లాండ్ స్పిన్నర్లు తికమక పడుతున్నారు. తొలి రోజు ఉదయం సెషన్లో పేసర్లకు స్వింగ్ లభించే అవకాశం ఉన్నప్పటికీ.. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం లేకపోలేదు!.

గెలుపు వాకిట విదర్భ!

321 ఛేదనలో మధ్యప్రదేశ్ 228/6
రంజీ ట్రోఫీ సెమీఫైనల్



నాగ్‌పూర్ : విదర్భ, మధ్యప్రదేశ్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్ రసవత్తరంగా సాగుతుంది. నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ గెలుపు వాకిట నిలిచినా.. మధ్యప్రదేశ్ ఆశలు వదులుకోలేదు!. 321 పరుగుల ఛేదనలో మధ్యప్రదేశ్ 228/6తో పోరాడుతుంది. ఓపెనర్ యశ్ దూబె (94, 212 బంతుల్లో 10 ఫోర్లు), హర్ష్ గౌలి (67, 80 బంతుల్లో 11 ఫోర్లు) అర్థ సెంచరీలతో మధ్యప్రదేశ్‌ను రేసులో నిలిపారు. హిమాన్షు మంత్రి (8), సాగర్ సోలంకి (12), శుభమ్ శర్మ (6), వెంకటేశ్ అయ్యర్ (19) నిరాశపరిచారు. నాల్గో రోజు ఆట చివర్లో యశ్ దూబె వికెట్‌తో విదర్భ విజయానికి చేరువైంది. సరాన్ష్ జైన్ (16 నాటౌట్), కుమార్ కార్తికేయ (0 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. మధ్యప్రదేశ్ విజయానికి మరో 93 పరుగులు అవసరం కాగా, విదర్భ విజయానికి మరో 4 వికెట్ల దూరంలో నిలిచింది. అంతకుముందు యశ్ రాథోడ్ (141, 200 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సులు), అక్షయ్ (77), అమన్ (59) రాణించటంతో విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 402 పరుగుల భారీ స్కోరు సాధించింది. నేడు ఉదయం సెషన్లోనే ఫైనల్‌కు చేరే జట్టు ఎవరిదో తేలనుంది.

వాంఖడెలో టైటిల్ పోరు : రంజీ ట్రోఫీ ఫైనల్‌కు ముంబయి వాంఖడె స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. తమిళనాడుపై ఇన్నింగ్స్ విజయంతో ముంబయి రికార్డు 48వ టైటిల్ పోరుకు చేరుకున్న సంగతి తెలిసిందే. రంజీ ట్రోఫీ లీగ్ దశలో ముంబయికి ఎక్కువ పాయింట్లు ఉన్నాయి. టోర్నమెంట్ నిబంధనల ప్రకారం ఫైనల్‌కు విదర్భ, మధ్యప్రదేశ్‌లలో ఎవరు చేరినా.. ఆతిథ్య హక్కులు మాత్రం ముంబయికే దక్కుతాయి. 'ముంబయి క్రికెట్‌కు అర్థ శతాబ్ద కాలంగా వాంఖడే స్టేడియం కేంద్రంగా కొనసాగుతుంది. రంజీ ట్రోఫీ ప్రాముఖ్యత దృష్ట్యా టైటిల్ పోరు వాంఖడే నిర్వహించటం సముచితం' అని ముంబయి క్రికెట్ సంఘం కార్యదర్శి అజింక్య నాయక్ అన్నారు.

సాత్విక్ జోడి శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్

పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భారత అగ్రశ్రేణి డబుల్స్ స్టార్స్ శుభారంభం చేశారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడి తొలి రౌండ్లో వరుస గేముల్లో గెలుపొందారు. 21-13, 24-22తో మలేషియా షట్లర్లపై విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, గాయత్రి జంట సహచర తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్పలపై పైచేయి సాధించారు. మూడు గేముల హోరాహోరీ మ్యాచ్‌లో 16-21, 21-19, 21-17తో ట్రెసా, గాయత్రి గెలుపొందారు. మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ 15-21, 21-15, 21-3తో కెంటా సునేమియా (జపాన్)ను చిత్తు చేశాడు. 8-21, 15-21తో టాప్ సీడ్ విక్టర్ చేతిలో ప్రియాన్షు రజావత్ పరాజయం పాలయ్యాడు.



నాగల్ మెరిసె..!

ఇండియన్ వెల్స్ టోర్నీ

ఇండియన్‌వెల్స్ : భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ జోరు కొనసాగిస్తున్నాడు. ఇండియన్ వెల్స్ టోర్నీ అర్హత రౌండ్‌లో నాగల్ ముందంజ వేశాడు. అర్హత రౌండ్ తొలి మ్యాచ్‌లో 6-2, 6-2తో వైల్‌కార్డ్ ఎంట్రీ స్టెఫాన్ (అమెరికా)ను చిత్తు చేశాడు. ప్రత్యర్థి ఒక్క బ్రేక్ పాయింట్ కోల్పోని సుమిత్ నాగల్ 68 నిమిషాల్లోనే లాంఛనం ముగించాడు. నేడు రెండో రౌండ్లో సియోంగ్ హంగ్‌తో నాగల్ తలపడనున్నాడు.





గోపీచంద్

భీమాగా ఎప్పటికీ గుర్తుంటా..

హీరో గోపీచంద్ నటించిన మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ఎ హర్ష దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్స్‌గా నటించారు. ఈనెల 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మీడియాతో సంభాషించారు.

- దర్శకుడు హర్షని పోలీసుకి సంబంధించి ఏదైనా డిఫరెంట్ కథ ఉంటే చెప్పమన్నాను. ఈ కథ చెప్పాడు. కథ, భీమా క్యారెక్టరైజేషన్ చాలా నచ్చింది. అలాగే కథలోని సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా చాలా నచ్చింది. రాక్షసుడిని చంపాలంటే బ్రహ్మరాక్షసుడు రావాలని అలా పెట్టారు. భీమా కమర్షియల్ ప్యాక్ట్ మూవీ. భీమా పాత్రలో ఇంటెన్సిటీతోపాటు ప్రేమ, ఎమోషన్స్, రోమాన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. సినిమా చూసి బయటికి వచ్చాక భీమా ప్రేక్షకుడి మనసులో నిలబడిపోతాడనే నమ్మకం ఉంది.
- ఈ కథలో సెమీ ఫాంటసీ ఎలిమెంట్‌ని దర్శకుడు చాలా అద్భుతంగా బ్లెండ్ చేశాడు. ప్రతి యాక్షన్ సీక్వెన్స్‌లో అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. ఆ ఎమోషన్ ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను.
- గోలీమార్‌లో డిఫరెంట్ కాప్‌గా చేశా. 'ఆంధ్రుడు' లవ్ స్టోరీ మీద నడుస్తుంది కానీ దాని నేపథ్యం పోలీసు కథే. శౌర్యం కూడా భిన్నమైన కథ. ఈ మూడు చిత్రాలకు పూర్తి వైవిధ్యమైన పాత్ర భీమా. ఇలాంటి పోలీసు కథలో సెమీ ఫాంటసీ ఎలిమెంట్ చాలా కొత్తగా ఉంటుంది. అదే నాకు చాలా ఆసక్తిని కలిగించింది.
- ట్రైలర్ చూసి ఈ సినిమాని 'అఖండ'తో పోలుస్తున్నారు. దానికి దీనికి సంబంధం లేదు. అఘోరాలు, కలర్ పాలెట్, మ్యూజిక్ వలన అలా అనిపించవచ్చు. కానీ భీమా పూర్తిగా డిఫరెంట్ స్టోరీ. అయితే నిజంగా 'అఖండ'తో పోలిస్తే మంచిదేగా (నవ్వుతూ). భీమా పరశు రామక్షేత్రంలో జరిగే కథ. అందుకే అలాంటి నేపథ్యం తీసుకున్నాం.
- హర్ష చాలా అనుభవం ఉన్న దర్శకుడు. చాలా అద్భుతంగా తీశాడు. చాలా ఆసక్తికరమైన స్క్రీన్ ప్లే చేశాడు. చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. మలుపులు, సెమీ ఫాంటసీ ఎలిమెంట్స్ చాలా కొత్తగా ఉంటాయి. ఇందులో హీరో క్యారెక్టర్ పేరు భీమా. ఈ కథకు అదే పేరు యాప్ట్ అని టైటిల్‌గా పెట్టాం. అలాగే ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ ఈ రెండు పాత్రలు సినిమాలో చాలా కీలకంగా ఉంటాయి. కథకు కావాల్సిన పాత్రలు. పాత్రలకు ఒక పర్పస్ ఉంది. అది స్క్రీన్‌పై చూస్తే మరింత ఆసక్తికరంగా ఉంటుంది.
- రవిబస్రూర్ మ్యూజిక్ ట్రైలర్‌లో అద్భుతంగా ఉంది. దానికి మించి సినిమాలో ఉంటుంది. మంచి మ్యూజిక్ ఇవ్వాలనే అంకితభావంతో పని చేశాడు. మా నిర్మాత రాధామోహన్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. సినిమా కోసం ఆయన రాజీపడరు. ఈ సినిమాకి మంచి బడ్జెట్ పెట్టి మరీ తీశారు.
- ప్రభాస్‌తో కలిసి నటించాలని నాకూ ఉంది. అయితే మంచి కథ దొరకాలి. అలాంటి కథ దొరికితే కచ్చితంగా

నవచిత్రం

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా



సత్యరాజ్, రవితేజ

వెంకట శివ సాయి ఫిల్మ్స్ పతాకంపై మణికొండ రంజిత్ సమర్పణలో సత్యరాజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ముత్యాల రామదాసు, నున్నా కుమారి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి'. రవితేజ నున్నా హీరోగా, నేహ జురెల్ హీరోయిన్‌గా నటించారు. రామిశెట్టి వెంకట సుబ్బారావు, కలవకొలను సతీష్ సహ నిర్మాతలు. ఈ సినిమా ఈనెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హీరో రవితేజ, దర్శకుడు సత్యరాజ్ మీడియాకి చిత్ర విశేషాలను తెలియజేశారు.

దర్శకుడు సత్యరాజ్ మాట్లాడుతూ, 'హీరోయిన్‌ని ఎవరు హత్య చేశారనే పాయింట్‌తో ఎంతో ఇంటెన్స్‌గా కథ నడుస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లోకి ముత్యాల రామదాసు వచ్చాక సినిమా స్వరూపమే మారిపోయింది. చిన్న సినిమా కాస్తా పెద్ద సినిమా అయిపోయింది. సంగీత దర్శకుడు రోషన్ పెద్ద సినిమాలకు సంగీతం ఎలా ఉంటుందో ఆ స్థాయిలో ఇచ్చాడు. నేపథ్య సంగీతం అయితే మణిశర్మ స్థాయిలో ఉంటుంది. ఇది కులాల నేపథ్యంలో తీసిన సినిమా కాదు. రెండు కుటుంబాల మధ్య జరిగే ఇంటెన్స్ స్టోరీ ఇది' అని తెలిపారు.

'నటనని స్వతహాగా నేర్చుకుంటూ, దర్శకుల సలహాలు పాటిస్తుంటాను. ఈ సినిమాలో దర్శకుడు సత్య నా నుంచి ఆయనకు కావాల్సిన నటనను బాగా రాబట్టుకున్నారు. ఈ సినిమాలో నేను పోషించిన పాత్రకు అందరూ బాగా కనెక్ట్ అవుతారు' అని హీరో రవితేజ చెప్పారు.

పాస్ చేస్తే.. గొప్ప సినిమాలు తీస్తా



చదలవాడ శ్రీనివాసరావు

పాన్‌ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

కథ మీద నమ్మకం

'బిచ్చగాడు' వంటి సినిమా నిర్మించిన తర్వాత కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఏ సినిమానైనా సక్సెస్ చేస్తారనిపించింది. అందుకే ప్రజలు మనసుకి హత్తుకునే విధంగా, నిజానికి దగ్గరగా నమ్మకంతో చాలా ఖర్చు పెట్టి ఈ సినిమాని నిర్మించాం. ట్రైలర్ రిలీజ్ అయినప్పుడు వచ్చిన రెస్పాన్స్, అలాగే మీడియాకు వేసిన షోలో వచ్చిన రెస్పాన్స్ చూసి మా సినిమాకి 'రికార్డ్ బ్రేక్' యాప్ట్ టైటిల్ అని అందరూ అన్నారు. సినిమా రిలీజ్ అయ్యాక ప్రేక్షకులు కూడా అదే ఫీల్ అవుతారు. ప్రజెంట్ ఉన్న హీరోల్లో అంత బాడీ ఉన్నవాళ్లు వెయిట్ పుటప్ చేయగలిగిన వాళ్లు ఎవరూ లేరు. అప్పటి కాలానికి రామారావు, కృష్ణంరాజు ఉంటే కరెక్ట్‌గా సరిపోతుంది. ఇప్పుడు వీళ్ళు కరెక్ట్‌గా సెట్ అయ్యారు.

8 భాషల్లో రిలీజ్

కొత్త హీరోల పైన, కొత్త వాళ్ళ పైన ఇంత బడ్జెట్ పెట్టడం అనేది కరెక్ట్ అనిపించిందా అని అందరూ అడుగుతున్నారు. సినిమా రిలీజ్ అయ్యాక ప్రజల గుండెల్లో రికార్డ్ బ్రేక్ మంచి సినిమాగా నిలిచిపోవాలి. అందుకోసమే ఎక్కడ రాజీ పడకుండా సినిమా తీశాం. అంతేకాదు ఈ సినిమాని ఎనిమిది భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. అప్పట్లో నేను డైరెక్ట్ చేసిన హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య మంచి సినిమా విజయవాడ, వైజాగ్ లాంటి ప్రాంతంలో చాలా బాగా ఆడింది. అప్పుడున్న కాంపిటీషన్‌కి పెద్ద సినిమాలతో కొంతవరకు పోటీ పడలేకపోయింది. కానీ ఇప్పుడు ఇది ఖచ్చితంగా మంచి సినిమాగా నిలుస్తుంది.

క్వాలిటీ పెరిగింది

సినిమా చూసిన ప్రతివారు కూడా చాలా బాగుంది అన్నారు. ఆర్.నారాయణమూర్తి కూడా సినిమా చాలా అద్భుతంగా వచ్చిందన్నారు. ఈ సినిమా చూసిన విజయ నాగిరెడ్డి, రాజశ్రీ ప్రొడక్షన్స్ వాళ్ల సూచనతో 2.45 నిమిషాల నిడివి గల సినిమాని 20 నిమిషాలు తగ్గించాం. అలా చేయడం వల్ల సినిమా క్వాలిటీ ఇంకా పెరిగింది.

ఓ తల్లి త్యాగం చూస్తారు

బిచ్చగాడు సినిమాలో తల్లి కోసం బిడ్డ కష్టపడతాడు. కానీ ఈ సినిమాలో బిడ్డల కోసం తల్లి ఏం చేస్తుంది అనే కాన్సెప్ట్‌తో వచ్చాం. క్లైమాక్స్ కచ్చితంగా ఆకట్టుకుంటుంది. రెజ్లింగ్ కోసం చైనా వెళ్లడానికి బిడ్డలకి కష్టపడి 10 లక్షలు సంపాదించి చైనా పంపించడం, అదేవిధంగా వాళ్లకి లడ్డూలు ఇష్టమని వాళ్ళు చైనా వెళుతున్న ట్రైంలో తన బ్లడ్ అమ్మి లడ్డూలు తీసుకురావడం. నా కోసం మన భారతదేశం కోసం మీరు గెలిచి రావాలి అనే సన్నివేశాలు చాలా బాగా నచ్చింది.

వార్నర్ బ్రదర్స్ కంటే..

ఈ సినిమా ద్వారా నేను డైరెక్షన్ నేర్చుకున్నా. ఈ సినిమా సక్సెస్ తరువాత మంచి టెక్నికల్ వాల్యూస్‌తో వార్నర్ బ్రదర్స్ తీసే సినిమా కంటే గొప్ప సినిమా తీసి చూపిస్తా. ప్రేక్షకులందరూ పాస్ మార్కులు ఇస్తే నా డైరెక్షన్‌లో ఇంకా మంచి సినిమాలు తీస్తాను.

నయా క్రైమ్ థ్రిల్లర్

విన్ క్లౌడ్ ఎంటర్‌టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ పిక్చర్స్ పతాకంపై జీరో ప్రొడక్షన్స్ సమర్పిస్తున్న తాజా చిత్రం 'మాయ'. రాజేష్ గొరిజవోలు నిర్మాణ సారథ్యంలో రమేష్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ అత్యంత ఘనంగా జరిగింది.

హీరో కిరణ్ ఆవల మాట్లాడుతూ,'డైరెక్టర్ రమేష్ నాని ఈ స్టోరీ చెప్పినప్పుడు సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. సినిమా ప్రివ్యూ వేసినప్పుడు నా నమ్మకం నిజమైంది. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ప్రాణం పెట్టి కంపోజ్ చేశారు. నా తదుపరి మూవీ కూడా వీళ్ళకే ఇస్తున్నాను. నిర్మాత రాజేష్ ఎంతో ఉత్సాహంతో, ఎంతో నమ్మకంతో పెట్టుబడి పెట్టారు' అని అన్నారు.



ఎస్తర్

'రమేష్ ఈ కథ చెప్పినప్పుడు ఇలాంటి కథ ఖచ్చితంగా మెటీరియలైజ్ కావాలని.. బడ్జెట్ గురించి ఆలోచించకండి అని చెప్పాను. హీరోయిన్ ఎస్తర్ రావడం ఈ సినిమాకి ప్రధాన బలం. ఆ తర్వాత ఎంతో అనుభవం ఉన్న సురేష్ కొండేటి చేరడం అదనపు బలంగా మారింది. వీటన్నింటికీ మించి డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మా సినిమాను తీసుకోవడం అనేది విజయంగా భావిస్తున్నాం' అని నిర్మాత రాజేష్ అన్నారు. 'ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ముఖ్య కారణం ప్రొడ్యూసర్ రాజేష్. సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది. కచ్చితంగా అందర్నీ బాగా అలరిస్తుంది' అని అని డైరెక్టర్ రమేష్ చెప్పారు. ఎస్తర్ మాట్లాడుతూ,'ఇది క్రైమ్ స్టోరీ అయినప్పటికీ సినిమాలో ఎమోషన్ సీన్స్ అద్భుతంగా ఉన్నాయి. ఎంతో అద్భుతంగా తెరకెక్కించిన ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

ఆద్యంతం అద్భుతం

విశ్వక్ సేన్ నటించిన తాజా చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రంలో చాందినీ చౌదరి కథానాయిక. ఈ సినిమాకు క్రౌడ్ ఫండ్ చేశారు. వి సెల్యులాయిడ్ ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రం ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు విద్యాధర్ కాగిత మీడియాతో ముచ్చటించారు.'నిజంగా జరిగిన ఓ సంఘటన నన్ను చాలా ఎగ్జైట్ చేసింది. ఆ ఐడియాని రాసిపెట్టుకున్నాను. దీంతో పాటు హిమాలయాల పర్వాతాలు, మంచు, అక్కడ ప్రయాణం అంటే నాకు చాలా ఇష్టం. అలాగే విఠలాచార్య లాంటి సాహస కథలు ఇష్టం. ఇవన్నీ కలసి ఒక ఆలోచనగా మారాయి. మనకి దొరికిన బడ్జెట్‌లో తీసేద్దామనే ఆలోచనతో మొదలుపెట్టాం. క్రౌడ్ ఫండ్ కోసం ఒక పిచ్ వీడియో చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బులతో సినిమాని స్టార్ట్ చేశాం. తర్వాత డబ్బులు అవసరమైతే నిర్మాత బయట నుంచి తీసుకొచ్చారు. తర్వాత ఒక గ్లింప్స్ చూసి యూవీ క్రియేషన్స్ వారు రావడం జరిగింది. నటుల కోసం చూస్తున్నప్పుడు విశ్వక్‌ని అనుకున్నాం. చాలా ఓపెన్ మైండ్‌తో తను ఈ ప్రాజెక్ట్‌ని ఎంపిక చేసుకున్నారు. నిజంగా ఆయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి. ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇవ్వడానికి విజువల్, మ్యూజిక్, టెక్నికల్ పరంగా కొత్తగా ప్రయత్నించామని భావిస్తున్నాం. ట్రైలర్‌లో చాలా పాత్రలు కనిపించాయి. ఇది హైపర్ లింక్ స్టోరీనే. అయితే దాని గురించి ఇప్పుడే చెప్పడం సబబు కాదు. అది సినిమా చూసిన తర్వాత తెలుస్తుంది. అయితే ఆ పాత్రలన్నీ చాలా ఆసక్తికరంగా సాగుతాయి. ఈ సినిమా అంతా ఎంగేజింగ్‌గా ఉండబోతుంది. తర్వాత ఏం జరగబోతుందనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో ఉంటుంది. స్క్రీన్ ప్లే చాలా గ్రిప్పింగ్‌గా, డ్రామా చాలా అద్భుతంగా వుంటుంది. అది ప్రేక్షకులని సినిమాలో లీనం చేస్తుంది'.



విద్యాధర్ కాగిత

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886